# நாச்சியார் - திருமொழி

(தெலுங்கு மொழிபெயர்ப்பு)

# గోదాదేవి - గీతమాలిక


తమిళం :

శ్రీ ఆండాళ్ నాచ్చియార్

తెలుగు అనువాదం :

డా. పుల్లూరి ఉమ



உலகத் தமிழாராய்ச்சி நிறுவனம்

INTERNATIONAL INSTITUTE OF TAMIL STUDIES

சென்னை 600 113

# நாச்சியார் - திருமொழி

(தெலுங்கு மொழிபெயர்ப்பு)

# గోదాదేవి - గీతమాలిక

తమిళం : శ్రీ ఆండాళ్ నాచ్చియార్

తెలుగు అనువాదం : డా. పుల్లూరి ఉమ

అంతర్జాతీయ తమిళ అధ్యయన సంస్థ

సి.ఐ.టి. క్యాంపస్

చెన్నై - 600 113

2003

# BIBLIOGRAPHICAL DATA


| | | |
|---|---|---|
| Title of the Book | : | **Godadevi - Geetha Malika** |
| Translator | : | Dr. P. Uma |
| Publisher & © | : | International Institute of Tamil Studies<br>C.I.T. Campus, Chennai - 600 113<br>Ph: 22542992 |
| Publication No | : | 456 |
| Language | : | TELUGU |
| Edition | : | First |
| Date of Publication | : | 2003 |
| Paper Used | : | 18.6 Kg TNPL Maplitho |
| Size of the Book | : | 1/8 Demy |
| Printing type used | : | 14 Points |
| No. of Pages | : | 18+134 |
| No. of Copies | : | 1000 |
| Price | : | Rs. 40/- (Rupees Fourty Only) |
| Printing | : | Creative Enterprises<br># 203, Arcot Road,<br>Vadapalani, Chennai-26 |
| Subject | : | Telugu Translation of<br>**Nachchiyar Tirumozhi** |

Published with the financial assistance given by the Directorate of Tamil Development, Government of Tamil Nadu under the scheme of "Grants for Good Translation Works"

**Dr. S. Krishnamoorthy**
**Director**
**International Institute of Tamil Studies**
**Tharamani, Chennai-600 113.**

## FOREWORD

The International Institute of Tamil Studies is proud of publishing the book titled GODA DEVI GEETHA MALIKA. It is a Telugu translation of the Tamil version of Nachiyar Thirumozhi. Andal composed Nachiyar Thirumozhi (the sacred speech of the queen) in 143 stanzas consisting of invocations to Kama the God of love etc. The translation is meticulously done by Selvi Dr. P. Uma, M.A., Ph.D., an eminent scholar and specialised in Telugu Translation of Tamil Classics. She has to her credit the earlier Telugu translations such as Thiruppavai titled Bharatha Manjari. This Institute also published her Telugu Translation of PAZHAMOZHI NANOORU during 2002.

In this book, 143 pasurams of Nachiyar Thirumozhi rendered by Andal have been translated in poetical form taking a musical metre having lengthy lines of twelve in each poem. Besides, the musical tunes are also noted then and there. Apart from this, an explanatory note is given at the end of each poem and the underlying philosophy is also excelled by the translator which is noteworthy to mention here.

These poems are classified into three parts for easy reference. The philosophy of nature, philosophy of love and the ultimate reality are the core essence of the original text are clearly carried in the Translation.

I hope that the Telugu knowing population will receive and enjoy the fruit of the text.

Our whole hearted appreciation is always for our **Chairman Hon'ble Minister for Education, Govt. of Tamil Nadu, Thiru. S. Semmalai** and also to **Thiru. P.A. Rāmaiah, I.A.S.,**

**Secretary to Government,** Tamil Development-Culture and Hindu Religious Endowments Department and **Thiru. T. Chandra Sekaran, I.A.S., Additional Secretary to Government,** Tamil Development-Culture Department for their overwhelmed encouragement in all the developmental efforts of this Institute. I am sincerely grateful to the Director of Tamil Development Dr. M. Rajendran for extending eligible financial assistance to publish the Translation work.

My thanks are also to the Creative enterprises, Chennai for the neat execution of this book.

8th July 2003 **Director**

# INTRODUCTION

Nachiyar Tirumazhi of Tamil literature is the treasure house for Love Philosophy, one of the vital thoughts found in Vaishnavism called MADHURA BHAKTI. Andal, incarnation of Bhu Devi, One among the consorts of Lord Vishnu happened to be the foster daughter of Periyalvar alias Vishnuchita. Andal is familiarly known as Kodai in Tamil and Goda Devi in Telugu. She rendered thirty Pasurams, in Tamil known as Thiruppavai in an eloquent musical note in praise of her beloved God Sri Krishna. The other 143 Pasurams she wrote are called Nachiyar Thirumozhi. All these are included in the First Part of Nalayara Divya Prabandam, 4000 Devotional Hymns written by the renowned twelve Alvars, the great pioneers of Vaishnavism All these pasurams are recited in the Vaishnava temples according to the Vaishnava agamas and temple rituals.

Thiruppavai gained the popularity among the devotees of Lord Vishnu. They are recited in the Vishnu temples especially in early hours of dawn in the Tamil month of Margazi, equivalent to the middle of December and the first half of January. These Pasurams has gained another importance in the life pattern among the unmarried maids. It is a strong belief that the maids recite these Pasurams in the prescribed time with great devotion and faith over Lord Krishna, they are sure to procure their spouse of their wish.

Among the 147 Pasurams of Nachiyar Thirumozhi the sixth class of the second part named as ***Varanam Ayiram*** are usually sung by women at the time of marriage function particularly when the groom comes in a procession if the family is more attached to the vaishnava tradition.

Thiruppavai has been translated in Telugu by setting with the musical rhythm in bringing melody of the original as far as possible and the text was published and compiled as one of the poetic versions in the book entitled Bhaktha Manjari 1985 by me. Now this book is the translation of the Tamil version of Nachiyar Thirumazhi in Telugu having the title as ***Goda Devi Geetha Malika***. The translation is done in poetical form taking a musical meter having a lengthy lines of twelve in each poem. Accordingly the musical tunes are also noted here and there. In addition to this an explanatory note is given at the end of each poem and the underlying philosophy is also mentioned.

For an easy reference these poems are classified into three divisions The first part is entitled ***Prakruthi Dharmam*** means philosophy of Nature consists of forty one Pasuranms in four classes according to the original text. The second part is given a name as ***Pranaya Siddhantalu*** having the meaning as Philosophy of Love. This part is comprised with seventy two Pasurams in seven classes which are given separate names as in the original. The third part is called ***Paratatva Satyamu*** which means Ultimate Reality. Here in this part thirty pasurams are included with three class division.

A detailed preface is given in the beginning of the work in Telugu where the life story of Andal, her dedicated Love of her beloved Lord, her

ritual offerings of the flower garland to the Lord and the rendering of the pasurams are explained The gradual spiritual growth of the devotee in this particular tradition called Madhura Bhakthi is also explained in its stages In addition to this a brief narration is also added regarding the central theme of the Pasurams based on the class division.

In the first part four classes are included. Among them the first ten Pasurams are rendered in regard to the Lovegod, as ***Kamadevarchana*** where the girls offer their prayer to Kamadeva and beseeching him to unite them with their beloved Lord. The method of their worship is clearly narrated. The second ten Pasurams deals with the playful pranks enacted by Lord Krishna in his boyhood days The beloved maids hailed their Lord in thousands of names. Hence this is named as ***Namam Ayiram*** in Telugu as ***Veyi Namamulu.*** In the third ten Pasurams again it is a deep lamentation of the maids t᷄ their Lord to give away their clothing, when he takes them away at the time of bathing. In Tamil this is named as ***Kozhi yazaippadan Munne***, in Telugu the name is given as ***Kodi Knyaka Munne*** In fourth ten pasurams where the profound thought of Philosophy of Nature is described. ***Thelliyar Palar*** is the name given to this and it is ***Nithya Baddha Mukthulu*** in Telugu.

The Second part is included with seven classes ***Kuzhir Pattu*** is the first ten where the maids send their love message to their Lord through the bird Kukku It is ***Kokilanaduguta*** in Telugu In the second ten the sweet . am of Andal is descirbed that her groom Lord Krishna decked as bride groom is coming in grand procession surrounded by thousands of great elephants towards her for the divine wedlock with her. These are the popular songs known as ***Varanam Ayiram. Varana Sahasram*** in Telugu. The next ten Pasurams in the third class refers to the Counch of Lord Krishna which is having the favouable occasion to absorb the sweetness of the lip folds of Lord by staying at the side of his mouth since the Lord blows the Counch frquently. By taking this thought the maid addresses the Counch to explain the perfumed sweet smell of the lip folds of their Lord and at the same way she projects her jealous attitude towards the Counch It is interestingly named with the title ***Karpuram Narumo*** and as ***Karpura Parimalamu*** in Telugu. In the fourth class of the ten pasurams are about the love message of the maid sent through the rainy clouds. The forlorn deep feelings of the beloved soul are narrated since the separation has become intolerable to her and quest for unity is requested here In other words it is called as Virahageetham, a term used used in the epics. This portion is given a title ***Megavidu Thudu*** It is called ad ***Megha Sandesamu*** in Telugu The next ten Pasurams are included in the fifth class. Andal and her companions are anxious to get the divine union with their Lord So they are enchanted by the beauty of nature and hails the beauty as whole by requesting them to serve as the messenger to their Lord. The beautiful reddish orange tint in the nature attracted them which the rainy bees and other colorful birds and flowers used to shed the color in the blue sky So the addressed them as ***Sindura Cempodi***, In Telugu it is given as ***Sindura***

***Varna Churnamu***. Again the maids are maddening when they see the flowers and birds with black tint since they remember the black color of their Lord. The ten Pasurams in the seventh class are concerned to this class is given a name as ***Karkodal Pookkak*** which is believed to be in the color of blackness In Telugu it is given a name as ***Karkota Puvvulu*** The next ten Pasurams of the eighth class are about how Andal enjoys in her deep feeling of love towards her beloved in herself and openly she declares her thoughts to her mother and other elderly women that it is the duty of them to unite to her with her lord. This enjoyable sequence is called as ***Tham Ugakkum*** This idea is translated in Telugu as Thalluatho Nivedincuta with a caption as ***Thanuga Muriyucu***.

The third part is most important in which the main theme of the poetic sence is explained The first class of this part is having ten pasurams where Andal wished to have the ornaments of her Lord, so that she can pacify her sorrowful feelings which she got through the separation of the lord. Here she requested to have the Garland of Thulsi whioh her lord wears for ever. This ten songs are given a name as ***Mattriundir***. In Telugu it is given a title as ***Vilakshana Bhavalu*** The ten Pasurams in the second class is also having the same theme of the previous. Andal requested for the garments wore by her lord. The garland of flowers used, the flute blew by her beloved were the things which give an immense fondness and affection to her. So she was in want of these things. This set of Pasurams are called as ***Kannan Ennum, Krishnudane*** is the Telugu term given for this. The next final step she took was narrated in the last ten Posurams of the third class in this part. Andal decides to make a move towards Brindavanam where her beloved lord resides she seeks every ones help and requests them to take her to her lord. Hence these Pasurams are given a name as ***Vrinda Vanatthe*** In Telugu it is ***Krishna Darsanam***

The Philosophy of Nature, Philosophy of Love and the Ultimate Truth are the essence of the text, which are carried clearly in the translation. I assure that the Telugu knowing population will relish and enjoy the text by this translated text.

In this regard I express my deep sence of gratitude to Dr. Ramar Ilango, Former Director, International Institute of Tamil Studies, Chennai, for procuring permission to publish this book with the financial assistance given by the Director of Tamil Development. Tamil Nadu. I am very much indebted to record my heartfelt sincere and profound thanks to Dr. S.Krishnamoorthy, The Director of International Institute of Tamil Studies, Chennai for bringing this book in time and giving encouragement to me by all times.

**Dr. Selvi P.UMA.** M.A., Ph.D

Principal (Retd)

# ఆశంస

శ్రీ వైష్ణవ సంప్రదాయ ప్రవర్ధకులు, ప్రవర్తకులు, ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు. శ్రీ వైష్ణవాచార్యపరంపరకి ఆద్యుడు శ్రీమన్నాథముని. వారికి ముందు ఉన్నది దివ్యసూరి (లేక ఆళ్వార్ల) పరంపర. పన్నిద్దరాళ్వార్లలో అంగిభూతులు శఠకోపులనే నమ్మాళ్వారు. ఈ ఆళ్వార్లలో 11 మంది పురుషులైతే, వారి మధ్య నాయకమణిగా ఆండాళ్లుతల్లి ఒక్కతే విశిష్ట వైభవంతో, స్త్రీ జాతికే అలంకారంగా, ఆదర్శంగా ప్రకాశిస్తోంది. ఈమెనే తమిళ భాషలో చూడికొడుత్తనాచ్చియార్ అని, నాచ్చియార్ అనీ, సంస్కృత భాషలో గోద అని, ఆముక్తమాల్యద అనీ వ్యవహరిస్తారు. ఈమె తమిళభాషలో మధురభక్తి బంధురంగా పాడిన ప్రబంధమే ''నాచ్చియార్ తిరుమొழி''. దీనిని తేటతెనుగులోకి అనువదించిన ఆచార్య డా॥ పి. ఉమగారు ధన్యురాలు.

ఆండాళమ్మకి గల భగవద్భక్తి అత్యంత విలక్షణం. ఆమె ''పెరియాళ్వారు'' అనబడే విష్ణుచిత్తులకి తులసీ కాననంలో లభించిన అయోనిజ. చిన్నప్పటి నుండి శ్రీ రంగనాథస్వామినే తన ''భర్త''గా భావించి, సేవించి, మరులుకొని, ఆ స్వామికని ప్రత్యేకించిన విరులు తానే ముడుచుకొని ''నేనాభువన సుందరునికి తగుదునో'' అని అద్దంలో నిత్యము చూసుకొని పరీక్షించుకొనే పవిత్ర చరిత్ర. జన్మతః స్త్రీకాబట్టి ఆమెకి భగవంతునిపై ఏర్పడిన ప్రేమము, కామము, విరహము - ఏదైనా కానివ్వండి - సహజత్వంతో, ఉట్టి పడుతూంటాయి. ఇది, తమిళ భాషలో ఆమె రచనలని చదవగలిగించిన వారికి అనుభవ గోచరమైన విషయం.

దివ్యసూరులలో నమ్మాళ్వారు, తిరుమంగైయాళ్వారు, కులశేఖరాళ్వారు కూడ తమపై స్త్రీత్వాన్ని ఆరోపించుకొని, భగవంతుణ్ణే తమ నాయకునిగా అనుసంధించుకొని, అనుభవించారు. అయినా, జన్మతః పురుషులు కాబట్టి వారి మధురభక్తి, నాయికాభావన,

అసహజమూ, కృత్రిమమూ అనకతప్పదు. సహజంగ ఆకాశంపై ప్రకాశించే చంద్ర బింబానికి చిత్రకారుని బొమ్మలో కనిపించే చంద్ర బింబానికి ఎక్కడ సామ్యం? అందువల్లనే ఆండాళమ్మ రచనల్లోని మధుర భక్తి, నాయికాభావం జగత్ప్రఖ్యాతి పొందాయి.

గోదాదేవి రచించిన ''తిరుప్పావై'' ప్రబంధం ప్రతిధనుర్మాస పుణ్య కాలంలోను అనుసంధించబడే ఉత్తమ రచన. ఆమెదే మరోరచన ''నాచ్చియార్ తిరుమొழி'' అనే ప్రకృత ప్రబంధం. ఇది 143 పాశురాల సంపుటి. వీటిలో మొదట ఆమె మన్మథుని పూజించి, ''తిరువేంగడ నాథుని నాకు పతిగా కూర్చ''మని ప్రార్థిస్తుంది. మరి ''రంగనాథునిపై గదా ఆమె మరులుకొన్నది?'' నిజమే. ఆమె దృష్టిలో రంగనాథునికి, తిరువేంగడనాథునికి మధ్య భేదం లేదు. ఈ 'నాచ్చియార్ తిరుమొழி''లో ఆండాళ్లు తల్లి వేయినామాల ఆ స్వామిని నుతించి, తానూ ఒక గోపికయ్యై, వస్త్రాలిమ్మని శ్రీకృష్ణునర్థించి, ఆయన జాడని తెల్పమని కోకిలని అడిగి, ఆయనకి, తనకి వివాహమవుతున్నట్లు అందమైన కలగని, మేఘంతో సందేశమంపుతుంది. ఇలా, ఆమెలోనున్న కామం/ప్రణయం సహస్రముఖాలతో వెల్లి విరియగా ఆ సహస్ర ఫణిశయనుని కైంకర్యమే తన జీవితలక్ష్యంగా ప్రకటిస్తుంది.

ఈ నాచ్చియార్ తిరుమొழி నిజంగా భావోత్తేజకమైన పదునైన రచన. భావము, భాష - ఒకదానితో ఒకటి పోటీపడుతూ, సెలయేటిగలగలలతో ప్రవహించే భావకవిత. ఈ ప్రశస్త, పవిత్ర రచనని చక్కని తెలుగులో తేటగీతాలుగా, సీసమాలికలుగా, ఆట వెలదులుగా అలవోకగా అందించిన డా॥ ఉమగారు శ్లాఘనీయురాలు వీరికి తెలుగు తమిళభాషల్లో సమానమైన, సమగ్రమైన అధికారము, ఆదరము ఉన్నాయి. మద్రాసు రాజధానీ కళాశాలలో అనేక సంవత్సరాలు తెలుగు ఆచార్యపదవిని, తచ్ఛాఖాధ్యక్ష పదవిని వహించి, ఆంధ్ర భాషకి ఎనలేని సేవ చేసిన మహిళామతల్లి యీమె. వీరి అనువాదంలో, మూలంలోని భావాలు యథాతథంగా సహజ సుందరంగా గోచరిస్తున్నాయి. అనువాదమనేది నిజానికి కత్తిపై సాము. ముక్కకిముక్కగా కాకుండా,

చక్కని నుడికారం, సామెతల ఆమెతలు, వీరి అనువాదంలో గుబాళిస్తున్నాయి (ఉదా॥ 2:5:3; 2:6:4; 2:10:5) డా॥ ఉమగారు ప్రతి పద్యానికి తరువాత సంగ్రహమైన నిశితమైన విమర్శనని కూడా జోడించి, జిజ్ఞాసువులకెంతో ఉపకారం చేశారు. ఒక్కొక్క పాశురం ఏరాగంలో, ఏతాళంలో పాడుకోవచ్చునో కూడా ఆమె వివృతం చేశారు. ఇది ''హేమ్నః పరమామోదః''.

ఈ సందర్భంలో సహృదయులైన చదువరుల చెంత ప్రస్తావించవలసిన విషయ మొకటుంది. అధునాతన భావాలుగల విమర్శకులుగా పరిగణింపబడుతున్న కొందరు. ఆండాళ్ళ తల్లి రచించిన ఈ ప్రణయ గీతాల్లో (ఉదా॥ 3:2:7,8,9) పచ్చి, అసభ్య శృంగారం చోటు చేసుకుందని, ఇది ''భక్తి'' అనే ముసుగులో ఆమె వెల్లడి చేసుకుంటున్న ''కామమే'' అని, భావిస్తున్నారు. ఇలాగే అన్నమాచార్యుల శృంగార కీర్తనలు కూడా పచ్చి శృంగారం క్రిందకే జమ అని యీ ప్రబుద్ధులభిప్రాయపడుతున్నారు. సభల్లో బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇది చాల శోచనీయం. విమర్శ అనేది వెఱ్ఱితలలు వేస్తున్న వైపరీత్యమిది. ఆండాళ్ళ తల్లి ''అయోనిజ''. అయోనిజ నోట వచ్చే మాటలు కేవల శారీరక కామ భావనా ప్రతిపాదకాలు అని అనడం సాహసం. మధుర భక్తి పరాకాష్ఠకి చెందిన వ్యక్తి దృష్టిలో ఈ శరీరం పరమాత్మకే భోగ్య వస్తువు. తదేక భోగ్యత తప్ప దానికి వేరే ప్రయోజనం లేదు. భక్తి నవవిధాలని చెప్పిన భాగవత పురాణమే, ''కామాద్ గోప్యం'' అని, గోపికల కామానికే అగ్రతాంబూల మిచ్చింది. ఇక్కడి ''కామ''శబ్దం, మనం లౌకిక దృష్టిలో అనుకొనే స్త్రీ పురుషుల మధ్యనుండే శారీరకాకర్షణ కాదు. ఆ ప్రాపంచికాకర్షణ యోగాగ్నిలో ఎప్పుడో దగ్ధమయిపోయింది. భాగవతంలో చెప్పినట్లు అగ్నిలో బాగా దగ్ధమైన బీజాలకి అంకురారోపణ శక్తి ఉండదు. సృష్టి అంతట్లోను ఉండే ఒకే ఒక పురుషుడు భగవంతుడు. తక్కిన ప్రాణులన్నీ ఆయన ఆనందం కోసం, సేవ కోసం, ఏర్పడిన స్త్రీలే అన్న పరమార్థం బోధపడినప్పుడే ఈ పవిత్ర ప్రణయభావానికి గల అంతర్యమవగతమవుతుంది.

ఆండాళ్ళు తల్లి అటువంటి మహోన్నత భక్తి యోగ దశలో రచించిన ఈ గీతాలని మనం ఇటువంటి మనః పరిపక్వతతో పరిశీలించాలి, శీలించాలి, ఆలించాలి. ఆమె భగవంతుడి కోసం పరితపించింది, రోదించింది, కన్నీళ్లు చిందించింది. ఆయన వచ్చినట్లు ఏ మాత్రం తోచినా ఆనందంతో నృత్యం చేసింది. తన అందాలని విందులు చేసింది. నిజంగా ఇదెంత ఉన్నతమైన ఆధ్యాత్మికానుభూతి! ఎంతటి విచిత్రమైన తపస్సు! ఎంత పరిపక్వమైన మనస్సు! ''అహం బ్రహ్మాస్మి'', ''సర్వం ఖల్విదం బ్రహ్మ''; ''నేహ నానాస్తి కించన''; ''తత్త్వమసి''; ''భోక్తా భోగ్యం, ప్రేరితారంచమత్వా'' మొదలైన శ్రుతివాక్యాలకి ప్రత్యక్ష వ్యాఖ్యానంగా వెలసిన ఆండాళ్ళు తల్లి జీవితం ఏ దోషమూ లేని పవిత్ర భాగీరథీ నది. ఆ ప్రవాహానికి చక్కని పరీవాహంగా వెలసిన డా॥ ఉమగారి ఆంధ్రానువాదం అభినందనార్హం. ఇటువంటి చక్కని కృతులు వారి నిర్విరామలేఖిని నుండి ఇతోధికంగా జాలు వారాలని ఆకాంక్షిస్తున్నాను, ఆశిస్తున్నాను.

మదరాసు

డా॥ ముడుంబై నరసింహాచార్య

(విశ్రాంత) వైష్ణవ శాఖాధ్యక్షులు

మద్రాసు విశ్వవిద్యాలయము

చెన్నై

# విషయ సూచిక


| పద్యముల సంఖ్య | తెలుగు శీర్షిక | తమిళ శీర్షిక | పుట |
|---|---|---|---|
| | I. ప్రకృతి ధర్మం | | |
| 1-10 | 1. కామదేవార్చన | కామనై తొళుదల్ | 8 |
| 11-20 | 2. వేయి నామములు | నామమ్ ఆయిరమ్ | 17 |
| 21-30 | 3. కోడికూయకమున్నే | కోళియళైప్పదన్ మున్నే | 25 |
| 31-41 | 4. నిత్యబద్ధ ముక్తులు | తెళ్లియర్ పలర్ | 34 |
| | II. ప్రణయ సిద్ధాంతాలు | | |
| 42-52 | 1. కోకిల నడుగుట | కుళిర్ పాట్టు | 43 |
| 53-63 | 2. వారణ సహస్రం | వారణం ఆయిరమ్ | 53 |
| 64-73 | 3. కర్పూర పరిమళము | కర్పూరమ్ నారుమో | 62 |
| 74-83 | 4. మేఘ సందేశము | మేఘ విడు తూదు | 71 |
| 84-93 | 5. సిందూర వర్ణ చూర్ణము | సిందూర చెంపొడి | 79 |
| 94-103 | 6. కార్కోట పువ్వులు | కార్కోడల్ పూక్కాల్ | 88 |
| 104-113 | 7. తానుగ మురియుచు | తామ్ ఉగక్కుమ్ | 97 |
| | III. పరతత్త్వ సత్యము | | |
| 114-123 | 1. విలక్షణ భావాలు | మట్రిరున్దీర్ | 106 |
| 124-133 | 2. కృష్ణుడనే | కణ్ణన్ ఎనుమ్ | 116 |
| 134-143 | 3. కృష్ణదర్శనం | వృందావనత్తే | 124 |
| | అనుబంధము<br>పాశురానుక్రమణిక<br>తెలుగు - తమిళం | | |

# పాశురానుక్రమణిక తమిళం - తెలుగు


| తమిళం | తెలుగు | పద్య సంఖ్య |
|---|---|---|
| తై యొరు తింగళుమ్ | పుష్య మాసమునందు | 1 |
| వెళ్లైనుణ్ మణర్ కొండు | తెల్లని యిసుకతో | 2 |
| మత్తనన్నఱుమలర్ మురుక్క మలర్ | పరిమళంబుల క్రొత్త | 3 |
| సువరిల్ పురాణ నిన్ పేర్ | మన్మథా! స్తుతుల మాటలు | 4 |
| వానిడై వాళుమ్ అవ్వానవర్కు | కందర్ప! సురలు | 5 |
| ఉరువుడైయార్ ఇళైయార్ | కందర్ప! ఫాల్గుణ | 6 |
| కాయుడై నెల్లొడు కరుంబు | సరిక్రొత్త వరికోత | 7 |
| మాసుడై ఉడంబొడు | మలిన దేహము తోడ | 8 |
| తొళుదు ముప్పొదుమ్ | ముప్పూట పూజించి | 9 |
| కరుంబువిల్ మలర్ కణై | కొండ సీమల నంటు | 10 |
| నామమ్ ఆయిరమ్ ఎత్తనిన్ఱనారాయణా | నారాయణ నరుడన్ నామంబు | 11 |
| ఇన్ఱు ముట్ఱుమ్ ముదుగు నోవ | ప్రళయ కాలమునందు | 12 |
| కుండు నీరుఱై కోళర్ | ప్రళయ సమయమందు | 13 |
| పెయ్యుమా ముగిల్ పోల్ వణ్ణా | తొలికాఱు మబ్బులో | 14 |
| వెళ్లైనుణ్ మణల్ కొండు | కపటంబు తోడియో | 15 |
| ముట్టి లాద పిళ్లై | అలనాడు వారిధి నర్ణవంబున | 16 |
| భేదమ్ నన్గఱి వార్గళొడు | ఉత్తుంగ లయల మహోదధి | 17 |
| వట్టవాయ్ చిఱుతూదై | జ్వల నంబులు ప్పొంగు | 18 |
| ముట్టుతూడు పుగుందు | గోవింద! నేలనుకొలు చుచు | 19 |
| సీదై వాయముదమ్ | సీతమ్మయధరంపు | 20 |
| కోళియుళైప్పదన్ మున్నమ్ | శేషశాయి! ముకుంద! శీఘ్రమై | 21 |
| ఇదు ఎన్ పుగుందదు | తేనెలు చిందెడి తియ్యని | 22 |
| ఎల్లే ఈదు ఎన్న ఇళమై | ధనువొక్కటిని బూని | 23 |

| తమిళం | తెలుగు | పద్య సంఖ్య |
|---|---|---|
| పరక్క విళిత్తెంగుమ్ | లంకను చెఱపిన రామచంద్రుడ | 24 |
| కాలైకదువిడుక్కిన్ర | నల్లని నా స్వామి నారాయణ | 25 |
| తట్టుత్తవిళ్ తామరై | శిరమున కుంభముల్పేర్చుచు | 26 |
| నీరిలే నిన్రయర్ | ప్రళయ కాలమునందు | 27 |
| మామిమార్ మక్కళే | నిర్మల నీరజ నేత్ర | 28 |
| కంజన్ వలైవైత్త అన్రు | కంసుని చేతలన్ క్రమ్మిన | 29 |
| కన్నియ రోడు ఎంగళ్ | గోపాల బాలికాగోష్ఠి | 30 |
| తెళ్లియార్ పలర్ | కూడు వస్తువా కూర్పుము | 31 |
| కాట్టిల్ వేంగటమ్ | వేంకటగిరి యటవి మార్గ | 32 |
| పూమగన్ పుగళ్ | పద్మభవుడు దివ్య | 33 |
| ఆయ్చ్చి మార్గళుమ్ | గోకులపువారెల్లను | 34 |
| మాడమాళిగై సూళ్ మథురై | మేడమిద్దెల వెలిగెడి | 35 |
| ఆట్టవన్ మరుదంముఱి | రోట కట్టిన త్రాటితో | 36 |
| అన్రు ఇన్నాదన | శాపగ్రస్తుల సురులును | 37 |
| ఆవల న్బుడైయార్ | ప్రేమ చెలిమియు | 38 |
| కొండకోల కురళ్ | రహిని లేనట్టి సౌందర్య | 39 |
| పళగు నాన్మరైయిన్ | సొగసు లీనెడి చిన్నారి | 40 |
| ఊడల్ కూడల్ ఉణర్తల్ పుణర్దలై | ప్రణయ కలహంబు చెలికాలి | 41 |
| మన్ను పెరుమ్ పుగళ్ | పొన్న చెట్లు మఱియు | 42 |
| వెళ్లై విళి సంగు | తేనె సోన చిలుకు | 43 |
| మాతలి తేర్ ముణ్బు | పువ్వులు విచ్చిన పూదోట | 44 |
| ఎన్ పురుగియున వేల్నెడుం | విరహతాపము నావి | 45 |
| మెన్నడై అన్నమ్ | కోకిలమా! సొంపు కులుకుల | 46 |
| ఎత్తిశైయుమ్ అమరర్ | పువ్వుదోటలలోని పూల | 47 |
| పొంగియ పాఱ్కడల్ | ఉవ్వెత్తు కెరటాలు | 48 |

| తమిళం | తెలుగు | పద్య సంఖ్య |
|---|---|---|
| శార్‌జగమ్ వళైయ | తియ్యమామిడి చెట్ల | 49 |
| పైంగిళి వణ్ణన్ | తుమ్మెద రావంబు | 50 |
| అన్ఱులగమ్ అళందానై | శైశవ దశ నుండి | 51 |
| విణ్ణీలఅ నీణ్డడి | వైకుంఠ పథమున | 52 |
| వారణ మాయిరమ్ | కలగంటి కలగంటి | 53 |
| నాళైవదువై మణమెన్ఱు | హరికి దె పరిణ యోత్సవ | 54 |
| ఇందిరన్ ఉళ్ళిట్ట దేవర్ | దేవ విభునితో దేవతల్ | 55 |
| నాల్దిశై తీర్థం కొణర్న్దు | శిష్ట బ్రాహ్మణ బృందంబు | 56 |
| కదిరొళి దీపం కలశ ముడన్ | లావణ్య వతులెల్ల | 57 |
| మద్దళం కొట్ట వరి సంగమ్ | మద్దెల రావంబు మారు మ్రోగు | 58 |
| వాయ్ నల్లార్‌నల్ల | స్పష్టమై పఠియించు | 59 |
| ఇమ్మైక్కుమ్ ఏళేళ్ | ఈ జన్మకే కాక | 60 |
| వరిసిలైవాళ్ ముగత్తు | సౌందర్య భ్రూలత | 61 |
| కుంకుమమ్ అప్పి కుళిర్ చాందమ్ | కుంకుమ ద్రవముల | 62 |
| ఆయణుక్కాక త్తాన్ | వైష్ణవ భక్తుల వాసికెక్కిన | 63 |
| కర్పూరం నాఱుమో కమలప్పూ నాఱుమో | కర్పూర రాశులా కమలంపు | 64 |
| కడలిల్ పిఱందు కరుదాదు | సద్గుణ రూపమౌ శంఖమా | 65 |
| తడవరైయిన్ మీదే శరత్కాల చందిరన్ | సౌందర్య సాకార శంఖమా | 66 |
| చందిర మండలం పోల్ | వామరేకల తేరు పొంచ | 67 |
| ఉన్నోడుడనే యొరు కడలిల్ | ఓ శంఖ రాజమా! యొక్కటై | 68 |
| పోయ్ తీర్థం ఆడాదే నిన్ఱ | అపసవ్య రేఖల నందమై | 69 |
| చెంగమల నాణ్ మలర్ మేల్ | అలరు తేనియల రాయంచ | 70 |
| ఉణ్ బదు సొల్లిల్ ఉలగళందాన్ | పాంచజన్యమ! నిన్ను | 71 |
| పది నారామ్ ఆయిరవర్ | భాగ్యంబు పెంపొందు | 72 |

| తమిళం | తెలుగు | పద్య సంఖ్య |
|---|---|---|
| పాంచజన్నియత్తై పఱ్పనాబనోడు | శ్రీ శంఖ రాజపు శ్రీహరి | 73 |
| విణ్ణీల మేలాప్ప విరిత్తాఱ్పోల్ | నింగిలో విహరించు నీల | 74 |
| మా ముత్త నిది సొరియుమ్ | మేఘ పుంజ ములార! | 75 |
| ఒళి వణ్ణం వళై చింద్తై | దయతోడ వీక్షించు | 76 |
| మిన్ ఆగత్తు ఎళుగిన్ఱ | మెఱుపు తీగల కాంతి | 77 |
| వాన్‌కొండు కిళర్‌న్దెళున్ద | తిరు వేంకటగిరితో దీటైన | 78 |
| జలం కొండు కిళర్‌న్దెళుంద | సంద్రంబులో చొచ్చి | 79 |
| సంగమా కడల్ కడందాన్ | చల్లని జలధర చయము | 80 |
| కార్కాలత్తు ఎళుగిన్ఱ | తిరుమల శిఖరాల తిరుగు | 81 |
| మదయానై పోలెళున్ద | తిరుమల వసియించి తిరుగు | 82 |
| నాగత్తిన్ అణైయానై | ఆది శేషుని పావనాంశంబు | 83 |
| సిందూర చెంపొడిపోల్ | మాధవు మధువన మధ్య | 84 |
| పోర్కళిఱు పొరువమ్మా | యుద్ధకేళుల యందు | 85 |
| కరువిళై ఒణ్ మలర్కాళ్ | కాయక తీగలు కాకాని | 86 |
| పైమ్ పొళిల్ వాళ్ కుయిల్ కాళ్ | విస్తార మధువని వీధి | 87 |
| తుంగ మలర్ పొళిల్ సూళ్ | వర గుణ శోభిత తరులచే | 88 |
| నాఱు నఱుమ్ పొళిల్‌మాలిరుం సోలై | పరిమళ సహిత భూభాగ | 89 |
| ఇన్ఱు వందు ఇత్తనైయుమ్ | చల్లని తెమ్మెరల్బక్కని | 90 |
| కాలై ఎళుందిరుందు కరియ కురివి | ఉదయ కాలమునందు | 91 |
| కోంగలరుమ్ పొళిల్ మాల్ | క్రొంగు మ్రానుల తీరు | 92 |
| చందొడు కారగిలుమ్ | గంధపు వృక్షములో | 93 |
| కార్కోట పూక్కాళ్ | నలుపైన కార్కోట | 94 |
| మేల్‌తోండ్రి పూక్కాళ్ | పువ్వుల పైపైన పూచు | 95 |
| కోవై మణాట్టి! నీయున్ | లతలార! మీరు నావెతలను | 96 |

| తమిళం | తెలుగు | పద్య సంఖ్య |
|---|---|---|
| ముల్లై పిరాట్టి! నీయుమ్ | మల్లికాగుచ్ఛంపు | 97 |
| పాడుమ్ కుయిల్ కాళ్ | కమ్మగ పాడు పికములార | 98 |
| కణమా మయిల్ కాళ్ | గుంపుగా నొక చోట | 99 |
| నడమాడి తోగై విరిక్కిన్ర | పురి విప్పియాడుచు | 100 |
| మళయే మళయే మణ్ పురమ్ | వర్షమా! వర్షించి వరుని | 101 |
| కడలే! కడలే ఉన్నై | సంద్రమా! యమృతంపు | 102 |
| నల్ల ఎన్ తోళి! నాగణై | ఓసఖీ వినవమ్మ | 103 |
| తాముగక్కుమ్ తమ్ కైయిల్ | ఆభరణమ్ముల నందరు | 104 |
| ఎళిలుడైయ అమ్మనైయీర్ | అందమై నిలిచిన యమ్మ | 105 |
| పాంగోదమ్ సూళ్ంద | పొంగు కడలి చేత | 106 |
| మచ్చణి మాడమ్ మదిన్ | శ్యామల వర్ణుండు | 107 |
| పొల్లాకుఱళ్ ఉరువాయ్ | అత్యరూపాహ్లాద | 108 |
| కై పొరుళ్గళ్ మున్నమే | అన్ని ద్రవ్యము నావి | 109 |
| ఉణ్ణాదు ఉరంగాదు ఒలి కడలై | దృఢమైన కుడ్యాల | 110 |
| పాచి తూర్తు క్కిడంద | అలనాడు భూదేవి | 111 |
| కణ్ణాలం కోడిత్తు కన్ని | కల్యాణ మూర్తిగ | 112 |
| సెమ్మైమైయుడైయ తిరువరంగర్ | ఆర్జవ గుణముతో నానంద | 113 |
| మట్టిరుం దీర్క్కట్టు | నా స్వభావమునకు | 114 |
| నాణి యినియోర్ కరుమవిల్లై | వటువు వేషము పూని | 115 |
| తందైయుమ్ తాయుమ్ ఉట్టారుమ్ | చిఱుత ప్రాయపు నాడు | 116 |
| అంగై తలత్తిడై ఆళి కొండాళ్ | సౌందర్య మే పార చక్కని | 117 |
| అర్కుమ్ ఎన్ నోయిదు అరియలాగాదు | తాపరోగము చేత | 118 |
| కార్తన్ ముగిలుమ్ కరు విళైయుమ్ | కారు మేఘములు కాకాని | 119 |
| వణ్ణం తిరివుమ్ మనం కుళైవుమ్ | అలలతో నున్న నీలాబ్ధి | 120 |

| తమిళం | తెలుగు | పద్య సంఖ్య |
|---|---|---|
| కట్టినమ్ మేయ్క్కిలుమ్ | పాపాత్ములై తిరే పరిహసింతు | 121 |
| కూట్టిల్ ఇరుందు కిలి ఎప్పోదుమ్ | గూటిలో చిలకమ్మ గోవింద | 122 |
| మన్ను మధురై తొడక్కమాగ | అలివేణి యాండాళు | 123 |
| కణ్ణన్ ఎన్నుమ్ కరుందెయ్వమ్ | నల్లని కృష్ణుడు నానాథు | 124 |
| పాల్ ఆలిలైయిల్ తుయిల్ కొండ | వట పత్ర శాయిగ వన్నె | 125 |
| కంజై కాయ్ందు కరువిల్లి | కంసుని వధియించె కమనీయ | 126 |
| ఆరేఉలగత్తు ఆట్రువార్? ఆయర్పాడి | గొల్ల వారల నెల్ల కొల్లగొట్టు | 127 |
| అళిలుమ్ తొళిలుమ్ ఉరుక్కాట్టాన్ | విలిపించి నను నెట్టి విన్న | 128 |
| తడైయొన్ను ఇల్లా ఉలగత్తు నందగోపన్ | లౌకిక బంధాలు లవమైన | 129 |
| వెట్ట్రి కరుళ కొడియాన్ | విజయంబు లిచ్చెడి | 130 |
| ఉళ్లే ఉరుగినై వేనై ఉళ్లో | మనసులో మర్ఘుగుచు | 131 |
| కొమ్మై మ్ములైగళ్ ఇడర్ తీర | గుబ్బల చనుదోయి | 132 |
| అల్లల్ విళైత్త పెరుమానై | చాపంబు బోలెడి చారు | 133 |
| పట్టిమేయ్ న్దోర్ కారేఱు | నల్లని వృషభము నడయాడి | 134 |
| అనుంగ ఎన్నై పిరివు సెయ్దు | విలిపింపఁజేయుచు | 135 |
| మాలాయ్ పిఱంద నంబియై మాలే | యాదవ కులమున నాశల | 136 |
| కార్తణ్ కమల కణ్ణెఱుమ్ | చల్లని యంద మౌ | 137 |
| మాదవన్ ఎన్ మణియినై | మాధవుడల నాటి మణి | 138 |
| తరుమమ్ అఱియాకు ఱుంబనై | ధర్మ న్యాయములను | 139 |
| పొరుత్తముట్టైయ నంబియై | పరిపూర్ణ గుణుడుగా | 140 |
| వెళియ సంగొన్ఱు ఉడైయానై | ధావళ్యమే పారధరియించె | 141 |
| నాట్టైప్పడై యొన్ఱు అయున్ ముదలా | సకల జీవుల సృష్టి సక్రమ | 142 |
| పరుందాట్ కళిట్టుక్కు | మకరికి చిక్కిన మదపు | 143 |

శ్రీ

# కృత్యంకితము

సీ. ఎల్లవేళలయందు నింపుగ వినిపించు
భాగవతములోని భక్తి కథలు
శ్రీ కృష్ణలీలల శృంగార కేళుల
నంతరార్థములోని యర్థతతుల
వివరించి బోధించు విశదమగునటుల
గురువుగా శిష్యుల కోటి చేర్చి
నియమ నిష్ఠలనెల్ల నెనరుగ నేర్పించి
యాదరించి నడచు నవఘ మూర్తి

తే.గీ. జనకు డగుటయ నా పూర్వ జన్మఫలము
చిఱుత ప్రాయమందాధ్యాత్మచింతలమది
నూఱి పోసెను గురువుగ నూత్న విధిగ
ఫలము కాబోలు లభియించె పాశురములు

తే.గీ. నాచ్చి యారు తిరుమొళిగ నామమొందు
తెలుగు సేతలో నిలిచెను తియ్యనైన
గీతిగాగ గోదాదేవి గీతమాలి
కలివి యర్పింతు జనకుని నడుగు దోయి.

మానవ జీవితం ప్రకృతి ధర్మాలతో, ప్రణయ సిద్ధాంతాలతో, పరతత్త్వ సత్యాలతో నిండినది. ప్రకృతి ధర్మాలలో తప్ప మరితరాలలో స్త్రీ పుం భేదం లేదు. కాని తరువాత నున్న రెంటికిది బలిష్ఠమైన ప్రాతిపదిక. దీని నాశ్రయించే మానవుని మనుగడలోని జయాపజయాలు ఆధారపడి వుంటుంది.

ప్రధానంగ ప్రణయ సిద్ధాంతాలతో ముడిపడివున్న ఈ పాశురాలు పైన పేర్కొనిన మౌలికాంశాల రహస్యాన్ని తెలియ చేస్తున్నాయి.

గోదా దేవి విష్ణు చిత్తుని కుమార్తె. దైవ కైంకర్యమే నిత్య జీవితంగ నున్న విప్రవరుని గారాబా పట్టి. శ్రీ రంగనికి రంగు రంగులుగ అప్పుడే

పుష్పించిన, క్రొత్త పువ్వులను మాలలుగ కట్టి, ఆ సర్వేశ్వరుని స్తుతిస్తు భగవదర్పితం చేయటమే విష్ణుజిత్తుని వృత్తి. ఆ పరిసరాలలో, నిర్మలంగ పెరిగిన గోదా దేవి లేత మనస్సులో శ్రీ రంగనాధుడు నెలకొన్నాడు. తన ప్రాయ మెదిగిన కొలది వయసు తగిన రీతిగ ఆమె భావాలు శృంగార రస సమన్వితమై ప్రకాశించింది.

చిక్కగ కాచిన పాలపై తెరలేమీగడ వలె, ఆ భావాల వలన పుట్టిన పాటలన్నీ కూడ శృంగార రసపూరితాలు, వైష్ణవులు దీనిని మధుర భక్తిగ గుర్తించారు.

ప్రకృతి ధర్మంలో గోదా దేవి స్త్రీ. ఆమె వలచినది పురుషోత్తముని. మేలిమి శృంగార భావాలతో పువ్వుల హారంగ పాటలను పాడుతు సకల చరాచర సృష్టికి ఆది పురుషునకలంకరించినది. ఇది ప్రకృతి ధర్మ నేపథ్యంలో విరాజిల్లినది.

పాంచ భౌతిక సమాశ్రయంతో నేర్పడిన శరీర తత్త్వంలో అగ్నికి ప్రథమ స్థానం. పంచీకరణ నిరూపణలో దీనిని తేజో భాగంగ గుర్తించారు. ఘ్రాణము, రసనము, చక్షువు, త్వక్కు, శ్రోత్రముఅను పంచేంద్రియాలు తక్కిన పృథ్వి, అప్పు వాయు ఆకాశాది ప్రకృతి తత్త్వాలతో చేరి శరీర నిర్మాణమున్నదనుట తాత్త్వకుల నిర్ణయము. ఇది శరీర సంబంధం. ఆకాశ వాయు సమ్మిశ్రమైనది మనస్సు, ఆకాశ తేజో మిళితమైనది బుద్ధి అని యిత్యాది నిరూపణ తత్త్వములను పేర్కొనివున్నారు.

క్షుత్పి పాసలకు జఠరాగ్ని మూలమై శరీర శోభలను కలిగించు రీతిగనే, అంతః కరణాలలో మనస్సును క్షోభ పెట్టి ఆందోళన కలిగించేది కామాగ్ని.

అట్టి కామాగ్ని తేజస్స్వరూపంగ పరిణమించటానికి గడిచే దశా భేదాలు ఈ మొదటి ప్రకృతి ధర్మంలో చెప్పబడింది.

కామాగ్ని అధి దేవత మన్మథుడు. కాబట్టి పాశురాలలో మొదటి భాగం.

| | | |
|---|---|---|
| 1. | కావు దేవార్చన | 10 పాశురాలు |
| 2. | వేయి నామములు | 10 పాశురాలు |
| | బాల్య దశలోని చిలిపి బాలుడు | |
| 3. | దుష్టుల నర్దించుట | 10 పాశురాలు |
| 4. | నిత్యబద్ధ ముక్తులు | 11 పాశురాలు |
| 5. | కోకిల నడుగుట | 11 పాశురాలు |
| 6. | స్వప్నము (వారణ సహస్రం) | 11 పాశురాలు |
| 7. | కర్పూర పరిమళము | 10 పాశురాలు |
| 8. | మేఘ సందేశము | 10 పాశురాలు |
| 9. | సింధూర వర్ణ చూర్ణము | 10 పాశురాలు |
| 10. | కార్కోట పువ్వులు | 10 పాశురాలు |
| 11. | తల్లులతో నివేదించుట | 10 పాశురాలు |
| 12. | విలక్షణ భావాలు | 10 పాశురాలు |
| 13. | కృష్ణుడనే | 10 పాశురాలు |
| 14. | కృష్ణుని దర్శించుట | 10 పాశురాలు |
| | మొత్తము | **143 పాశురాలు** |

## I. ప్రకృతి ధర్మాలు:

1. కావుదేవార్చనలో మన్మథుడు వచ్చి తమ అంతర్గతంలో దాగిన ఆ అనంతుని తమకు కూర్చుమని చెప్పే భావంతో కూడినది. ముప్పది రోజులకు చేసే పూజా విధానం. చక్కగ కన్నులకు కట్టిన దృశ్య వర్ణనలిందున్నాయి.

2. వేయి నామములు కలిగిన వాడుగ స్తుతింపబడే ఆద్యంత రహితు అవతారస్వరూపుడు అయిన బాలకృష్ణుని లీలలభివర్ణితములు. కామునికై కూర్చిన మేడలను కూల్చి వేసేవాడు. తీర్చిదిద్దిన వీధులను నాశనం చేసే వాడట. అని ఈ పది పాశురాల భావమున్నది.

3. దుష్టుల నర్దించుట అనే ఘట్టం శ్రీ కృష్ణుని బాల్య చేష్టలలో ప్రధానమైనది ప్రగూఢార్థ కలితమైనది.

4. గోదా దేవితో చేరి శ్రీ కృష్ణుని స్తుతించు వారందరు నిత్య బద్ధ ముక్తులు. వారజస్రము కోరునది జడ పదార్థ రూప సజీవ శాంత రూపంతో కలిసిపోవాలని, అంటే జడంగ, నిర్జీవంగ నీరసంగ వున్న వాటికెల్ల ప్రాణ శక్తిని కలిగించు శక్తి స్వరూపుడని భావం. ఆవిధంగ ఆ కలయిక కోసం తపించే జీవులు నిత్యము బద్ధులైన ముక్తులని తాత్పర్యం. ప్రకృతి సహజంగ నున్న జీవుల యనుభూతి అనంతరం వారిలోని పరిణత దశగ రూపొందే స్థితి ప్రణయ గీతాలాపన. ఈ పాశురం రెంటిని అనుసంధానం చేసే తీరులో నున్నది.

## II. ప్రణయ సిద్ధాంతాలు:

1. ప్రకృతిలో నొక్కటి, చక్కని కూజితం గలిగినది, అవ్యక్త మధురాలాపం చేయునది అయిన కోకిలను సందేశానికి అర్థించినది. ఈ పాశురాలలో ముఖ్యంగ మూడు విషయాలున్నాయి. పూదేనె, చిగురుటాకుల నడయాడు కోకిల వర్ణనము. రెండవది తన హృదయేశ్వరుని సౌందర్య రూప వర్ణనము. మూడవది తత్కారణంగ తన అంతరాత్మలో చెలరేగుతున్న తపన. ప్రతి పాశురంలో ఈ మూడింటి వర్ణనలున్నాయి. అంతే కాదు ప్రకృతి యావత్తు పరమాత్మ స్వరూపంగానే గోచరించాయి.

2. జాగృత స్థితి నుండి ప్రణయిని స్వప్న జగత్తునకు జారుకున్నది. విభుడు చెంత చేరి బ్రహ్మోత్సవముగ పరిణయోత్సవం జరిగినట్లు కలను కన్నది. సార్వభౌముడుగ చెలికాడు కనుపించి వివాహవరుడుగ వధువును సమీపించినాడట. ఈ పాశురాలన్నీ మధ్య మణి సదృశంగ భావింప బడుతు కామితార్థానికి, కల్యాణోత్సవానికి పాడుతుండటం సహజం.

3. శ్రీ విష్ణుమూర్తి చేతిలో ధరించిన పాంచజన్య శంఖాన్ని నిర్దేశించి చెప్పిన పాశురములివి. ఇందు ప్రణయ లీలలో తన్మయత్వాన్ని చెందటానికి అధరామృతాస్వాదనకై నిరీక్షించినది ప్రణయిని. శంఖమెల్లవేళల విష్ణుమూర్తి అధరాన్ని ఆశ్రయించి అమృతాన్ని గ్రోలిన అనంతరం చేతిలో సుఖసుషుప్తిని పొందుచున్నదట. స్వప్న స్థితిని దాటి తనకు నునట్టి స్థితి కలుగవలెననుటయే అంతర్భావము.

4. మేఘములతో తన విరహగీతాన్ని వినిపించి సందేశమును పంపుతున్నది. అప్పటి వరకు రాగ రస నిమగ్నమైన ఆమె మనసు తదనంతరం తాప జ్వర పీడితమైనది. ప్రణయంలో మన్మధ దీప్తులు చెల రేగినవి. ప్రత్యంగంలోను పరమ పురుషుని ఆలోచనాజనిత ప్రతిస్పందనలు కలిగాయి. భావాలతో చక్కని పది పాశురాల విరహగీతాలివి.

5. ప్రకృతి ప్రతి వస్తువు తన జీవితేశ్వరుని రూపంగ భాసించి తనలో విరహాన్ని కలిసి పోవాలనే అంతరంగ ఆరాటాన్ని ఎక్కువ చేస్తున్నదట. వర్షాకాలం నాటి ఇంద్ర గోప పురుగులు సిందూరవర్ణాన్ని ఆకాశ మందంతట అలదు చున్నది. తెల్లని మల్లికలు, అందమైన అలరుల గుంపు, పిక శుకాది పక్షులు, తుమ్మెదలు, తెమ్మెరలు, కొంగు విరులు, చందన వృక్షములు, ఈ విధంగ చరాచర ప్రకృతిలోనున్న సౌందర్య శోభలన్ని తన నాధుని గురించే ప్రస్తుతించుచున్నది.

6. వీనిలో కార్కోటు పువ్వుల కొక ప్రత్యేక స్థితిని గలిగించినది ఆండాళ్, కారణం నీలిమ వర్ణాన్ని కలిగిన పువ్వులు కావటం చేత పదేపదే తన నాధుని స్మరింపచేస్తున్నది. నెమలులు, పువ్వులు, పికములు వీటిని చూచి నిట్టూర్పు నిగుడించినది చాలక వర్షంతో, సముద్రంతో మొరపెట్టు కున్నది.

7. తనలో తాను మురిసిపోతు తన చుట్టు చేరిన తల్లులతో సంభాషించినది, తనివి తీరునట్లుగ తన హృదయేశ్వరుని వర్ణించి వర్ణించి వివరించి, అతనితో తన్ను చేర్పవలెనని బ్రతిమాలినది. విలపించినది ఆనతులిచ్చినది. ఆ సర్వేశ్వరుని అవతార లీలలనభివర్ణించుచు ప్రత్యంగములోను తన యందు ప్రవేశించినాడని ప్రమాణ పూర్వకంగ పలికినది. కళ్యాణ విశేషాలను తలచి మురిసినది.

## III. పరతత్త్వ సత్యం.

1. తన భావాలు, అనుభవాలు, అవన్నీ ఇతరులకు లేక పోవటాన్ని చూచి ఆశ్చర్య చకితయైనది. తన మేను సోకినట్లుగ, ధరించిన చల్లని

తులసీదామమును తనకర్పింపగ, ఆమెను దానిని ధరించి పగ్గ పరంధాముని మెడను నలంకరింపచేసినదట, తనను వెనువెంటనే ఆ మధుసూదనుని పురముగు మధురకు కొనిపొమ్మని విలపించినది. విరహగీతమువలె నున్నప్పటికి నీశ్వర సమైక్యతకిది నాంది. ప్రకృతి పురుషుల సమాగమానికిది నేపథ్యం. అందుకే సర్వేశ్వరుని స్థానముగు మధురను, విహార స్థలమైన యమునానదీ తీరమునకు తాను తరలి వెళ్లవలెనని తహతహలాడింది.

2. ప్రాణముల నిలుపవలెనన్నచో కృష్ణుడు ధరించే వస్తువులతో తనకు సపర్యలు చేయవలెనని విన్నవించుకున్నది. పీతాంబరమును తెచ్చి విసరమన్నది. తులసీ దామములతో సేద తీర్పమన్నది. వనమాలను తెచ్చి యుపచరింపమన్నది. పిల్లనగ్రోవి యందుండు తుంపరలను తన్పై చిలకరింపమన్నది. ఇట్టి పరా కాష్ఠ స్థితిలో ఐహిక భోగానుభవస్థితులను దాటి పరతత్త్వంలోని సౌందర్య దశనునందుకొనటానికి సమీపించినది.

3. లీలా మానుష రూపుడైన శ్రీ కృష్ణుని, లాస్య విలాసాలను బృందావన వాటికలో దర్శించి, తన్మయత్వాన్ని చెంది తరించినది ఆ తన్వి.

ఈ విధంగ మూడు దశలను దాటిన స్థితిలో భక్తుడు భగవంతుని దర్శించిన రీతిగ, యోగమూర్తి పరతత్త్వాన్ని సాక్షాత్కరించిన విధంగ, ప్రేయసి ప్రియుని కొఱకు వేచి వేచి, సుఖ సంగమంలో శాంతిని పొందిన విధంగ ఈ గీతాలున్నాయి.

లౌకిక విషయ వాంఛలలోనున్న మానవుడు, తమకు సంబంధించిన కన్యతో నీ పాశురాలను పాడమని నిర్దేశిస్తుంటారు. తత్ఫలితంగ ఆమెకు మనసుకు నచ్చిన మనువు జరిగి. జీవితాంతం సుఖంగ భర్తతో కాలం గడుపుతుందని విశ్వాసం. కన్నె పిల్లలు, శీఘ్ర వివాహ ప్రాప్తి కోసం ఈ పాశురాలను ధనుర్మాసంలో పాడుతుంటారు. వైష్ణవాలయంలో దివ్య ప్రబంధంగ వాసికెక్కి ప్రత్యూష వేళల్లో, పారాయణం చేయటం నేటికి చూడగలం. ఈ పాశురాలకీ భావంతోనే బహుళ ప్రచారం వున్నది.

ఆళ్వారుల పాశురాలన్నీ భక్తిరస గుళికలు, శరణాగతిలోని ప్రపత్తి మార్గానికి లక్ష్య లక్షణాలివి.

అందులోను గోదాదేవి పాడిన పాశురాలన్నీ కూడ మధుర భక్తి శాఖలో వాసికెక్కాయి.

ఆండాళ్ పాశురాలుగ చెప్పుకునే వానిలో ప్రధానమైనవి, ప్రచారంలో వున్నవి, తిరుప్పావై. ఇవి 30 పాశురాలు. ధనుర్మాసంలో కన్నె పిల్లలు రోజుకొక పాశురం చొప్పున పాడుతు, బాహ్యాభ్యంతర శుచితో గోపాల కృష్ణుని స్తుతిస్తుంటారు.

ఇవి కాక నాచ్చియార్ తిరుమొళి, అనేవి 143 పాశురాలతో కూడినది. అదే గోదాదేవి ప్రణయగీతాలు. తిరుమొళి అంటే శ్రీ సూక్తి అని భావం. ఈ 143 పాశురాలు శ్రీ సూక్తి సదృశాలు.

యౌగిక పరం గాను తత్వార్థ సంవిధానంగాను పాశురాల గురించిన వ్యాఖ్యానాలు లేకపోలేదు.

అంతరార్థానికై అన్వేషించటం కంటే ప్రత్యక్ష ప్రమాణంగ నున్న అర్థతాత్పర్యాలనునందించటమే సుకరమైనది. జన బాహుళ్యానికి సులభ గ్రాహ్యమైనది కూడ. అందుచేత పాశురాలను చక్కని అన్వయ క్రమంతో వైష్ణవ సంప్రదాయంగ వివరించారు.

తమిళ పాశురాలలోనున్న విలక్షణత, సులభ గ్రాహ్యంగ వ్యవహారంలో న్నున భాష కాకపోవటం. ప్రార్థనా శ్లోకాలుగ రాగ తాళ సమన్వయంగ పాడటం చేత పాశురాలలో వస్తువు మరుగున పడటం జరిగింది.

తమిళ సాహిత్యంలో 'నాలాయర దివ్యప్రబంధం'గ ప్రఖ్యాతి పొందిన నాలుగువేల పాశురాల సంకలనంలో మొదటి వేయి లోనిదీ పాశురాలు. దీనికి 'నాచ్చియార్ తిరుమొళి' అనేది నామకరణం. గోదాదేవి గీతాలని చెప్పవచ్చు.

వైష్ణవ కావ్యాలను రచించేటప్పుడంతా నాకు అన్ని విధాల ప్రోత్సాహాన్ని కలిగిస్తు ముఖ్యంగా గొదాదేవి గీతమాలిక కావ్యానికి ఆశంశను అందించిన ఆచార్యులు శ్రీ ముడుంబై నరసింహాచార్యులు గారికి నా కృతజ్ఞతలు.

# 1. ప్రకృతి ధర్మం

## 1:1 కామదేవార్చన

సీ. పుష్యమాసమునందు భూమి శుభ్రపరచి
చల్లని వేదికఁజక్కఁ జేసి
మాఘ పూర్వమునందు మండలా వృత్తిగ
నెండిన సన్నని యిసుక చల్లి
యందమౌ శోభలు నాలంబమై నిల్వ
తిన్నగ వీధుల తీర్చి దిద్ది
అతను రూప! యెదలో నాశలుజ్జీవింప
నీకు నీ తమ్మికు నిత్యనుతులు
తే. గీ. చటుల కాంతుల వెలిగ్రక్కు చక్ర మొండు
చేత బూనెడి రమణుండు స్నేహితుండు
వేంకటేశుని కూర్చెడి వెరవులరసి
సంగ మంబును కలిగింప సాగిరండు 1

కామదేవార్చన యిందు ప్రధాన విషయం. పుష్యమాసం మొదలు మాఘ మాసంలో పూర్వ భాగం వరకు మన్మథ పూజ జరుపుతారు. మండలాకారంలో సన్నని యిసుకను నమర్చి ఆ చోట ఎన్నో అందమైన శోభలను తీర్చి వాటిని చేరటానికి తిన్నని మార్గాలను నిసుకతోనే యేర్పరచి మన్మథుని, అతని సహాయంగ అతని తమ్మిని ఆహ్వానిస్తున్నారు పూజలు చేసే బాలికలు. వీరిని స్తుతించి, పిలిచి తమ కోరికలను తెలియచేస్తున్నారు. చక్రమును ధరించిన ఆ శ్రీమద్వేంకటేశ్వరుడే తమ నాయకుడు. ఆ భగవంతునితో తమను చేర్పటానికి వీరిద్దరు రాయబారం చేయాలనేదే విన్నపం.

తమిళంలో ''తై యొరు తింగళుమ్'' అనేది ప్రారంభం. శుభ ప్రదంగ పాశురాలకు శ్రీకారం చుట్టినదీ పాశురమే. ఇది సావేరిరాగంతో ఆదితాళంలో పాడుకోవచ్చుట. మన్మథుని తమ్ముడు సాముడనే నిర్దేశం కూడ వ్యాఖ్యానంలో వున్నది.

పాశురంలోని విశేషం మొదటి దానిలోనే శ్రీ వేంకటేశ్వర దేవతామూర్తి ప్రస్తావన వున్నది. చక్రధారిగ సాక్షాత్కరించినాడు. ఇసుకతో బాలికలు ఆట్లాడుకోవటమనే సాంఘిక విషయమున్నప్పటి,

అందులో మండలాకారంగ తీర్చిదిద్దారని, దానిని సమీపించటానికి దారు లేర్పరచారని వర్ణించటం పరమార్థ సూచకము. యౌగిక స్థితిలో దశాపరిణామాలు మండలావృత్తాలు, తద్పరిచ్ఛేదాలు నిర్దేశితాలు. దాని కనేక మార్గాలున్నాయి.

**1 : 2**

సీ. తెల్లని యిసుకతో తిరువీధు లొప్పగన్
ప్రొద్దులు పొడవక మునుపు లేచి
స్నాన వాటిక దిగి స్నానంబులను చేసి
ముండ్లు ముష్టులులేని పుడక లేరి
నీ కునై యగ్నులు నియతితో రగిలించి
నోమొండు నీ పేర నోచి పట్టి
మధువుల చిలుకు సుమముల ధనువు చేర్చి
కామదేవ నను నీ కరుణ బ్రోచి
ఆ.వె. నీల జలధి వర్ణు నెనరైన నామంపు
స్మరణంబు నందు సార మరసి
బకుని చీల్చు ఘనత భావంబు గుఱి చూచి
నన్ను బ్రోవ మనుము నయము తోడ 2

కామదేవ! తెల్లని నున్నని యిసుకతో వీధుల నలంకరించాము. సూర్యోదయానికి పూర్వమే లేచి అక్కడక్కడున్న స్నానవాటికలలో మునుకలు వేసి ముండ్లు లేని పుడకల నేరి అగ్నిని రగిలించి నీకుగా నోము పట్టినాము. తేనెలు చిలుకే పువ్వులను ధనువుగ తీసికొని, ఆ నీలవర్ణుని పేరును అందులో సంధించి, ఆ బకుని త్రుంచిన దేవ దేవునిపైకి వదిలి సందేశాన్ని తెలియ చేయవలసింది.

'వెళ్లైనుణ్ మణర్ కొండు' అనేది తమిళ పాశురానికి ప్రారంభం. సావేరి రాగం, అది తాళంలో పాడుకోవచ్చుట.

విశేషంగ నిందు చెప్పుకోదగినది భగవంతునికున్న విశేషణాలు రెండు. మొదటిది బాహ్య సౌందర్యాన్ని తెలిపేది నీల వర్ణుడని, రెండవది ఆంతరంగిక స్వభావము దుష్ట శిక్షణ బకుని సంహరించిన వాడని.

కామ దేవుని తృప్తిపరచటానికి అగ్ని గుండం సిద్ధమైనది. అందు ముండ్లు లేని పుడకలమర్చబడినదట.

**1 : 3**

సీ. పరిమళంబుల క్రొత్త పైడి దుత్తూరము
మునగ పువ్వులు తెచ్చి మూడు వేళ
అడుగు దోయికి సదా యర్చింప నిత్యంబు
ఫలము లేక మనము బాధ చెందె
నిజము కాని దనుచు నిందింపక మునుపు
గుత్తుల సుమముల గూర్చి గ్రుచ్చి
ధనువున సంధించి దయతోడ గోవింద
అనెడి నామంబును నాశ్రయించి

ఆ.వె. వేంక టాద్రి నిలయు వేవెలు గుల కాంతి
దీప్తి రూప మదియె దివ్య పథము
పరమ పదము నందు బ్రహ్మాండ తేజ మౌ
కాంతి యందు నన్ను కలుపు మయ్య 3

సువాసనల ఉమ్మెత్త పువ్వు మునగ పువ్వులు తెచ్చి మన్మధునకు పూజ చేసిందట. కాని ఫలితం లభించలేదు. అందు వలన మరుని నిందించాలని అనుకున్నది, ఆ నిందలురాకుండ ''మన్మథుడా! నీవు తక్షణమే సుమములను తెచ్చి నీ ధనువులో సంధించి 'గోవిందా' అనే పేరుతో అను సంధించు, ఆ వేంకటాద్రి నిలయుడు వేవెలుగుల జ్యోతి. అందులో నన్ను కలిపివేయుము స్వామీ'' అని విలపించినది.

''మత్తనన్నఱుమలర్ మురుక్కమలర్'' అనేది తమిళ పాశుర ప్రారంభం. మన్మథ భావాలు ఉన్మత్తాన్ని కలిగిస్తుంది కాబట్టి ఉమ్మెత్త పూవులతో పూజించిందట. ఉమ్మెత్త పువ్వుల్ని వాసన చూస్తే పిచ్చి పట్టుందని లోకులతలంపు. సావేరి రాగంలో ఆది తాళంలో నున్నది.

ఇందులో అర్చా స్వరూపంలో వేంకటాద్రిలో న్ను గోవిందునే స్మరించింది. బ్రహ్మాండ తేజస్స్వరూపుడు.

తేజస్సులో కాంతి కళికగ కలిసి పోవుట తత్త్వార్థ బోధకము.

**1:4**

సీ. మన్మథా! స్తుతుల మాటలు నిను గూర్చి
మనసార పలుకుదు మరువ రాదు
ప్రాక్తన కాలమే ప్రాపించె నీ కని
మకరకే తనము మా మరుని కనుచు
వాజులు, చమరీలు, వాహనంబులు పెక్కు
చేతిలో విల్లుగ చెఱకు గడయు
నారాధ నలుకావె నన్నియు నీకు నై
వ్రాసి యుంచితి గోడ వన్నె మీర
ఆ.వె. లేత ప్రాయమందె లీలగ మదియందు
కుచపు మొదలు నందు కోర్కె లెసగె
దరిని నిలిచి నాడు ద్వారకా విభుడె గా
కూర్పు మయ్య నాతో కూర్మి నిలువ 4

మన్మథుని మనస్సును మెప్పించటాని కోసం ఎప్పుడో అతనికి ఉపాదానముల నిచ్చినదట. మకర కేతనము, అశ్వములు, చమరీ మృగములు, చేతిలో చెఱకు గడ మున్నగు ద్రవ్యాల నిచ్చి, అతని ప్రభావం వలన తన నాథుడు తన్ను చేరే యేర్పాట్లు చేయాలన్నది. తానొసగిన ద్రవ్యాల నన్నింటిని గోడపై చెక్కి యున్నదట. అంటే శిలా శాసనం చేసిందని భావం.

'సువరిల్ పురాణ నిన్ పేర్' అనేది పాశురానికి తమిళంలో ప్రారంభం. వ్రాత మూలంగ చెప్పినప్పుడు అది ప్రమాణ వాచకమౌతుంది.

ఇందులో ఇష్ట సఖి కోరుకునేది ద్వారకా నగరం. శ్రీ కృష్ణుని నగరం.

సాధన సామగ్రులన్నీ సరికూర్చిన కాని కార్య సాఫల్యం జరుగదు అనేది పిండి తార్థం.

1:5

సీ. కందర్పు! సురలు నాకనివాసులగుచును
యాగ హవిస్సులన్ యాగ కర్త
లర్పింప తనివితో నందుకొన గలరు
అటవి నుండెడి నక్క యదను చూచి
మూర్కొంచు లోవచ్చి ముట్టగల్గునె వాని
శంఖంబు చేబూను చక్ర ధారి
కౌఱకు గాస్తనములు న్కోరు కొనుచు నుండ
లోక మాయల యందు లొంగు నాక్కొ
ఆ.వె. కామదేవ నాదు కలతల గుర్తించి
శార్ఙ్గధారి యెడను సమయ మెఱిగి
నన్ను చేర్పుమయ్య నాథుతో కాని చో
నిలుప జాల యుసురు నిముసమైన 5

చక్కని సమగ్రమైన ఉపమానంతో ఇహ పరలోక విషయాలు సమన్వయింపబడింది. యాగ కర్త చేసే యజ్ఞహవిస్సును దేవ లోకంలోని దేవతలు గ్రహించి తృప్తి చెందుతారు. కాని ఎక్కడో వున్న నక్క అందులో ప్రవేశించి హవిస్సును నందు కొనగలదా! అదే విధంగ తన స్తనద్వయాలు ఆ శంఖ చక్ర గదా ధారి యగు విష్ణుమూర్తికే అనుభవైక వేద్యం కాని లౌకిక విషయలంపటులకు కాదు. అట్లొకచో తలచినట్లైతే ఆమె ప్రాణలతో నుండదట.

'వానిడై వాళుమ్ అవ్వానవర్కు' అనేది తమిళ పాశుర ప్రారంభం.

విరహ గీతాలకు సరియైన నేపథ్య భావాలున్నాయి. మనోగత నాయకుడు శంఖ చక్ర గదల ధరించిన విష్ణుమూర్తి యజ్ఞము, హవిస్సు, గృహీత ఈ మూడింటికి శృంగార పరంగాను, పరార్థ ప్రగూఢం గాను సమన్వయమున్నది.

1:6

సీ. కందర్పు! ఫాల్గుణ కాలంబు నిత్యమై
ప్రత్యంగ శోభతో పడతు లెల్ల
సౌశీల్య మేపార సాంగ వేదము నేర్చి
భాగవత వరులు వరుస నిలువ
బృందంబు మున్నిడి వీధుల నిను కొల్వ
నోములు ఫలియింప నోచినాను
కాఱువెుయులువర్ణ్ణ కమిలిన నేరేడు
చందంబు కలువపూ ఛాయవాని
ఆ.వె. చిన్ని కృష్ణు కలువ కన్నుల నా స్వామి
చిర్న గవులు నన్ను చేరి రాగ
నొక్క మాట దయగ నొయ్యారముతోనగ
కరుణ కలుపు నన్ను కామ దేవ 6

ఫాల్గుణ మాసంలో స్త్రీలందరు చక్కగ అభ్యంగ స్నానాలు చేసి సౌందర్యంగ అలంకరించుకొని గుంపులు చేరి తిరు వీధులలో నడచి వస్తున్న శ్రీకృష్ణునికి ముందర వస్తున్నారు. వేద పారాయణం చేస్తూ భాగవతులు వస్తున్నారు. ఆ బృందం మధ్య నల్లని మేఘము, కమిలిన నేరేడు ఛాయ కలిగిన నల్లనయ్యను చూచి పరవశించి ఆ కలువ రేకుల కన్నుల వాని చిరునగవుకై నిరీక్షించి నోములు నోచుచున్నదట, అట్టి శ్రీ వారితో తన్ను కూర్చుమని కామ దేవునితో ప్రాధేయడినది.

'ఉరువుడైయార్ ఇళైయార్' అని పాశురం ప్రారంభింపబడింది. ఇందులో శ్రీ కృష్ణుని మేని ఛాయను వర్ణించునప్పుడు, కాయపూ, కాక్కాణపూవలెనున్న వాడని చెప్పబడిండి. ఈ పూల విశేషణంతోనే తరువాతి పాట లుండటం చేత, ఆ పువ్వుల పేరే తరువాతి గీతాలలో తెలుగున ప్రయుక్తమయ్యాయి, ప్రస్తుత గీతంలో కమిలిన నేరేడు, కలువ పువ్వు అని చెప్పటం జరిగింది.

అండాళ్ ఆరాధ్యదైవం కృష్ణుడే అనే విషయమిందు సూచితమైనది. ఉత్సవ ఊరేగింపుల ప్రస్తావనేయిందు ప్రధాన విషయం.

1:7

సీ. సరిక్రొత్త వరికోత శాలి ధాన్యములేరి
బెల్లంపు పలుకుల పేర్చి వండి
అటుకుల సన్నగా నందందు కలుపుచు
నీకునై వేద్యంబు నిత్యమిచ్చి
పుణ్య భాగవతుల పూజ మంత్రము తోడ
కొలుతును కందర్ప కోర్కె మీర
నింగినేలను పాద నీరజంబున కొల్చి
యవతార మెుందిన యాత్మ విభుడు
ఆ.వె. విస్తరించినట్టి విశ్వరూపము నేడు
కుచము నందు కలుగ క్రొత్త యునికి
నుదర భాగమందు నుజ్జ్వల కాంతితో
వ్యాప్తి పొందఁజేయ వరములిమ్ము 7

నోము నోచేటప్పుడు కామ దేవునికి సమర్పింపవలసిన నైవేద్యాదులు సూచితాలు. ఆ కందర్పుని మంత్ర పూజలు భాగవతులు పలుకుతున్నప్పుడు ప్రార్థిస్తున్నదట. విశ్వాకారాన్ని ధరించిన విరాట్పురుషునితో తాను ఏకం కావాలని కోరుకుంటున్నది.

'కాయుడై నెల్లోడు కరుంబు' అని తమిళంలో ప్రారంభం.

అవతార విశేషాలలో . విశ్వరూపాన్ని ధరించిన త్రివిక్రముని వర్ణనమున్నది. జీవేశ్వర సమాగమానికీ భావం వేదిక వంటిది.

1:8

సీ. మలినదేహము తోడ మాసిన కురులతో
తెల్ల బారిన నోటి తెలుపు తోడ
నొక్క-ప్రొద్దువలన నొడలు నలసి పోవ
నోచిన వ్రతముల నోములెన్నొ

తేజంబు వీరమ్ము తేజరిల్లిన నీవు
మదనుడా నా మాట మరువకయ్య
గోపాల దేవుండు కోటిమన్మథ రూపు
డనయంబు నాచెంత ననుగునటుల
తే. గీ. పాదముల సోకి ప్రణమిల్లి భక్తి తోడ
నీదు సేవలు చేయగా నిలిచి యున్న
దంచు తెలుపుమో కందర్ప ఐక్య సిద్ధి
కొఱకున్నై యలమట చెందుదు గొంక వలదు. 8

మన్మథుని గూర్చి నోములు చేస్తున్నది. శరీరం తేజస్సు లేక అలసి పోతున్నది. కురులు సవరణలు లేక మాసి పోతున్నది. నోరెండిపోయి, తెల్ల బారుతున్నది. ఇంత కఠినంతో వ్రతం ఉపవాసాలతో చేయటానికి కారణాన్ని గుర్తించి మన్మథుడు, ఆ విష్ణుమూర్తి పాద సేవలు చేయటానికామెను ననుగ్రహింపవలసినదిగ విష్ణువుతో నివేదించాలట.

'మాసుడై ఉడంబోడు' అని తమిళంలో ప్రారంభం. కైంకర్యాలలో పాద సేవన మనేది వాచ్యమైంది. దీనికి మధ్య వర్తిగ మన్మథుడున్నాడు పరమాత్మ సాక్షాత్కారానికి గురూపదేశ మవసరం.

**1:9**

సీ. ముప్పూట పూజించి మురిపంబు తోడ నే
వికసించి వాసనల్ విస్తరిల్లు
క్రొవ్విరి పదముల కూర్చుచు నర్పించి
సుమనస్సు చేసితి స్తుతులు నీకు
పాల సంద్రము వంటి నీల వర్ణుని వాని
చిత్తమున తలచి సేవ చేయ
సౌఖ్యస్థితులు లేక స్వాంతమమ్మాయని
బిడియంబుగా నేడ్వ బేల నైతి

ఆ.వె. నాదు పలుకు లరసి నన్నిక నై నను
చేర దీయు మని చెప్పు మయ్య
కసువు పెట్టకుండ పసరము పని పెట్టి
కొయ్యలాగి యెద్దుఁ గొట్టనగునె 9

మదనుని పాదాలకు మూడు వేళల పువ్వుల నర్పించి పూజ చేసినదట. నీల వర్ణుని చేరాలని మనస్సు ఎన్నో విధాలుగ పడి తపిస్తున్నది. ఆ ఈప్సితార్థ మీడేరినప్పుడే తన మనస్సు తనకు స్వాధీన మౌతుందట. కసువు పెట్టకుండ ఎద్దు చేత పనులు చేయించలేము. పైగా కాడి మ్రాను తీసి దానిని కొట్టటం వలన ప్రయోజనం లేదు.

''తొళుదుముప్పోదుమ్'' అని తమిళంలో ప్రారంభం.

చక్కని ఉపమానంతో మనస్సును పోల్చిన గీతమిది. మనస్సున కేది యిష్టమో దానిని ఆదరించినప్పుడే అది మన స్వాధీనంలో వుంటుంది.

**1:10**

సీ. కొండసీమలనంటు గోపుర సౌధముల్
విల్లిపుత్తూరున వెలుగు చుండ
విష్ణుచిత్తుడనెడి విప్రవరునకును
మురిపాల గోదమ్మ ముద్దు బిడ్డ
చెఱకువిల్లువిరుల చేతిలో శరము తో
నిలచిన మన్మథున్ నెఱను కొలిచె
బకుని కరినినాడు బాలకృష్ణుడు చంపె
నీల మణికినీడు నీలవర్ణు
ఆ.వె. నైక్యమెుంద వలయు ననుచు కీర్తించెను
తమిళ భాష పదము తరలు చుండ
నట్టి పాటవిన్న నవనిలో పాడినన్
పరమ పదము కలుగు భాగ్యదశను 10

పదిపాశురాలయనంతరం ఫల శ్రుతిగ చెప్పిన గీత మిది. రచన చేసిన ఆమె, తన ఊరు తండ్రి పేరు చెప్పి తరువాత తన నామధేయం చెప్పిన దన్న

మాట. ఎత్తైన గోపుర సౌధాలున్న ఊరు విల్లుపుత్తూరు. విష్ణు చిత్తుని కూతురు గోదాదేవి. ఆమె మన్మథుని గురించి స్తుతించిన గీతాలు. తన్ను ఆ భక్తవత్సలుని చెంతకు చేర్చమని చెప్పినవి. వీటిని పాడిన వారికి ఆ విష్ణుపదం లభ్యమౌతుందట.

''కరుంబు విల్ మలర్కణై'' అని తమిళంలో ప్రారంభం.

మొదటి పది గీతాలు కామ దేవునకు మండలాలు కట్టి పుష్పాలతో నర్చించి, నైవేద్యాలు పెట్టి అగ్ని గుండంలో ఆహుతి క్రమంగ పూజలర్పించారు. తెలుగులో గీతాలు భూపాళరాగంలో స్వర పరచుకోవచ్చు.

## వేయి నామములు

**1:2:1**

సీ. నారాయణ నరుడన్ నామంబు వేవేలు
మాయత్త కొడుకువై మహిని పుట్టి
మా వ్యథ లెల్లను మటుమాయ మగునట్టు
చిలిపి చేష్టలు మాను చిన్ని కృష్ణ
ఫాల్గుణ మాసంబు పావనంబుగ మేము
మదనుని రాకను మదిని కోరి
తిరు వీథు లెల్లను తిన్నగా సరి చేసి
యతనుని కైయుండ నవని యందు

ఆ.వె. రాచ మార్గమందు రతనాల మూటగ
చిన్ని పదము లుంచి చెంత చేరి
బొమ్మ రిల్లు గాగ ముద్దుగ కట్టిన
గూనబు మేడ లెల్ల కూల్చ నగునె 11

శ్రీ మన్నారాయణుని వేయి నామములతో స్తుతించటం సామాన్య విషయమే. ఫాల్గుణ మాసమంతా నోము నోచి మన్మథుని రాక కోసం నిరీక్షించారు. ముచ్చటగ బొమ్మరిల్లు కట్టుకున్నారు. కాని చిలిపి కృష్ణుడు తన ముచ్చటైన పాదాలతో వాటిని కూల్చి వేశాడట.

''నావుమ్ ఆయిరమ్ ఎత్తనిన్ట నారాయణా'' అనేది ప్రారంభం. యమునా కళ్యాణి రాగం. త్రిపుట తాళం.

కట్టిన మిద్దె మేడలను కూల్చి, ఇవన్ని కూడ ఆటలాడుకునే బొమరిండ్లు కాని నిత్యమైనవి కావు. ఆ ముకుందుని పాదాలే వాటికి సాధనాలు.

**1:2:2**

సీ. ప్రళయ కాలమునందు బాలుండవై నీవు
వట పత్ర శాయిగ వరలు చుండి
యోగనిదుర యందె భాగవతుల ప్రోచి
యన్నిట నిలిచిన యాది మూర్తి
వెన్నెముకనవయ వెతల బాధల కోర్చి
మెఱుగుగా కట్టితి మేడలెన్నొ
ప్రీతితోనువు చూడ ప్రేమగ మే కం టి
మాశలున్న కూల్చనణచు కొనుము
తే. గీ. కరుణ మాయందు నేలకో కలుగ లేదు
అఘము చేసితి కాబోలు నరయ లేము
కూల్చు పనుల మానము కూర్మి తోడ
నింక నైనను మాయందు నింపు చేర్చి 12

ప్రళయ కాలంలో వట పత్ర శాయిగ జలధిలో నోలలాడు కృష్ణునికి విన్నవించుచున్నది. వెన్నెముక నొప్పి పుట్టేటట్టుగ ఇసుకలో బొమ్మరిండ్లు కట్టినదట. కాని శ్రీకృష్ణుడా గోపురాలను చూచి లోలోన సంతోషించినా, వాటిని కాళ్లతో తన్ని నాశనం చేస్తున్నాడట. ఇంక మీదటైన ఆ చిలిపి చేష్టలు మానుమని వేడుకొనుచున్నది.

''ఇన్రు ముట్టుమ్ ముదుగు నోవ'' అని తమిళంలో ప్రారంభం.

సహజమైన బాల్య క్రీడలచే నా వటపత్ర శాయి అకర్షితు డయ్యాడు.

**1:2:3**

సీ. ప్రళయ సమయమందు ప్రజ్వరిల్లెడి సింహ
రూపంబు తో నీవు రూఢికెక్కి
మదగజపు వెతల మటుమాయముగ చేసి
తేటైన నీటిలో తేలి యాడి
పాల సంద్రమునందు పవ్వళించుట చూడ
మనసు నందేలకో మరులు కలుగు
క్రీగంటి చూపుల గిలగింత వలదయ్య
చెయ్దు ముల్మానుము చేష్టలుడిగి

తే.గీ. వాగు లోనియడు సుమట్టి బాగ కలిపి
చేతి గాజుల సవ్వడిన్ చేట చెరగి
యింపు గాగ కట్టిన మా వి యిసుక మేడ
లల్లరి పనుల చెఱుపనీ కాట లగునె 13

"ప్రళయ కాలంలో సింహం వలె వెలుగుతు అలనాడు గజేంద్రుని ఆర్తిని పోగొట్టినావు. పాల సముద్రంలో పవ్వళించి యోగ నిద్రలోనున్న నిన్ను చూచిన వెంటనే మా కందరికి మనసులో తెలియరాని పారవశ్యమేర్పడింది. ఎంతో కష్టపడి అడుసు మట్టిని తీసి చేటలో చెరిగి నున్నని యిసుకతో చిన్న చిన్న మేడలను కట్టుకున్నాము. వాటిని మట్టిపాలు చేయుట న్యాయమేనా" అని బ్రతిమాలుకుంటున్నది.

"కుండు నీరుత్తై కోళర్" అని తమిళంలో ప్రారంభం.

బాల్య క్రీడలు వర్ణితాలైనప్పటికి లౌకిక విషయ వాంఛలతో జనించిన వస్తు జాలములన్నీ కూడ నిసుక మేడలే. అవి శాశ్వతాలు కావు. వాటిని చెఱిపి వేయటం భగవంతుని లీలా వినోదం.

**1:2:4**

సీ. తొలికాఱు మబ్బులో తొంగి చూచెడి ఛాయ
మేని సొబగులతో మెఱయు వాడు
చెంగల్వ కన్నుల చిన్నిమా చెలికాడ
చేతల పలుకుల చిలిపి తనము

లేల కోయన్నియు నింపుల నింపగ
ముగ్ధులైతిమి మేము మోహమందు
పరవశమ్ములు చేయ భవ్యమౌ మోహమున
నేమి దా చితి మంత్ర మెఱుగ లేము

ఆ.వె. పిన్న వారు వీరు బేలలనుచు నీవు
తలచు నంత మేము తరలి వచ్చి
నింద లేవి నిన్ను నెఱపంగ లేదుగా
చిఱుత మేడలన్ని చెఱుపనేల. 14

నీల మేఘపు ఛాయ కలిగి చెంగల్వ పూరేకు కన్నులతో నడయాడే తమ చెలికాడు ఆ కృష్ణుని చేతలలోను, మాటలలోను నెట్టి మంత్రాన్ని రంగరించాడో కాని, అందరూ, ముగ్ధులై పోయారు. పారవశ్యం తప్ప వారిలో మరితర భావాలు లేవు. వీరందరు చిన్నవారు, అమాయకులు అని తలచి కాబోలు తన చిలిపి చేష్టలను కొనసాగిస్తున్నాడు. ఏ నాడు ఆ గోపాల దేవుని నిందించ లేదు కదా! మరి ఎందుకో తాము కట్టుకున్న చిన్న చిన్న మేడలను నాశనం చేస్తున్నాడని ప్రార్థనా పూర్వకంగ పలవరించారు.

''పెయ్యుమా ముగిల్ పోల్‌వణ్ణా!'' అని తమిళంలో ప్రారంభం.

లీలలను గుర్తించిన సర్వులు, వశవర్తులగుతున్నారనటం సారాంశం.

**1:2:5**

సీ. కపటంబు తోడియో కమలనాథుడవీవు
కేశవ! మాధవా! కీర్తి దాత!
సన్నని యిసుకతో చక్కగ సరి చేసి
పల్వేరు శోభభవనము కట్టి
వీథులన్నిటి చక్క విభ్రమా లంకార
ములఁజేసి మేమెల్ల మురిసి పోవ
మెలతలు కట్టిన మేడల న్నిటి నిట్లు
పడ గొట్ట మనసెట్లు పంతమొందె

ఆ.వె. కనులు మోముునందు కలవుగా నీకని
గాఢ కోప మేమి కలుగ లేదు
నీదు వింత చేష్ట నిక్కమ్ముగ నరయ
నెడదలోను నేదొ నింపు కలిగె 15

సహస్ర నామాలు కలిగిన శ్రీ మన్నారాయణుని పలు పేర్లతో సంబోధిస్తూ ''మేమింతగ సన్నని యిసుకతో నిండ్లు కట్టావు. నీ ముఖంలో నింత లేసి కన్నులున్నాయి కదా! నీ వెందుకు ఆ చిన్న మేడలను కూలుస్తున్నావు. ఇన్ని దుండగాలు చేసినా నీ మీద మాకు కోపం రావటం లేదు. పైగా ఏదో తెలియరాని అనుభూతి కలుగుతున్నది'' అని తమ చిత్త వృత్తి భావాలను తెలియజేశారు.

''వెళ్లై నుణ్ మణల్ కొండు'' అన పాశురానికి ప్రారంభం.

అనూహ్యము అనుభవైక వేద్యమైన మధుర భక్తి శృంగారానికి ఆలంబన మిది. రస వత్తరమైన జీవేశ్వరాను బంధం.

**1:2:6**

సీ. ఆలనాడు వారిధినర్ణవంబున కట్టి
రాక్షస కులమును రట్టు పెట్టి
లంకానగరమును రణరంగ మొనరించి
నట్టి వీరపురుషో యాది రూప
తుందుడుకు పనులఁ దుది లేక చేయుచుర్మ
వ్యాజంపు న్యాయంబు వలదు చేయఁ
బరి పక్వ దశలేని బాలికలము మేము
వింతగా కుచములుఁ బెరుగ లేదు
తే.గీ. వశ పరచుకొంటి గాకనీ వలపు చేత
లెల్ల నేర్వంగ లేదు లేయింత వఱకు
మేము మాయందు కరుణతో మెలగి యాడి
యింక నైనను బ్రోవుము శంక వలదు 16

శ్రీరామావతారంలో సముద్రానికి వారిధి కట్టి లంకను చేరి రాక్షసుల సంహరించిన వీర పురుషుడు విష్ణుమూర్తి. నేడు ఏ పాప మెఱుగని స్త్రీలు ఆడుకునే ఇసుక మేడలను నాశనం చేస్తూ ఎన్నో చిలిపి పనులు చేసి వాటికి న్యాయాన్ని ఆపాదిస్తున్నాడు. ఎదగని ప్రాయంలోని వారైనా ఆ బాలికలు బాల కృష్ణునకు వశమై పోయారు.

''ముట్టిలాద పిళ్లై'' అని తమిళంలో వున్నది. అవతారంలోని చర్యలను నిర్దేశించిందే కాని రామావతారమని పేరుతో పేర్కొన లేదు. అన్ని అవతారాలకు మూలం శ్రీకృష్ణ స్వరూపమే అని భావం. బాల్య చేష్టలభి వర్ణింపబడ్డాయి.

**1:2:7**

సీ. ఉత్తుంగ లయల మహోదధిఁ బోలిన
వేని ఛాయల జిగి మించు వాడ!
సేతువు కట్టిన శ్రీరామ నామాఖ్య!
భేద భావముగల వేద విదుల
చేరి నీ చక్కని చింత తెలియఁజేయ
నంత రార్థములను నరయ గలరు
ఎఱుక జ్ఞానములింత నెఱుగంగ లేము గా
చిన్నారి పొన్నారి చిఱుత వార

తే. గీ. మరయ మాచెంత వాదాడ నర్థమున్నె
చిఱుత యిండ్లు మా వేలకొ చెఱుప నగు నె
గూఢ భావము లేనట్టి కూర్మి మాట
పలుకు మో దేవ మోహన భావ మందు 17

చక్కని అంతరార్థమున్న పాశుర మిది. ఏమీ తెలియని అబలలు, వేడుకగ కట్టుకున్న బొమ్మరిండ్లను చెఱిపి వారిని సమ్మోహనంగ వశ పరచుకున్నాడు శ్రీ కృష్ణుడు. కాని ఆ పరతత్త్వంలోని రహస్యాన్ని వేద విదులు మాత్రమే గ్రహింపగలరు కాని, తమ వంటి అబలలకు సాధ్యంకాదు కదా అని పలుకు తున్నారు.

''భేదమ్ నన్గజి వార్గళోడు'' అని తమిళ ప్రారంభం.

శరణాగతిని పొందే భక్తులు తమ కేమీ తెలియదని, ఆరహస్యాన్ని వేద విదులు మాత్రమే గ్రహించగలరని వాపోవటం ప్రపత్తి మార్గానికి ప్రాతిపదిక.

**1:2:8**

సీ. జ్వలనంబులుప్పొంగు చక్రంబు చేఁబూను
విశ్వకల్యాణంపు విశ్వ కర్త
నీ రథిమించెడి నీల వర్ణపు వాడ
చిన్నిముచ్చిలి తోను చిఱుత పాత్ర
నిసుక రేణువు తెచ్చి యిష్టమౌనాటల
చిన్నిమేడల మావి చెఱుప నగునె
పాద తాడన చేసి పదిలంపు బొమరిండ్ల
వాదన ల్సేయకు వాసు దేవ

తే. గీ. పటిక బెల్లము సైతము పట్టి పిసికి
వైచి నప్పుడు సహజ మౌ రుచులు కూడ
నాశ మౌనటంచు తెలియ వశము కాదె
వేయి మారు తీపితినిన వెగటు కలుగు 18

శ్రీ కృష్ణుడు మాటి మాటికి కాంతలు శ్రమతో ఆసక్తితో కట్టుకున్న చిన్ని చిన్ని యిసుక మేడల్ని కాళ్లతో తన్ని వారిని ఏడిపిస్తున్నాడు. ఆ మేడలు కట్టుకోవటానికి వాళ్లెంతగ శ్రమ పడ్డారో చెప్పుకుని ''కృష్ణా! ఇదిగో చూడు బెల్లం వలె నీ చిలిపి చేష్టలు మాకు వేడుకగ వున్నప్పటికిని, మాటి మాటికి చేసినట్లైతే, బెల్లం మరి మరి తింటే వెగటు పుట్టేటట్లు నీ చేష్టలు మాకు విసుగును కలిగిస్తున్నది సుమా!'' అని హెచ్చరించారు.

''వట్టవాయ్ చిఱు తూద్రై'' అని పాశురానికి ప్రారంభం.

శ్రీకృష్ణుని చిలిపి చేష్టల నభివర్ణించినా జ్వాలలతో ప్రకాశించే చక్రాయుధాన్ని గ్రహించిన వాడు, లోక సంరక్షకుడు, మాయలను భేదించటంలో ఆనందాన్ని పొందేవాడు అనుట సూచితము.

**1:2:9**

సీ. గోవింద! నేలను కొలుచుచు నింగికి
పాతాళము వఱకు పదము సాచి
యా త్రివిక్రమ రూప మనెడి కీర్తి వెలసి
వామన రూపుడై వాసి గాంచి
నే డింటి వాకిట నిలచి యోరగ చూచి
చిరునవ్వు కిరణాల చిందనేల
మా చిన్ని మేడలన్ మా మనసుల నెల్ల
నాశంబు చేయగ న్యాయ మగునె

తే. గీ. బిగియు కౌగిట చేర్చుచు చింత వెుందఁ
జేయు ననురాగ భరితంపు చేష్ట లెల్ల
చేయగా మురియుచును మా చెంత చేరి
ఏమి తలతురో యితరులు నెఱుగ లేవా 19

చక్కని పేశల శృంగార మభి వర్ణితమైనది. కాంతలు కట్టిన మేడల సమీపించి, మెల్ల మెల్లగ తొంగి చూస్తూ, క్రీగంటి నవ్వుల చిందిస్తు, వెనుకవైపు నుండి బిగియార కౌగలించుకుంటు మురిపిస్తున్నాడట. ఆ బేలలు, కృష్ణుని లీలలకు లోలోన సంతోషిస్తూన్నా యితరు లేమని అనుకుంటారో కదా! అని బిడియ పడుతున్నారు.

'ముట్టతూడు పుగుందు' అనేది ప్రారంభం.

ఇందులో విశ్వరూపాన్ని ధరించిన త్రివిక్రమ స్వరూపం వర్ణిత మైనది. అట్టి అనంత శక్తి అనురాగానికి బద్ధమౌతున్నదనేది మధుర భక్తిలోని తాత్పర్యం.

**1:2:10**

సీ. సీతమ్మ యధరంపు శృంగార మాధురిన్
రసనేవ నల్లేయు రామ చంద్ర
మా చిన్ని మేడలఁ మటుమాయ మౌనట్లు
చేయ బోవకు మయ్య చిన్ని కృష్ణ

యనుచు మొరలిడుచు నలమటించి తిరుగు
జిలిబిలి మాటల చిన్ని పడతు
లవిలుబుత్తూరు వెలయు చుండ నా విష్ణు
చిత్తుని కూతురు చిన్ని గోద

తే.గీ. పాడు తమిళంపు గేయంబు ఫణుతులరసి
యెవరు పాడిన వారికి నిహము పరము
సుఖము లెల్ల లభించును శుభములగుచు
విష్ణుపదము దొరకునుగా వేయు నేల 20.

ఫలశ్రుతి పాశురము. విష్ణు చిత్తుని కూతురు గోదాదేవి పాడినది. అనాడు రామావతారంలో సీతాదేవికి ప్రణయ సుఖాన్ని అందించిన వాడు, నేడు గోపికలతో మాత్రమెందుకంత పరాకుగా వున్నాడు? అంత మాత్రమే కాదు వారు కట్టుకున్న యిసుక మేడల్ని కూల్చటంలో తన కొక ప్రత్యేకమైన ముచ్చట అని పాశురంలోని భావం.

ఈ పాటలను పాడిన వారకి ఇహపర సుఖాలులభిస్తాయి.

''సీదై వాయముదమ్'' అనేది ప్రారంభం. ఫలశ్రుతి మాత్రమే పాశుర భావం. తెలుగులో ఈ పది పాటలు బృందావన సారంగి రాగంలో స్వర పరచుకోవచ్చు.

## కోడికూయక మున్నే

**1:3:1**

సీ. శేషశాయి! ముకుంద! శీఘ్రమ్మె గ్రుంకగ
కోడికూయక మున్నె కొలను చేర
శుభప్రద మండల సూర్య దేవుండర్ణ
వంబున తోతెంచి వడిగ లేచె
వాగున తేటగ ప్రవహించు జలముల
తియ్యని యనుభూతి తెలియవచ్చె
నికమీద మేమెప్లు నింపుతో కొలనికి
రాములే నమ్ముము రసిక లోల

తే. గీ. చెలులు నేనును ప్రీతతో చేరి కొలువ
చెంత దుడుకుగ చేష్టల చేయవలదు
మావి దుస్తులు దయతోడ మాకు నిచ్చి
కరుణ బ్రోచుచు మానము కావుమయ్య 21

భాగవతంలో సుప్రసిద్ధింగవున్న గోపీ కృష్ణుల రసమయ ఘట్టమిది. గోపికలు సూర్యోదయానికి పూర్వమే స్నాన వాటిక చేరి స్నానం చేస్తున్నారు. ఎంతో హాయిగ చక్కని అనుభూతిని పొందారు. అంతలో సూర్యుడదయించాడు. కృష్ణుడు కొలను గట్టును చేరాడు. వస్త్రాపహరణం చేశాడు. దుస్తుల్ని యిచ్చివేయ వలసిందిగ గోపికలు ప్రాధేయ పడుతున్నారు.

''కోళి యళై ప్పదన్ ముున్నమ్'' అని తమిళం. గ్రాస వాసోదైన్యాలు మానవ జీవితాని కత్యవసరాలు. మొదటి రెండు భాగాలలోను వాసాన్ని తెలిపే రీతిగ వేడ మిద్దెల్ని నాశనం చేశాడట. ప్రస్తుతం వస్త్రాపహరణం గావించాడు. దైనందిక జీవితావసారాలను కూడ పరిత్యజించాలి అని భావం.

శరీరానికి దుస్తులు పై కప్పు వలె, ఆత్మకు శరీరం ఆవరణం మాత్రమే. ఆ అవరణాలప్పుడప్పుడపహరింపబడి కేవల శుద్ధ సాత్త్వికా ఆత్మ తత్త్వం మాత్రమే శేషిస్తుంద నేది పరమార్థం.

సెంజురుట్టిరాగం అటతాళంలో పాశురాన్ని పాడుకోవచ్చు.

**1:3:2**

సీ. తేనెలు చిందెడి తియ్యని తులసిని
మౌళి ధరించిన మరుని తండ్రి
వనమాలి వశవర్తి వలపుల పంట మా
వలువల మ్రానిపై వరుస దాచి
మగువలుండెడి చోట మసలుచుంటివికదా
యిటకేల వచ్చితి వెఱుగ లేము
కటకటా యీ తటా కమున కెల్లరిగితి
సామర్థ్యమేర్పడ చతురత రీతి

తే. గీ. గతియు లేదని ప్రేముడి క్రమము లేవి
చేయ జాలము వేగము చెంద నేల
నటన చేసితి కాళియ నాగ పడగ
మ్రాని దాచిన దుస్తుల మాకు నిమ్ము. 22

వలువలను దాచిన కృష్ణునితో తమ వస్త్రాల నిచ్చి వేయవలసిందిగ మొర పెట్టుకుంటున్నారు గోపికలు. ''స్త్రీలు స్నానం చేసే తటా కానికి ఏ విధీంగ వచ్చావు? నిన్ను ప్రాధేయపడి మా ప్రేమలను నిస్తామని అనుకొనవద్దు. అలనాడు కాళియునిపై నాట్యం చేశావు, ఆ నాట్యాలను చాలించు'' అని అంటున్నారు.

''ఇదు ఎన్ పుగుందదు'' అని ప్రారంభం.

మాయా విచ్ఛేదమే పరమార్థమనుట సూచితము. పూర్వ పాశురంలోని భావమే సమన్వయింపబడుతున్నది.

**1:3:3**

సీ. ధనువొక్కటిని బూని ధరణిని లంకలో
రక్కసుల తునిమెయారామ మూర్తి
నేటినీతులువగు నెనరైవ చెయ్దముల్
చేయంగ నీకెట్లు చెల్లె నయ్య
విగత వస్త్రుల చేయ వింతలో చెడు పని
యనుచు తోచుట లేదొ యాది రూప!
యీ స్థితిన్ మాతల్లు లిటులచూచిన వేళ
వెలివేయుదురు మమ్ము వేయు నేల?

తే. గీ. పుష్పిత ద్రుమశాఖాగ్రమునను చేరి
శయన సేవగ కూర్చుండి సైగ నడుగు
వాని నెల్లను నిత్తుము భవన మరిగి
పట్టు వస్త్రమొసగుముమా భాగ్య మదియ 23

''శ్రీ రామావతారంలో సత్పురుషుడుగ దుష్ట శిక్షణ మాత్రమే చేసిన నీవు నేడు కృష్ణ స్వరూపంలో దుడుకు పనులను చేస్తున్నావు.

వలువలను అపహరించి చెట్టు కొనకొమ్మపై కూర్చొని సైగలు చేసి మమ్మేల్లో అడుగుతున్నావు. విగత వస్త్రులుగ మమ్మి మా తల్లులు చూచినట్లైతే మమ్మి ఊరి నుంచి గెంటి వేస్తారు. నీ వడిగిన వానినెల్ల తప్పక మా భవనాలకు వెళ్లి యివ్వగలం. ప్రస్తుతానికి మా వస్త్రాలను మాకు ప్రసాదించు'' అని విలపిస్తున్నారు గోపికలు.

చక్కని రూప కల్పనతో కూడిన వర్ణన వున్నది. సర్వస్వాన్ని సమర్పించే మధుర భక్తి భావం దీనికి అలంబన.

''ఎల్లే ఈదు ఎన్న ఇళమై'' అని తమిళంలో ప్రారంభం.

మాయా విచ్ఛిత్తి మాత్రమే తరుణోపాయమనేది అంతర్భావం, మమకారమున్నంతవరకు నది సాధ్యం కాదు.

**1:3:4**

సీ. లంకను చెఱపిన రామచంద్రుడ వీవు
వెడదకన్నుల నలవిచ్చి నాల్గు
దిశలలో కోనేట తీర్థమాడు జనుల
చూడుము గోపాల చోద్య మిదియె
యెడలెగ కరముణు లేడ్చుచు నున్నారు
లేశంపుదయ లేద లేమలందు
వానర యూధంపు వరనాయకుడవీవు
ద్రుమము మీ దుండు దుస్తులవి మావి
తే. గీ. వేగ మిచ్చి మమ్మి కరుణ వీక్షణంబు
తోడ కావుమయ్య వరద! తోయ జాక్ష!
నీదు చరణ మందెపుడు మా నిత్యనుతులు
శరణు వేడుదు మనమున శార్ఙ్గ పాణి 24

గోపిక లందరు కూడ ఒక్కపెట్టున కన్నీరు మున్నీరుగ ఏడుస్తున్నారు. ''రామావతారంలో పురుషోత్తముడుగ నీవు వానరులకు నాయకుడు కావటం చేతనే నేడు చెట్టుపై కెక్కి దుస్తుల్ని దాచి పెట్టావు. మా

శోకాలు నీకు కనిపించటం లేదా! దయచేసి మా వస్త్రాలు మాకు ప్రసాదించు'' అంటున్నారు. ఇందులో సర్వసాన్ని సమర్పించిన తరువాత కూడ దయకలగటం లేదు కదా అనే ఆర్తి భావం మున్నది.

తమిళంలో ''పరక్క విళిత్తెంగుమ్'' అని ప్రారంభం.

పైన పేర్కొనిన తత్వార్థం ప్రగూఢంగ నున్నది.

**1:3:5**

సీ. నల్లని నా స్వామి నారాయణ! కొలనుఁ
గఱచుచున్నవి మీలు కాళు లందు
గఱకుగా నేవొక్రీ గాలగ్రుచ్చు చుండ
నోర్వజాల మికను నురగ శయన
మా యన్నలిపుడిట్టి మాదశల్చూచినన్
కోలతో నిన్నిప్డె కొట్ట గలరు
నీదుడు కుపనులు నేడిట్లు చూచినన్
తరిమివేయుదురుగా తండ్రులిపుడె
తే. గీ. చిత్ర వర్ణాంబరములగు జిలుగు కాంతు
లీను వస్త్రంబు మావెల్ల నిచ్చి కరుణఁ
బ్రోవు మయ్య మా గోపాల పుణ్య ధామ
ఆటలింక చాలించివమ్మాదు కొనుము 25

కొలనులో చాలా సేపు నిలబడి వుండటం చేత, ఆ నీటిలోని చేపలు కాళ్లను కరుస్తున్నాయట. క్రింది కాళ్లలో గఱకుగా నేవో గ్రుచ్చుకుంటున్నాయట. ''ఇంక ఏ మాత్రం సహించుకోలేము. మా దుస్థితిని మా తోబుట్టువులు చూచినట్లైతే కోలతో నిన్ను తరిమి తరిమి కొట్టగలరు. కాబట్టి ఆ తన్నులను తప్పించుకొని మా వస్త్రాలను మాకు పంచి పెట్టు'' అని అల్లిరి పనులకు సరైన శిక్షననుభవించటాన్ని కూడ గోపికాంతలు సహించు కోలేరట.

''కాలై కదువిడుకిన్ఱ'' అని తమిళంలోని పాశురం. జీవితంలో సంభవించే కష్ట సుఖాలు, ఆశ నిరాశలు, మానావమానాలు, జరామరణాలు,

వీటికి రూపకల్పన చేసి చెప్పటం ఆర్యులకు పరిపాటి. అట్టిదే పై పాశురంలోని భావం కూడ.

**1:3:6**

సీ. శిరసున కుంభము ల్చేర్చుచు పల్వేరు
శ్రుతిలయల గతుల సొంపు మీర
నాట్యకేళుల చేయు నర్తన విధులలో
లాస్యవినోద విలాస మూర్తి
తీరవీధులవైపు తిన్నగ వ్యాపించు
తోరంపు తామర తూడు లెల్ల
పాదాల చుట్టుచు బాధించుచున్నవి
విషపు కోరలవోలె వివిధ రీతి

తే. గీ. కపట ములు మానిమాయందు కరుణ తోడ
మావి వస్త్రంబు లెల్లను మాకు నిచ్చి
మానముల బ్రోచి యో స్వామి మమ్ము ప్రీతి
విందుమికమీద నీమాట వినయ మొప్ప 26

నెత్తిపై కుండల్ని పేర్చుకొని వింత వింతగ నాట్యం చేయటంలో నారి తేరిన వాడట రాధా కృష్ణుడు. ప్రస్తుతం నీటిలో చాలా సేపు నిలబడివున్న ఆ కాంతల పాదాలకు తామర తూళ్లు చుట్టుకొని బాధిస్తున్నాయట. కాబట్టి యింక సహించుకోలేని పరిస్థితి యేర్పడుతున్నది కాబట్టి తమ వస్త్రాలను తమ కిచ్చి రక్షించవలసినదిగ ప్రార్థిస్తున్నారు.

"తటత్తవిళ్ తామరై" అని తమిళం. ఇందులో ఆనాటి నాట్య విధాన మొకటి సూచింపబడింది.

లౌకికంగ మన మేర్పరచుకొనే మమకార పాశబంధాలు తామర తూళ్లు పాదాలకు పెనవేసుకున్నట్లు విముక్తిని కలిగింప కుండ చేస్తుంటాయట.

1:3:7

సీ. ప్రళయకాలమునందు పరతత్త్వమైయుండి
సకలంబు తానైన సర్వమయుడ
నేడన్యాయంబులనెటి తప్పి చేసితే
మాయెడ దయ లేక మాయ తోడ
నీటిలో నెంతగ నిలుచున్న బాధలన్
తాళలేకున్నాము దానవారి
మాయిండ్లు ఊపల్లె మావాడలెల్లను
దవ్వున నున్నవి దాపుగావు

తే. గీ. ప్రేమ లేలకో నీమీద పెరుగు చుండ
తల్లి మము జూడ నొక పరి తల్ల డిల్లు
పట్టు వస్త్రములమ్మెల్ల పంచిపెట్టి
వృక్షము దిగి మావలువల వేగమిమ్ము 27

ప్రళయ కాలంలో సర్వశక్తి సమన్వితుగ వెలుగొంది సర్వాన్ని తననియామకంలో నడపించే సర్వేశ్వరుడు నేడు న్యాయాన్ని తప్పించి గోపికల వలువల్ని అపహరించాడు. నీటిలో నిలబడటం చేత కాళ్లు స్వాధీనాన్ని కోల్పోతున్నాయట. పైగ గోపికల వాసాలు ఆ కోనేటి నుండి చాల దూరంలో వున్నది. వివస్త్రలుగ వెళ్లలేరు. ఆస్థితిలో వారివారి తల్లులు వాళ్లను చూచినట్లైతే పరిపరివిధాలుగ తల్లడిల్లిపోతారు అని విషయాలను విశదీకరిస్తూ తమ వస్త్రాలను తమకిచ్చి వేయవలసిందిగ విలపిస్తున్నారు. ఇన్ని దుండగాలు చేసినా ఆ గోపాల కృష్ణుని చూచినప్పుడు వారి మనస్సు అనురాగంతో నిండిపోతున్నదట.

''సీరిలే నిన్షయర్'' అనేది తమిళం. తమకున్న దుస్థితుల్ని వివరించారు. పూర్వ పాశురంలోని పరమార్థాన్నే సమన్వయించు కోవచ్చు.

**1:3:8**

సీ. నిర్మల నీరజ నేత్రమాయతములై
నిశిని నిదురు పోవు నిర్వికార!
మేమెల్లరము నీకు మేనత్త నిసువులా
వావివరుసతోడ వలపు చూప
తానంబు చేయంగ తారసిల్లగ జను
ల్మాక్షేమ మిదియేనా మదన రూప
సత్యంబు మామాట సరసాలు చాలింక
కూతుళ్లు యత్తలు కొలన గలరు
తే. గీ. ద్రుమము దిగివచ్చి వలువలు దులిపి దులిపి
వారి వారివి సరిగాగ పంచిపెట్టు
ఓ కృష్ణ! మురహరి! మాధవ! యుదధి వాస!
వలదు చాలింక సరసంపు వలపులెల్ల 28

చెట్టు పైన వస్త్రాలను దాచిపెట్టి పైన కూర్చొని వున్న కృష్ణుని తమ తమ వలువల్ని యిచ్చి వేయవలసిందిగ ప్రార్థిస్తున్నారు గోపికలు. ''కొలనులో స్నానం చేస్తున్న స్త్రీలందరు నీ సఖులు కాదు కృష్ణా! నీకు అత్తలు, కూతుళ్లు ఎందరో వున్నారు. అందరి వస్త్రాలను అపహరించి చిలిపి చేష్టలు చేయటం సరికాదు. వెంటనే వారి వారి దుస్తుల్ని వారి వారి కప్పగించు'' అని వేడుకుంటున్నారు.

''మామిమార్ మక్కళే'' అని ప్రారంభం. త్రికరణ శుద్ధిగ ప్రార్థించటమే భక్తికి గల పటుత్వం. ఫలసిద్ధి నివేదన పూర్వకంగ వున్న పాశురం. పై పాశురాలకున్న అంతరార్థమే యిక్కడ గ్రహించాలి.

**1:3:9**

సీ. కంసుని చేతలన్ క్రమ్మిన తమముల
ఛేదించి వెలుగులన్ చిందినావు
పెట్టిన పాట్లను భరియించి ప్రాణమై
గోకులంబుననీవు కూడి నావు

నట్టనడువు నీట నడయాడు పడుచులన్
నేడిట్లు బాధింప నెనరు కాదు
ఆయశోదాదేవి యల్లారు ముద్దుగ
పెంచిన ది కదయ్య ప్రేమ తోడ
తే. గీ. మగత నంబును దండించి మసల లేదు
కొంటె బాలుడై పూతన కుచములదిమి
ప్రాణ హరణము చేసిన పరమ పురుష
పుట్టుములొసగు మావెల్ల పుణ్య మగును 29

గోపికలు కృష్ణుని బాల్యక్రీడలలోని దుష్ట శిక్షణలను, అందులో దాగిన అల్లరి తనాన్ని జ్ఞాపకం చేస్తున్నారు. ''కంసుడెన్నో హింసలు పెట్టాడు. కాని వాటి నుండి తప్పించుకున్నావు కృష్ణా! పూతన పాలిండ్ల నదిమి, ఆమెను హతమార్చావు. చిన్నప్పుడే నీలో నున్న మగతనాన్ని నిన్ను పెంచిన యశోద సరిగ్గా గమనించి శిక్షించలేదు కాబోలు. అందుకే నేడు నీటిలో నిలబడి ప్రాధేయ పడుతున్న మమ్మ రక్షించటం లేదు'' అని విలపించారు.

''కంజన్ వలైవైత్త అన్ఱు'' అని తమిళం.

లీలామానుష స్వరూపంలో నవతరించిన కృష్ణావతారంలోని విలాసాల భివర్ణితాలు.

సాంసారిక సాగరంలో నుండి విముక్తిని కోరటమే జీవికున్న పరమార్థం.

1:3:10

సీ. గోపాల బాలికా గోష్ఠి సంపూజితా
కళ్యాణ గుణ రామ కాంతి ధామ
బంగారు మేడల భవనంబు లొప్పెడి
విల్లి పుత్తూరను వీటి యందు
జనులు కొలిచెడి శ్రీ స్వామి భట్టారుని
కూతురై వెలసిన గోద నేను
నల్లని యా స్వామి నయమొప్పు లీలలన్
మధుర గీతము నందు మలచినాను

తే. గీ. పదియు పాటలు నేర్చిన వారు సకల
ప్రకృతి దాటుచు వైకుంఠ పదము నందు
తిరనివాసుని నాథునితిరముగాగ
తానము పడయుదురు కదా తరచి చూడ 30

ఫలశ్రుతి పాశురము. బంగారు మేడలు మిద్దెలు కలిగిన శ్రీ విల్లుపుత్తూరులో శ్రీ స్వామి భట్టారకుని కుమార్తె గోద దేవి శ్రీ కృష్ణుని లీలల ప్రస్తుతించి పాటలను పారాయణముగ పాడిన వారికి శ్రీపదము లభించునట.

''కన్నియరోడు ఎంగళ్'' తమిళంలో ప్రారంభం. ఇందులో పది పాటలు కూడ గోపికా వస్త్రాపహరణ ఘట్టంలోనిదే. శృంగారానికే మాత్రం తావు లేకుండ పరిశుద్ధమైన ఆత్మల విలాపం మాత్రమే ప్రధానంగ వర్ణింపబడింది.

## నిత్యబద్ధ ముక్తులు

**1:4:1**

తే. గీ. కూడు వస్తువా కూర్పుమ కూర్మి నరసి
నిత్య బద్ధ ముక్తులు సదా నిర్వికార
సత్య మర యుదురు జ్ఞాన సారమెల్ల
జడ పదార్థరూప సజీవ శాంత వదన

తే. గీ. శయన దశనీదు సౌందర్య చరణములను
చేతు లారంగ ముదముతో చేర్చి పట్టి
గుబురు తోటలో శయనించు గోప విభుడ
శరణు వేడితి బ్రోవుము స్వామి మమ్ము 31

సకల చరాచర ప్రకృతి నియా మకు డాసర్వేశ్వరుడు. అ పరతత్త్వ జ్ఞానమును నర్థించినవారు శుద్ధ సాత్త్విక స్వరూపులు. వీరు ప్రకృతిచే బద్ధులైనప్పటికి అహంకార మమకారాలచే ముక్తులైన వారు.

బాలికలు గుంపులు చేరి ఆడుకునేటప్పుడు పందాలు వేసుకోవటం గెలుపు ఓటములను నిర్ణయించటానికి కొన్ని నియమాలా నిర్ణయించు

కుంటారు. తామనుకునే పని నేరవేరుతుందంటే దాని ఫలితం యిలా వుండాలి అని తీర్మానించుకుంటారు.

చిన్న చిన్న గులక రాళ్లను కాని గవ్వలను కాని పోగుగ కూర్చు కొని సరి, బేసి అని రెండు రెండుగ విభజించుకుంటారు. ఇందులో సరి సంఖ్య మిగిలితే అనుకున్నది జరుగుతుందని నిర్ణయించుకుంటారు. లేదంటే కండ్లు మూసికొని మట్టిలో గుండ్రంగ వర్తులాలు గీచుకుంటారు. ఇది తప్పు లేకుండ సరిగ్గా రెండు మొనలు గుండ్రంగ చేరుకుంటే అనుకున్నది జరుగుతుందను కుంటారు. ఈ విధంగానే ఆనాడు కృష్ణుని చేరాలని యువ్వీళూరుతున్న గోపికలు ఆడుకున్నారట. అందుకే జయాన్ని నిర్దేంచే వస్తువును 'కూడు వస్తువా' అని సంబోధించారు. గుబురుగ నున్న తోటను అనంతశయనుడుగ పవ్వళించిన ఆ మహావిష్ణువు పాదాలను తమ రెండు చేతులార పట్టుకొని శరణు వేడాలని ప్రాధేయపడినారు ఆ గోపికలు.

''తెల్లియార్ పలర్'' అని తమిళంలో పాశురానికి ప్రారంభముండి 'కూడిడి కూడలే' అని పూర్తి అవుతున్నది. పాశురాలు కేదార రాగం అటతాళంలో పాడుకోవచ్చుట.

మొదటనుపయోగించిన సమాసమే తత్త్వార్థ బోధకం. పిల్లలు ఆడుకునే ఆటల్లో కూడ భావ సూచకమనేది అగమ్య గోచరమనే గూఢ భావమున్నది.

**1:4:2**

తే.గీ. వేంకటగిరి యటవిమార్గ వీధులందు
నయమము కృష్ణాపురము మహా నగర మందు
శ్రమము నొక్కింత లేకయే సత్య మగుచు
నిత్య వాసము చేయును నీలవర్ణు

తే.గీ. తనకు తానునా కెంగేలు తార్చి పట్టి
నిండు నెమ్మేను తన తోడ నిలిచి చేర్చి
వామనావతారంబున వచ్చునటుల
కూర్చు వస్తువా! కూర్పుమ కూర్మి తోడ 32

గోదా దేవి మనః ఫలకంపై నిలిచిన శ్రీకృష్ణుని అర్చావతార రూపం రెండు ప్రధాన స్థలాలలో వున్నది. ఒకటి తీగ జొంపములు, గుబురు పొదరిండ్లు చెట్ల సమూహాలు. రాళ్ల రప్పలు నిండిన వేంకటగిరి అడవి మార్గంలో నున్న శ్రీ వేంకట రమణుడు. రెండవది నగరంలో వాసి కెక్కిన కృష్ణాపురంలోని శ్రీకృష్ణుడు. వీరిరువురు అనాయాసంగ కాలువు దీరివున్నారట. విశ్వరూపాన్ని ధరించిన వామనుడు తనకు తానుగ తన్ను సమీపించి చేతులు పట్టుకొని కౌగలించుకున్నాడట. కాబట్టి ''కూర్పులు తెలిపే వస్తువా ఆ భాగ్యాన్ని నాకు కలిగించు'' అని అడుగుతున్నది.

'కాట్టిల్ వేంగటమ్' అని ప్రారంభించి ''కూడిడు కూడలే'' అని ముగిస్తున్న పాశురమది.

అటవిలోనైనా సరే నగరంలోనైనా సరే తన యిష్టదైవాన్ని చూచి ఆరాధించుకోవటమే భక్తితత్త్వంలోని రహస్యం. విరాట్పురుషుడుగ నున్న అవతార విశేషం స్మరింపబడింది.

**1:4:3**

తే. గీ. పద్మ భవుడు దివ్య సురలు ప్రస్తుతించు
విభుడు సొగసులీను వెలుగు విస్తరిల్ల
మోము కలవాడు దేవకీ ముద్దు బిడ్డ
సుగుణ గుణధాము వసుదేవ సుతుడు వాడు

తే. గీ. నన్ను కలయ గలుగునాదు నాథుడరయ
జడ పదార్థ రూప సజీవ శాంత వదను
కరుణ మీరగ నా తోడ కలిసి పోవ
కూర్పు వస్తువా నను కూర్చు కూర్మి తోడ 33

బ్రహ్మ దేవాది సురలు ప్రస్తుతించే పరమపురుషుడు దేవకీ వసుదేవుల బిడ్డగ నవతరించినవాడు ఆ శ్రీకృష్ణుడు. గుణోన్నతుడు తేజస్వంతుడు. అట్టి పరంధాముని తనతో చేర్పవలసిందిగ కూర్చే వస్తువులను ప్రాధేయపడుతున్నది. ''పూమగన్ పుగళ్'' అని ప్రారంభించి 'కూడిడు కూడలే' అని పూర్తి అవుతున్నది. తేజస్సులో ఒక కళికగ తాను చేరిపోవాలని ఆమె విన్నపము.

**1:4:4**

తే. గీ. గోకులపువారెల్లను భీతి గుండె లదర
ద్రుమముపై నుండి యొకపరి ద్రుమికి వచ్చి
మడుగు నీరెల్ల చెదరుచు మసలు చుండ
సరసున నుబికె కాళీయ సర్పమపుడు

తే. గీ. పడగపై నిల్చి నాట్యంపు పదము ద్రొక్కి
చిందులజనులఁ ముగ్ధులన్ చేసి తయ్య
కరుణతో కృష్ణ! నా తోడ కలయ వలయు
కూర్చు వస్తువా! నాథుతో కూర్పరాద 34

కాళీయ మర్దనం కావించి అలనాడు గోపాల జనాన్ని ఆశ్చర్యంలో ముం చెత్తిన బాల్య చేష్ట వర్ణింపబడింది. ఎక్కడో చెట్టుపై కూర్చొనివుండి తటాలున మడుగులోకి దూకిన వెంటనే, ఆ నీటిలో నున్న కాళీయుడు బుసలు కొట్టూ పైకి లేచాడు. ఆ పడగల పై నిలచి లాస్యంగ నృత్యం చేసిన రూప మీ పాశురంలో నున్నది. అటువంటి దుష్ట శిక్షకునితో తన్ను కూర్పమని వస్తువుతో మొరపెట్టుకుంటున్నది.

'ఆయ్చ్చిమార్గళుమ్' అని ప్రారంభించి 'కూడిడు కూడలే' అని ముగిస్తున్నది.

వేయి నాలుకలు కలిగిన కాళీయుడు మనస్సులో విజృంభించే అరిషడ్వర్గాల జనితమైన ఆలోచనా పరంపరలు. వాటి నాశనానికి పరమాత్మ పదతాడన మత్యంత అవసరం.

**1:4:5**

తే. గీ. మేడ మిద్దెల వెలిగాడి మేల్మి మధుర
నగర వీధుల నడచిన నాథుడతడు
మనల మురిపింప చేసెను మనవి నగర
వాడల విలాస కేళుల వలపులెన్నొ

తే. గీ. పేరు మోసిన కువలయా పీడ మనెడి
గజము కాలనెట్టిన నాటి ఘనత కృష్ణ!

చెన్ను మీరగ నిన్నెగా చేర గలదు
కూర్చు వస్తువా! నాథుతో కూర్చ రాదొ 35

కువలాయా పీడగజాన్ని మర్దించిన బాల కృష్ణుని లీలలు స్మరింపబడుతున్నాయి. ఆ కృష్ణుడు మథురానగరపు వీధులలో గోపికా కాంతలతో ఎన్నొ సరససల్లాపాలు చేసి వారిని మురిపించాడు. అట్టి నందాత్మజునితో తాను చేరాలని పందెంలో కూర్చే వస్తువుతో గోదా దేవి బ్రతిమాలుతున్నది.

''మాడమాళిగై సూళ్ మథురై'' అనేది ప్రారంభం. అన్నిటికి మకుటంలాగ 'కూడిడు కూడలే' అని చివర వున్నది.

ఇందులో గమనింపదగిన విషయం, చిన్ని కృష్ణుని చిలిపి చేష్టలలో శృంగార పరంగ వున్న వస్త్రాపహరణ ఘట్టంతో పాటు, ఆశ్చర్యాన్ని కలిగించే శౌర్యపరాక్రమాది కార్యాలభివర్ణింపబడ్డాయి. కువలయా పీడన మనే గజం మన మనస్సునకు రూప కల్పన, ఆ మనస్సు అధీనంలో నుండాలంటే పరాత్పరుని కరుణ యవసరమనుట సూచితము.

**1:4:6**

తే.గీ. రోట కట్టిన త్రాటితో బాట వేసి
అర్జునద్రుమ యుగమును నవని కూల్చి
పరమ ప్రాప్తియె గోపాల బాలు పదము
కపట చర్యల చేసిన కంసు గూల్చి

తే.గీ. మధుర నగరపు రాజయ్యె మాధవుండు
మధుర వీధుల నడయాడి మసలు చుండు
కలుపు మతనిని నాతోడ కలుగు కీర్తి
కూర్చు వస్తువా నాథులో కూర్చ రాదా. 36

శాపగ్రస్తులుగ మద్ది చెట్ల రూపంలో నున్న గంధర్వులకు విమోచనాన్ని కలిగించిన మథురాధిపతి మాధవుడు. కంసుని క్రూర కార్యాలను నణగ ద్రొక్కాడు. ఆ పురుషోత్తముడు మథురా నగర రాచ

వీధులలో నడయాడు తున్నాడు. ఆ కృష్ణునితో తన్ను చేర్పవలసిందిగ కోరుకుంటున్నది గోదాదేవి.

''ఆట్టవన్ మరుదంమునట్'' అని ప్రారంభించి 'కుడిడు కూడలే' అని అంతమైంది.

ఇందులో కూడ శాపమోచన విషయం ప్రస్తావింపబడి యుండుట గమనార్హం.

**1:4:7**

తే. గీ. శాపగ్రస్తుల సురులును స్థావరముల
రిపుడు మహిషమైయున్న నరిష్టవరుని
బకుని జయశీలుడై చేతి బలము తోడ
శూల ధారయౌ కంసుని వేల మడచె

తే. గీ. కృష్ణుని నరియని తలచి కీడు చేయు
చేది రాజును మడియించె చేష్ట మీర
గోప బాలుడు కృష్ణుడు గొనముల రయు
కూర్పు వస్తువా! వానితో కూర్ప రాదా 37

శ్రీకృష్ణుని బాల్య చేష్టలలో వీరోచిత కార్యాలను మాటి మాటికి స్మరిస్తు దుష్ట సంహారం చేసిన వాడని కీర్తిస్తున్నది గోదాదేవి. అసురుల నెందరినో తునుమాడి నాడు. శాపగ్రస్తులై స్థావరాలుగ నిలిచిన వారికి విమోచనాన్ని కలిగించాడు. అరిష్ట వరుడనే రాక్షసుడు మహిషమై యున్నప్పుడతనిని వధించాడు. బకుని నోటిని చీల్చి సంహరించాడు. మిక్కిలి బల సమన్వితుడైన కంసుని హతమార్చాడు. అట్టి గోపాల కృష్ణునితో తన్ను చేర్పమని కూర్పు వస్తువుతో నర్థించుచున్నది.

''అన్రు ఇన్నాదన'' అని మొదలు పెట్టి 'కూడిడు కూడలే' అని పూర్తవుతున్నదీ పాశురం.

ఇందులో కూడ తమలో అసురులవలె నున్న దుష్ట శక్తుల్ని పరిమార్చినగాని సాయుజ్య దశలభించదనుట పరోక్ష భావం.

**1:4:8**

తే. గీ. ప్రేమ చెలిమియు కలిగెడి ప్రీతి మనను
లందు నుండును వేరొండు నరుగ లేడు
గోప కులమున నడయాడు గోపబాలు
డతడు మథురాధి పతివచ్చు నవని యందు.

తే. గీ. కోడె దూడల నాడును గోము తోడ
ద్వార కానగ రంబున వాస మొంది
యధిపుడైయుండు గోవిందు డచ్యుతుండు
కూర్పు వస్తువా నాథుతో కూర్పరాదొ. 38

ప్రేమాను రాగాలు నిండిన మనస్సు మాత్రమే శ్రీకృష్ణునికి నివాసమౌతుంది. అవి లేని మనస్సులో అతడుండలేడు. హాయిగ గోకులంలో గోవులతోడను, దూడలతో అడుకునేవాడు. ద్వారకాధిపతి, మథుర వీధి నాథుడు. 'అతనితో ఓ కూర్పు వస్తువా! చేర్పువు' అని శ్రీకృష్ణుడంటేనే దయ, ప్రేమ, చెలిమికి వీటికి రూపం, అందుకే నోరులేని కోడె దూడలతో అడుకుంటాడట.

''అవలన్బుడై యార్'' అని ప్రారంభం ''కూడిడు కూడలే'' అనేది చివరిది.

ప్రేమాను రాగాలే భగవత్స్వరూపమనేది ప్రత్యక్ష భావం.

**1:4:9**

తే. గీ. రహిని లేనట్టి సౌందర్య రాశిగాగ
వటువు వేషంబు ధరియించి వచ్చి నిలిచె
యసుర వరుడగు బలి చేయు యజ్ఞమందు
నడుగు మూడని దానంబు నడిగినాడు.

తే. గీ. నిక్కిపాదంబు నొకటితో నింగి కాలిచి
అన్య పాదంబు నొకటితో నవని కాలిచి
విశ్వరూపంబుతోతేర విబుధులరయ
కూర్పు వస్తువా నానాథు కూర్ప రాదొ 39

అవతార రూపము లెన్నియున్నప్పటికి విశ్వరూపాన్ని ధరించిన త్రివిక్రమ స్వరూపమే గోద మనస్సులో నిలిచింది. అందుకే ఆ రూపంలో తన్ను కలిపి వేయవలసిందిగ ఐక్య సిద్ధిని కలిగించే వస్తువుతో విన్నవించుకుంటున్నది.

''కొండ కోల కురళ్'' అనేది ఆది పాదంగాను, కుడిడు కూడలే అనేది అంతంగాను వున్నది.

భూనభోంతరాళలలో వ్యాపించియున్న సర్వమయుడు, సర్వ శక్తిమంతుడు, సర్వ వ్యాప్తుడగు సర్వేశ్వరుని వర్ణనము భగవంతుని తత్త్వార్థాన్ని తెలియజేస్తున్నది.

**1:4:10**

తే. గీ. సొగసు లీనెడి చిన్నారి సుదతులరయ
గోపికల చిత్తముల చేరి గుట్టు తెలిసి
వేద సారుడగుచు నాడు భీకరముగ
మదపుటేనుగునడచుచు మోద మిచ్చె

తే. గీ. వనము చొచ్చుచుస్వైరంపు పదములరసి
తిరిగి నడయాడు నాస్వామి తిరముగాగ
కూడ నున్నాడు వనమాలి క్రోధి తోడ
కూర్పు వస్తువా! ప్రేమతో కూర్పరాదా. 40

''ఎల్ల వేళల నిర్మలమైన' మనస్సు కలిగిన గోపికలయందే సంచరించువాడు. వేద సారుడు. అలనాడు మదంతో తిరుగాడి స్వేచ్ఛగ విహరించిన గజేంద్రుని ఆర్తిని విని కాపాడినవాడు. ఆ వనమాలి నేడు క్రోధితో వనాలలో తిరుగుతున్నాడు. కూర్పు వస్తువా! అతనితో నాకు ఐక్యసిద్ధిని కలిగించు'' అని అంటున్నది ఆండాళ్.

'పళగు నాన్మరైయిన్' అని ప్రారంభించి 'కూడిడు కూడలే' అని పూర్తి అయ్యే పాశురం.

ఇందులో కూడ వేదాంత సారుడా విష్ణుమూర్తి అని గరుత్మంతుడు తన రెండు చేతులతో ఆ విశ్వాకారుని పైకెత్తి లోకానికి చాటుతున్నాడు. ఆ

విషయమే యిందు పరోక్షంగ వున్నది. మనసులోనున్న అహంకార మమ కారాలను అణచుకోవటానికి గజేంద్రుని విలాపం వలె భక్తునిలో ఆర్తితోడి విలాపమవసరం. అప్పుడే పాశ బంధంలో నుండి విముక్తులము కాగలం.

**1:4:11**

తే. గీ. ప్రణయ కలహంబు చెలికాని ప్రార్థనలును
చరమ ఫలితమై సంభోగ సౌఖ్య మగును
గోపికలకును కలిగించె గోద నేడు
నవరతముగ పాడిన భక్తి నఘము తొలగు. 41

పది పాశురాలకున్న ఫలశ్రుతయిది. పదింటిలోను ఐక్య సిద్ధినపేక్షించి వస్తువుతో మొరపెట్టుకున్నది. శృంగారంలో ప్రణయ కలహం. ప్రియుని ప్రార్థనలు, మరల సంభోగమనేది క్రమ పరిణామం. ఈ మూడింటిని కలిగిస్తు రెండవ దశయైన విన్నపాలను తెలుపుకున్నది. ఈ పది పాటలు పాడిన వారికి పాపాలు తొలగి పోతుందని ఫలశ్రుతి.

తమిళంలో ''ఊడల్ కూడల్ ఉణర్తల్ పుణర్తలై'' అని ప్రారంభం. పై మూడు, శృంగార భావ సంకేతాలు.

ఇందులో పాప నాశన హేతువులనుట మాత్రమే యున్నది. అంటే క్షేత్రాన్ని చక్కగ పండించాలంటే అందులో మొలచిన ఊదర మొక్కల్ని తీసివేసి, చక్కగ సాగు చేయాలనుట సూచితం.

## 2. ప్రణయ సిద్ధాంతాలు

### 2:1:1 కోకిల నడుగట

సీ. పొన్నచెట్లు మఱియు బొగడ మ్రాకుల యందు
 క్రుంగ వృక్షములందు గుబురు లందు
కమ్మగా హరినామ గానంబు చేసెడి
 కోకిలమ్ములఘన కూజితమ్ము
వినగవినగ మాకు వీనుల విందగు
 వినరండి యొకమారు పికములారా
చిరమహా ఘనకీర్తి శ్రీపతీ విష్ణుండు
 మిసిమినీలమణుల మేని వాడు
తే.గీ. మేన నవరత్న కాంతితో మేఱయు వాని
వలచి తిని మన సార యావన్నె కాని
విరహముపలన వలయంబు వీడెనేడు
పగడ ఛాయల నధరంపు వాని కూర్పు 42

యుక్త ప్రాయాన్ని అందుకున్న గోదా దేవి కృష్ణున్ని వలచి ప్రణయగీతాలను ఆలపిస్తున్నది. కోకిలను పిలిచి కృష్ణుని జాడలడుగుతున్నది.

ఈ పాశురంలో మూడు విషయాలున్నాయి. మొదటిది సందేశాన్ని అందుకునే కోకిల వర్ణన. రెండవది తన మనోనాయకుడు శ్రీకృష్ణుని వర్ణన. మూడవది తత్కారణంగ తాననుభవిస్తున్న విరహ తాపం.

కోకిలలు, పొన్న, బొగడ, క్రుంగ వృక్షములపై కూర్చొని కుహు కుహు అని అరుస్తున్నది. ఆ స్వనం ఆమెకు హరి నామ మననం వలె నవ్యక్త మధురంగ వినిపిస్తున్నది. అందుకే వాటిని పిలిచి తన నాయకునితో తన్ను చేర్చుమని అడుగుతున్నది. ఆ నాయకుడు మహా యశస్సును పొందిన లక్ష్మీపతి యగు విష్ణుమూర్తి. నీల మణి వంటి శరీర ఛాయతో నవరత్నముల కాంతిని కలిగినవాడు. అట్టి సుందరాంగుని వలచిన నాటి నుండి తన మేను కృశించి పోయినదట. విరహం వలన చేతి వలయము కూడ జారిపోతున్నదట.

కాబట్టి ''పికములార! ఆ సొగసు కానితో నాకు సౌఖ్యమైన పొందును కలిగించండి'' అని ప్రాధేయ పడుతున్నది. పగడ ప్రభావం వంటి అధరాలు కలిగిన వాడని వివరించింది.

''మన్ను పెరుమ్ పుగళ్'' అని ప్రారంభం ఈ పాశురాలు ఆనంద భైరవి రాగం. ఆది తాళంలో పాడుకోవచ్చుట.

బాల్య క్రీడలో తామాడుకునే పందెపు వస్తువులను ప్రార్థించింది, ప్రస్తుతం ప్రకృతిలో నున్న జీవరాశుల్ని సందేశానికి అర్థిస్తున్నది. ఎన్నో పక్షులున్నా కీర సందేశం హంస సందేశం అని ప్రసిద్ధికెక్కినవి వున్నా గోదాదేవి ఎన్నుకున్నది నల్లని ఛాయ కలిగిన కోకిలను. కారణం తన ప్రియుని మేని ఛాయ నలుపు. రెండవది అవ్యక్త మధురాలాపం కలిగినది పికమే. జీవేశ్వర సమైక్యానికి నడుమ గురూపదేశ మవసరం కదా!

**2:1:2**

సీ. తేనె సోనచిలుకు తెల్లని సంపంగి
 దళముల ప్రీతితో దరిని చేరి
నములుచు మధురగానంబులు చేసెడి
 పికములారగరిమ ప్రేమ మీర
ధవళశంఖరవపు ధ్యానంబు చేయుచు
 వలకేల తాబూను వాసు దేవు
నిర్మలాకారుడు నెనరుతో నెమ్మదిన్
 దర్శన మీయంగ తరలి రాడు.
తే.గీ. ఎడద నిత్యంబు వాసంబులింపు చేసి
చిలిపి చేష్టల లోలోన చేయుచుండు
విరహ బాధల నావెల్ల వేచి చూచు
కూర్మి వేంకట నాథుని కూర్పరాదొ 43

వేంకటనాథుడే తన హృదయంలో నిలిచినవాడు. కోకిలలను పిలిచి మాట్లాడుతున్నది. తేనెలు కారుతున్న సంపెంగి పూరేకులను తింటు కమ్మగా పాటలు పాడుతున్నాయట పికములు. ఇది సందేశాన్ని అందించవలసిన కోకిల

వర్ణనము. ఎవరికేమని చెప్పాలి? అంటే ఎడమ చేతిలో తెల్లని శంఖాన్ని ధరించినవాడు. నిర్మలా కారుడు. తనకు తానై యే నాడెవరికి దర్శన మీయడు. అతనికి విషయాన్ని అందించాలి. తన హృదయంలో నిత్య నివాసం చేస్తు లోలోపల శృంగార భావాలను కలిగిస్తు తాను పొందే విరహ తాపాన్ని తిలకిస్తు వేంకట గిరిపై నివాసం చేస్తున్న శ్రీ వేంకట రమణునికి తన పరిస్థితి వివరించి తనతో అతనిని చేర్చి వేయాలట.

''వెల్లె విళి సంగు'' అని ప్రారంభం.

అత్యంత మనోహర సౌందర్య వర్ణన మున్నది. సర్వేశ్వరుని సృష్టిలో మూల ప్రకృతి సౌందర్యాపదితమైనది. కాబట్టే రెంటను వర్ణనలు సమగ్ర సుందరంగ నున్నది.

**2:1:3**

సీ. పువ్వులు విచ్చిన పూదోట సీమలో
విరివిగ తెమ్మెరల్ వీచు చుండ
తుమ్మెద గానంపు దొంతర వినుచును
ప్రీతితో తిరుగాడు పికములార
మఘువుని తేరున మాతలియల నాడు
రథమును సాగించెరణమునందు
మాయావి రావణు మర్మంబు గుర్తించి
వధియించె శిరముల వరుస నొకటి

తే.గీ. వీర నరుడగు స్వామికై వేచి యుందు
నీల వర్ణుని చేరంగ నెవరు తోడ
వేయి కనులతో చూచుచు వెదకుచుందు
కూర్పు రాదొనా తోడను కూర్మిమీర 44

రంగు. రంగుల పువ్వులతో నిండిన పూదోటలో చల్లగ గాలి వీస్తున్నది. ఆ పూదేనెలను గ్రోలడానికి మధుపాలు తిరగుతు రొద చేస్తున్నాయి, వాటికి ప్రీతిని కలిగిస్తు కోయిలలు పాట పాడుతున్నాయి. ఇది సందేశాన్ని అందించవలసిన ప్రకృతి జీవ వర్ణనం. అలనాడు వీర మాతలిని

తనకు రధ సారధిగ వచ్చి రణకేళి చేసిన రావణుని శిరస్సును వీరపురుషుడుగ భేదించినవాడు. ఇది ఆలంబనలోని నాయకుని వర్ణన. ఆ నీల వర్ణుని కొఱకు తాను వేయికళ్లతో వేచివున్నదట. తనతో ఆవనమాలిని చేర్చమని పికసమూహాల నడుగుతున్నది.

''మాతలి తేర్‌మున్బు'' అని ప్రారంభం. ప్రకృతి స్వరూప వర్ణనము. చిత్, అచిత్, ఈశ్వర సమాగమ కాంక్షా జనితమైనది.

**2:1:4**

సీ. విరహతాపము నావి వివరింప జాలను
చిక్కితి శల్యమై చింత చేత
రెప్ప పాటును లేదు రేపవళుల యందు
దురితాబ్ధిమునిగితి దుఃఖ మందు
వైకుంఠ విభుడను పడవతో దాటంగ
తత్తళింతును కదా తరలి వేగ
కోకిలమ్మవెతల కూర్మితో నా స్థితిన్
విశదపరచరాదె విభుని చేరి

తే. గీ. గరుడ గమనుడు గంభీర గమనుడతడు
నిరవధక మూర్తి కళ్యాణ నీల వర్ణు
పురుష పుంగవు డాతడు పుణ్యరాశి
ప్రేమ మీరగ రమ్మని పిలువ రాదా. 45

ప్రకృతి శోభను వదిలిపెట్టి పురుషోత్తముని గుణాతిశయా లభివర్ణితాలు. నీల వర్ణుడు. గరుడధ్వజుడు. సంసార సాగరాన్ని ఈ దటానికున్న ప్లవంగమే ఆ వైకుంఠ విభుడు. అతని ప్రేమలో చిక్కి తపిస్తున్న గోద నానాటికి చిక్కి శల్యమై పోయింది. రేపవళ్లు నిద్ర లేక బాధపడుతున్నది. కాబట్టే ''ఓ కోకిలమ్మలారా! నా బాధలను చెప్పి అతనితో నన్ను కూర్చుము'' అని విలపించినది.

''ఎన్ పురుగియిన వేల్‌నెడుం'' అని ప్రారంభం. జీవేశ్వర సమాగమ కాంక్షా జనితమైన పాశురమిది.

**2:1:5**

సీ. కోకిలమా! సొంపు కులుకుల హంసలు
చారులీల విలుపుత్తూరు నమరె
నిత్య నివాసుడు నిఖిల నాయకుని శ్రీ
సౌందర్య మీనెడి చరణ యుగము
కనులార చూడంగ గాఢ వాంఛ కలిగె
చలియించెనొండొంట చక్షియుగము
నిద్దుర కరువాయె నిండార పిలువుమా
విచ్చేయగ మనుమా విశ్వరూపు
తే. గీ. తియ్యతేనియ పాలును తినగ చేసి
ప్రేమ మీరగ పెంచితి పికము! నిన్ను
చిరము నిష్టము నాకును చేసితేని
చెలిమి గావింతు హంసతో చిత్తమలర 46

కోకిల స్వభావాన్ని గుర్తించి గోదాదేవి ఒక ఉపాయన్ని తెలుపుతున్నది. శ్రీ విలుపుత్తూరులో తెల్లని హంసలు నడయాడు చున్నాయట, కోకిలలను సంబోధిస్తూ ''ఆ నగేరంలో నిత్య నివాసుడుగ సౌందర్య మూర్తి విచ్చేసి యున్నాడు. అతని పాదకమలాలను దర్శించవలెనని రెండు కళ్లు తహతహలాడుతున్నాయి. నిద్దుర లేక బాధపడుతున్నాను. ఇన్ని రోజులు నీకు పాలు తేనెలిచ్చి ప్రేమతో పెంచాను, నా అభీష్టాన్ని నీవు నెరవేర్చినట్లైతే, ఆ హంసలతో నీకు స్నేహాన్ని కలిగిస్తాను'' అని ప్రయోజనాన్ని చూపించింది.

''మెన్నడై అన్నమ్'' అని ప్రారంభం. ఉపాయాలలో దానోపాయం ప్రయోగింపబడింది. చక్కని సందేశాలను చేర్పగలిగిన హంస ప్రస్తావనవున్నది. హంసకున్న పరమార్థం లోకవిదితమేకదా.

**2:1:6**

సీ. పువ్వుదోటలలోని పూలచాటున దాగి
హాయిగ నిదురించు నాదమఱచి
తొంగికలయచూచు తొగరు కొకిల విను
సకల దిక్కుల యందు సర్వ సురలు

కీర్తింతు రేనాడు కృష్ణమూర్తి నుతుల
వంచనల్ చేయగా పాడియగునె
అరుణిమలనీను నధరబింబము నావి
కుచకుంభములలోని కులుకుదనము

తే. గీ. నావి ముత్యాల తెల్లని పలువరుసలు
కాంతి సొగసులు వ్యర్థంబు కాక యుండ
చెంతరమ్మని నాథుని చెప్పవమ్మ
ఋణము తీర్చుదు శిరంబు నిచ్చియైన 47

కోయిలతో విన్నపాలు వినిపించుచున్నది. ఆ కోకిల పూల తోటలో చేరి పువ్వుల చాటుననెవ్వరికి కనిపించకుండ నిదురపోతు, మళ్లి అటు ఇటుగ తొంగి చూస్తున్నదట. సర్వాంతర్యామిగ నున్న శ్రీకృష్ణుని దేవతలన్ని దిశల నుండి స్తుతిస్తున్నారు. కాని తన మనస్సు అతని యందు వంచనను శంకిస్తున్నది. ఎఱ్ఱని తన అధరాలు, ముత్యాలపలువరుసలు, ఎదిగిన కుచములు అన్ని అ జగ్నానాథునకే సమర్పితాలు. కాబట్టి అతనితో తనకు సమాగమాన్ని కలిగించినట్లైతే ఆ కోకిల్లకు తన ప్రత్యుపకారంగ శిరస్సునే అర్పిస్తుందట.

''ఎత్తిశైయుమ్ అమరర్'' అని ప్రారంభం. ప్రకృతి వర్ణనతో పాటు, తన విరహ బాధల వలన తపించే అంగముల వర్ణనలున్నాయి. మంచిని కలిగించే వారికి శిరస్సు వంచి పాదా క్రాంతాలౌతారనేది విషయం. శరణాగతిలోని ప్రపత్తినివేదన వివరింపబడింది.

**2:1:7**

సీ. ఉవ్వెత్తు కెరటాల యుదధినీరమునందు
శేషశాయిని చేర చిత్త మలరె
వక్షోజములు పొంగ వలపుచింతలు రేగె
కల్లోల మయ్యెను కలత చేత
నందాల కోయిలా! యచ్చపుగుబురులో
దాగియుండుటనీకు ధర్మమగున
శంఖ చక్రగదాది శార్ఙ్గంబు కరమున
తామయ్యె సొగసుగ తారసిల్ల.

తే. గీ. వెలుగు చుండెడి నా దేవు విష్ణుమూర్తి
నొక్క పరిరమ్మని పిలువు మోాయి పికమ
పుణ్య మగును నీకు సకల పూజలిత్తు
ధర్మమెఱిగి మనుము నీవు దయను కలిగి. 48

ఉవ్వెత్తు కెరటాల సముద్రంలో శేష శాయిగ నున్న ఆ మహా విష్ణువునందు తన మనస్సు తగులుకొన్నది. ఆ నాటి నుండి యౌవనోద్రేకంతో వక్షోజాలు నానాటికి పొంగుతు, అతని కౌగిలిని ఆశిస్తున్నది. కాబట్టి గోదాదేవి గుబుర్లలో దాగివున్న కోకిలను పిలుస్తూ ''ఒక్క సారి ఆ శంఖ చక్ర గదాధరుడైన విష్ణుమూర్తిని నా వైపునకు రమ్మని పలుకు. నీకెంతో పుణ్య ముంటుంది. ధర్మముంటుంది'' అని వేడుకుంటున్నది.

''పొంగియ పాల్కడల్'' అని ప్రారంభం. శ్రీ రంగనాథుని స్వరూప వర్ణనమున్నది. శంఖ చక్ర గదాధరుడైన విష్ణుమూర్తియే ఆమె అర్చాస్వరూపం, ప్రకృతి వర్ణన దీనికి నేపథ్యం.

**2 : 1 : 8**

సీ. తియ్యమామిడి చెట్ల తియ్యని చిగురుల
గోముగ తినుచుండు కోకిలమ్మ
సాహసమ్ముగ చేత శార్జ్గంబు ధరియించి
శత్రుసంహారంబు సలిపినాడు
నాయందు మురి పంబు నయముగ నిలుపుచు
చేసిన ప్రతినలు చెలిమి తోడ
నిరువురకెతెలియు నెవ్వరెఱుగ లేరు
ప్రేమతో వేగమే పిలువరాదా
తే. గీ. కనుల చూచితి నావెత ల్కరుగు నటుల
నెదుట నిలుపుమా నా స్వామి యిరవు లెఱిగి
అటుల పిలువక యున్నచో నాగ లేక
యతని దండించు విధముల నరయగలవు. 49

తన పని తాను చూచుకుంటున్నాయి. కోకిలలు. హాయిగ తియ్యమామడి చెట్ల చిగుళ్లను తింటూ తిరుగుతున్నాయి. ఆ విష్ణుమూర్తి చేతిలో విల్లును చాల సులభంగ వంచి శత్రువుల్ని సంహరిస్తున్నాడు. ఒక నాడు తన్ను కలిసిన వేళ ఎంతో మురిపంతో చేతిలో చెయి పెట్టి ప్రమాణాలు చేసాడు. ఆ విషయం మితరుల కెవ్వరికి తెలియదు. అట్టి మహిమోన్నతుని నేడు కోకిలలు పిలిచి రమ్మని చెప్పకపోయినట్లైతే అతడు కనిపించిన నాడు తానే అతనిని ఎన్ని పాట్లు పడనిస్తుందో ఆ కోకిలలే తెలిసికొంటాయట.

'శార్ంగమ్ వళైయ' అని ప్రారంభం. చిత్త వృత్తి జనితాలైన భావాలన్నీ భగదర్పితమయ్యే మధురభక్తికి సంకేతమీ పాశురం.

**2:1:9**

సీ. తుమ్మెద రావంబు తుందిలంబుగ మ్రోగ
సుందర వనములో సందడించు
కోయిలా చెవియొగ్గి గుర్తుగ వినవమ్మ
రామ చిలుకలోని రమ్య వర్ణు
మనసార నమ్మితి మాటల నావెల్ల
నింపుగా నా స్వామి కెఱుక చేయు
వనమున నివసింప వాంఛయున్నచొ నీవు
శంఖ చక్రధరుతో సంధి కలుగ
తే. గీ. యత్న మొందు చేయుము కాక యాదరించి
నాదు కంకణంబైనను నాథుకిమ్మ
ఏది యొకటైన చేయుచు నింపుతోడ
తెలియ పరచుము నాదైన దీన దశను 50

తోటలో తుమ్మెద రావము మారు మ్రోగుతున్నది. వాటితో పాటు కోయిలలు తిరుగుతున్నాయి. రామ చిలుకవలె పచ్చని మేని ఛాయ కలిగిన వాడు, శంఖ చక్రముల ధరించినవాడు విష్ణుమూర్తి, అతడే తన నాయకుడు. కోయిలలను సంబోధిస్తు గోద పలుకుతున్నది ''కోయిలలారా! జాగ్రత్తగ వినండి. నేను సంచరించి యానందించే ఈ ఆమనిలో మీరు నివాసం

చేయాలంటే ఒక నిబంధనం. ఒకటి నా నాథుడు ఆ కృష్ణునితో నన్ను చేర్పండి. లేదంటే నా కంకణాన్ని అతనికిచ్చి నాదైన్య స్థితిని తెలియచేయండి'' అని అర్థిస్తున్నది.

'పైంగిళి వణ్ణన్' అనేది ప్రారంభం.

తుమ్మెద రావము, పికముల కూజితాలు పరతత్త్వ సూచకాలు.

**2:1:10**

సీ. శైశవ దశ నుండి స్వామిని తలచితి
పాలించు జగముల పాద యుగళి
నోరార పలు రీతి నుతియించి మనమున
చేసితి నోముల సేవలెన్నొ
మనసు కరుగ లేదు మన్మథ గురునకు
మోసగించితినేమొ ముద్దు కృష్ణ
చంద్రుడు తెమ్మెర సాధించి హింసించు
తెఱగెల్ల నెఱుగవే తేటగానె

తే. గీ. నన్ను నీవిటు బాధింప న్యాయ మగునె
నేడె తరలి రమ్మను కృష్ణునిత్య శుభము
కలుగు నటుల చేయుదునుగా కలత మాని
లేని చో నీవు కోకిలా లేచి పోవె. 51

తన మనస్సులో నున్న అనుభూతులన్నింటిని కోయిలలతో చెప్పుకుంటున్నది. చిన్నప్పటి నుండి నేను ఆ జగన్నాథుని పాదాలను సేవిస్తున్నాను. అతనిని పొందటానికెన్నో నోములాచరించాను. కాని అతని మనస్సు కరుగ లేదు. ఒకచో మురిపాలతో నున్నప్పుడు నేనతనిని మోసగించానేమో, అందువల్లనే నేడు చంద్రుడు, తెమ్మెర ఇవన్ని నన్ను బాధపెట్టున్నాయి. ఈ సమయంలో కోయిలా నీవును నన్ను ఏడిపించవచ్చా? అతనితో నేను చేరే మార్గాలు చెప్పు. అట్లు లేనిచో నీవు తక్షణమే ఈ తోటను వదిలిపెట్టి వెళ్లిపో'' అని కోయిల మీద కూడ అలిగింది ఆమె.

''అన్నులగమ్ అళందానై'' అని ప్రారంభం. పాదాలపై పడి శరణు వేడటం ప్రధానాంశం. విరహ తాపంలో ప్రకృతిలోని సౌందర్యాలన్నీ దుఃఖ హేతువులే అనే కావ్యాంశం వివరింపబడింది.

**2:1:11**

సీ. వైకుంఠ పథమున వాసంబు కలిగించు
నడుగుదో యివలన నవని కొలిచె
శూలంబు తొనెనయు చూడ్కుల నీభామ
నీపైన ప్రేముడి నింపి కాదె
పిలిచెను నల్లని పికముల చూచుచు
కోయిలా నాస్వామి కొమరు మీర
నీల సంద్రము భంగి నిండైన ఛాయల
మేని సొగసువాని మేల మాడి
తే. గీ. నాకు కూర్పుమంచుపదముల్నయ మొప్ప
వివిధ సుస్వర రావంపు వేదములతొ
వరలు చుండెడి విల్లిపుత్తూరు నందు
పరగు విష్ణుచిత్తుడనెడి పండితునకు
తే. గీ. గోద యలనాడు మురిపాల కూతు రచన
రక్తి మేరగ పాటల భక్తి నెవరు
నభ్యసింతురొ వారికి నష్ట వర్ణ
ముల జపించు ఫలములును కలుగు కాదె. 52

సుదీర్ఘంగ ఫలశ్రుతి చెప్పిన పాశురం. పరమపదాన్ని కలిగించే అడుగులతో భూమిని కొలిచిన విష్ణుమూర్తి నీల సముద్రం వలె శరీర ఛాయ కలిగి జగన్మోహనాకారుడై యందరిని వశపరచుకున్నాడు. అతని శరీర ఛాయ వంటి రంగు కలిగిన కోయిలను పిలచి తనతో తన విభుని చేర్పమని ప్రాధేయ పడుతు పాడిన ఈ పాశురాలు గానంతోను, వేదసుస్వర నినాదంతోను నిండిన విల్లిపుత్తూరులో విద్వాంసుడుగ వెలసిన వైష్ణవాచార్యుడగు విష్ణుచిత్తుని మురిపాల గోదా దేవి పాటల నెవరు పాడినను వారికి 'నమో నారాణాయ' అనే అష్టాక్షరి జపించిన ఫలితం లభిస్తుందట.

'విణ్ణాణ నీణ్డడి' అని ప్రారంభం.

ప్రణయగీతాలతో చరమ ఫలంగాను తత్త్వార్థ ప్రదంగాను అష్టాక్షరి మంత్ర జపం బోధింపబడింది. పదవ పాశురంలో నారాయణ నామం ప్రస్తావింపబడింది. తెలుగులో ఫలశ్రుతి పాశురంలో వైకుంఠ పదవిని కలిగించే పాద యుగళమని చెప్పబడింది.

## స్వప్నము (వారణ సహస్రం)

**2:2:1**

సీ. కలగంటి కలగంటి కలికిరో వినరమ్మ
వారణ సాహస్ర పరిధిలోన
వనమాలి నడతెంచె వరదుడై శోభిల్ల
వేవేలు గజపరి వేష్టనమున
ప్రతి గేహ శోభ ప్రాంగణ సీమలో
వరహేమ కుంభము ల్వరుస నమరె
ద్వార బంధము లెల్ల తోరపు సొగసుతో
తోరణ సరములు తూగు చుండె

ఆ.వె. శార్ఙ్గపాయి కివిగొ స్వాగతంబనుభంగి
పురము దీప్తితోడ పులకరించె
కలగ నిలిచె నేడు కలికిరో వినరమ్మ
విభుని చేర మనము వెతల నిండె 53

శ్రీ మన్నారాయణుడు తన్ను వివాహం చేసుకున్నట్లు కలకన్నది గోదా దేవి. తన సఖుల నందరిని పిలిచి స్వప్న వృత్తాంతాన్ని వివరించి చెప్తున్నది.

''సఖులారా! నేను కమ్మగ ఒక కలకన్నాను. ఆ వనమాలి వేయి ఏనుగులు తన్ను చుట్టు కొని వుండగ వీధిలో ఊరేగింపు వస్తున్నాడు. వేయి ఏనుగుల మధ్యలోనున్నాడు. ప్రతి గృహపు ముంగిట్లో బంగారు కలశాల నమర్చి అతని రాకను నాహ్వానిస్తున్నారు. ఇంటింటి గుమ్మాలకు తోరణాలు

వేలాడుతున్నాయి. పురమంత నిత్య శోభతో వెలుగొందుతున్నట్లు కలకన్నాను'' అని తన స్వప్నంలో మొదటి అంశమైన వరుని ఊరేగింపు వర్ణింపబడింది. ఆ నాటి సాంఘిక సన్నివేశాలిందు ప్రతిఫలిస్తున్నాయి.

''వారణమాయిరమ్'' అని మొదలు పెట్టే ఈ పాశురం నుండి ఈ సన్నివేశంలో నున్న పాటలన్ని కూడ మిక్కిలి ప్రసిద్ధంగ నేటికి కళ్యాణోత్సవాలలో పాడుకుంటారు. కళ్యాణి రాగం రూపకతాళంలో పాడుకోవచ్చు.

పంచేంద్రియాలకు రూపకల్పనగనున్న గజం, అష్టాక్షరీ జపం వలన పురుషోత్తముని యందు కేంద్రీకృతమై అక్కడే పరివేష్టింపబడుతున్నదదేది పరమార్థకథనం.

**2:2:2**

తే. గీ. హరికిదెపరిణ యోత్సవ మనుచు తెల్పు
పోక మ్రాకుల నీనెల పొదరు తోడి
మంట పములను నెత్తిరి మాధవునకు
సొగసు లీనెడి నాస్వామి శోభ మీర

తే. గీ. మహిష గాంభీర్య మన్మథ మహిమదీప్తి
నిశ్చితార్థంబు చేసెడి నియతి వోలె
వరుడు లోనికి నడయాడి వచ్చినటుల
కలను గంటిని వినవమ్మ కలికి నేడు 54

పరిణయోత్స వానికి పూర్వం నిశ్చితార్థం చేసే సంప్రదాయమిందులో వర్ణింపబడింది. శ్రీకృష్ణుని ఆహ్వానించటానికన్ని యేర్పాట్లు చేయబడ్డాయి. వరుడు లోపలికి వస్తున్నప్పుడు పోక చెట్ల బోదెలతోను ఆకులతోను మంటపం సిద్ధంగ నున్నది. మహిషంవలె గమన గాంభీర్యాన్ని కలిగి ఆ గరుడ వాహనుడు నిశ్చితార్థం చేయటానికి వస్తున్నట్లు గోద కలనుకన్నది.

''నాళై వదువై మణ మెన్ఱు'' అనేది ప్రారంభం. సాంఘిక సంప్రదాయానికి విలువనిచ్చి పాడుకునే పాటయిది. కావ్య పరంగ కన్నులకు రూపం కట్టే చక్కని వర్ణన వున్నది.

**2:2:3**

తే. గీ. దేవ విభునితో దేవతల్ దివ్యగణము
చేరి పెండ్లిచూపులనన్ను కోరి చూడ
నేగు దెంచుచు లాంఛనాల్తగిన రీతి
మాట మంతు లెల్ల సలిపి మమత మీర

తే. గీ. గౌరి తనకు తానుగ వచ్చి ఘనత తోడ
పెండ్లి మాలల కూర్చుచు ప్రీతి గానె
నాకు దేవిచే చీరను కట్టి నడిచి నటుల
కలను గంటిని యమ్మరో కలికి నేడు 55

దేవేంద్రునితోపాటు దేవగణమంతా గోదా దేవిని పెండ్లి చూపులు చూడటానికి విచ్చేశారట. వధూవరుల కీయవలసిన వస్తులాంఛనాదుల గురించి ప్రస్తావించారట. పిదప శ్రీకృష్ణుని సోదరి గౌరీ దేవి ఆడ బిడ్డగ తన చీరను తెచ్చి గోదాదేవికి తానే స్వయంగ కట్టినట్లు కలకన్నది. ఆ వధువుకు పెండ్లి మాలలను వేసినదట జగదేక మాత గౌరి. గోదకిది స్వప్న వృత్తాంతము.

''ఇందిరన్ ఉళ్లిట్ట దేవర్'' అని ప్రారంభం. నిశ్చయతాంబూల మప్పుడు ఆడ పడచు వధువునకు చీర, నగలు, పువ్వులు మొదలైనవి యివ్వటమనే సంప్రదాయం ద్యోతక మౌతున్నది.

జీవేశ్వర సమాగమానికి సకల విధాలైన ప్రయత్నాలు జరుపబడు తున్నాయనటం పాశురాలలోని భావగాంభీర్యం కావచ్చు.

**2:2:4**

తే. గీ. శిష్ట బ్రాహ్మణ బృందంబు సేవ తీర
నాల్గు దిక్కుల ప్రవహించు నాకజలము
మంత్ర పూతము చేయుచు మాకు చల్లి
వేద నినదంబు చేయుచు వీనులలర

తే. గీ. పుష్ప మాలికల్ సొంపార పుణ్య విధుల
నాకు స్వామికి పరిణయ న్యాయ మలర
సూత్ర బంధంబు గావించు సొబగులనగ
కలను గంటిని కలికిరో కమ్మగాను 56

వధూ వరులకు కంకణాలు కట్టే విధి వర్ణింపబడింది. బ్రాహ్మణ శ్రేష్ఠులు, గంగానదీ జలాలను కలశాలలో నింపి, మంత్ర సహితంగ వేదాలను చదువుతు వధూవరులపై చల్లి పుష్ప మాలికలతో నిరువురి చేతులకు కంకణాలు కట్టినట్లు కల కన్నది గోదమ్మ. తనకు, తన నాథునకు వైవాహికోత్సవానికి పూర్వ రంగం జరిగిందన్న మాట.

''నాల్దిశైతీర్థం కొణర్న్దు'' అని ప్రారంభం. వేదంలోని స్వర భేదాల శ్రుతిలయాత్మక శబ్ద తరంగాల మధ్య, బీజమంత్రాక్షరాల అర్థోచ్చారణలతోచేరి సహజ శోభయమానంగ జీవత పరమార్థాన్ని తెలిపే పుష్ప మాలికలతో ప్రకృతి పురుషులు బంధింపబడుతున్నా రనటం అర్థస్ఫోరక రచన అవుతున్నది.

**2:2:5**

సీ. లావణ్య వతులెల్ల లాస్యముగ నిలిచి
దినకర కాంతుల దివ్వియలను
కలశ కుంభములందు ఘన రీతి నిలుపుచు
చేతమోయుచు నిండు సేవ దీరి
పందిరి ముంగిట వరునకు నాహ్వాన
మొనరింప వేంచేసి రొప్పిద ముగ
మధురాధి నాథుని మంగళ పాదుకల్
వేదిక నడచిన విలసనములు
ఆ.వె. నాల్గు దిశల యందు నయముగ నినదించు
శుభద మగుచు లోన చొచ్చినటుల
మారు మ్రోగు చుండె మంగళ రవళులు
ననగ కలను కంటి యతిన నేడు 57

వివాహ పందిరి కిరువైపుల లావణ్య విలాసవతులు చేతిలో దీపాలమర్చిన కలశాలతో నిలిచివున్నారు. ఆ దివాకరుని తేజఃపుంజమే దీపకళికలుగ వెలుగొందుతున్నాయట. వరుని ఆహ్వానిస్తు నిలిచివున్నారు. ఆ మధురాధి నాథుడు పాదుకలను ధరించి వస్తున్నప్పుటి ఆశబ్దము నాలుగు వైపుల మారుమ్రోగుతున్నాయి. ఈ సన్నివేశమంతా ఆమె స్వప్న కథనమే.

''కదిరొళి దీపం కలశముడన్'' అని ప్రారంభం. వివాహమహోత్సవానికి కర్మసాక్షి దీపకళకగ విచ్చేసి వున్నాడు. నడచి వస్తున్నప్పుడు పాదుకలయందలి శబ్దాన్ని మాత్రమే గమనిస్తున్నది పెండ్లి కూతురు. పాదపంకజాలు మాత్రమే భక్తునికాశ్రయాలు.

- వరుని ఆహ్వానించటానికి యువతులు కుండల్లో దీపాలను వెలిగించు కొని యిరువైపుల బారులుతీరి నిలబడటమనే సంప్రదాయమభివర్ణితం.

**2:2:6**

సీ. మద్దెల రావంబు మారుమ్రోగుచునుండ
చారల శంఖంపు శబ్దములును
విడువక యొండొంట వీనుల నలరగా
కల్యాణ గుణుడు నా కాంతుడమ్మ
మధురిపు మాన్యుండు మాధవ కృష్ణుండు
ముత్యాల జాలరుల్ ముందుకదల
పెండ్లిపందిరిలోన పేర్మిశోభల తేరి
సౌందర్య రాశిగ శాంతమలర
తే. గీ. మెల్ల మెల్లన నడతెంచి మేల్మి యెసగ
పెండ్లి పీటల మీదను పేర్మితోడ
నయము తీరుగ కూర్చుండి నన్ను పాణి
గ్రహణ మొనరించి నటులనే కలను గంటి 58

పాణిగ్రహణమహోత్సవం జరిగినదట. మద్దెల శబ్దాలు, శంఖపు రావాలు ఎడతెగకుండ మ్రోగుతుండగ మధుసూదనుడు ఆ కృష్ణుడు ఆహ్వానాలనన్నింటిని స్వీకరించుకుంటు ముత్యాల జాలరులు పందిట్లో తోరణాలుగ నూగుతుండగ మెల్లమెల్లగ పెండ్లిపీట మీదికి సౌందర్య మూర్తిగ వచ్చి కూర్చొని, గోదా దేవి చేతిని తన చేతిలోకి పాణిగ్రహణం చేసికున్నట్లుగ ఆమెకలగన్నది.

''మద్దళం కొట్ట వరిసంగమ్'' అని మొదలు పెట్టే ఈ పాశురం చాల ప్రసిద్ధికెక్కినది, ఇందులో చక్కని వివాహ సంప్రదాయం వర్ణింపబడింది. సౌందర్యమనేది ప్రకృతిలోని ప్రధాన విషయం.

**2:2:7**

సీ. స్పష్టమై పఠియించు చక్కని వాక్శుద్ధి
సద్గుణ వైదికుల్ సన్నుతింప
వైవాహిక సమయ వరసిద్ధి మంత్రముల్
పఠియించు చుండిరి భద్ర లీల
వైదిక పదముల వనమాలి వల్లించి
పూజలు గావించె పుణ్య విధుల
హోమకుండ మమర్చి యొక్కొక దిశకునై
సమిధల నియతితో సంవదించి

తే. గీ. మదపుటేమగు మాడ్కితా మదన గురుడు
సప్తపదులతో కుండంపు సరళి చుట్టి
నాదు పాణిని గ్రహియించి నడిచినటుల
కలను గంటిని కలికిరో కమ్మగాను 59

పాణిగ్రహణానంతరం, హోమకుండాన్ని సిద్ధం చేసి నాలుగు వైపుల సమిధల నమర్చి వాక్శుద్ధితో వేదమంత్రాలను వైదికులు పఠిస్తుండగ, వివాహ కాలపు మంత్రాలను చదువుతున్నప్పుడు, వరుడు కూడ ఆ మంత్రాలను వల్లిస్తు అగ్నిసాక్షిగ ఆమె చేతులను పట్టుకొని హోమకుండాన్ని సప్తపదులతో ప్రదక్షిణ చేసినట్లు, కల వచ్చిందట కోమలి గోదా దేవికి.

''వాయ్ నల్లార్ నల్ల'' అని ప్రారంభం.

వివాహతంతులో సప్తపది వర్ణింపబడింది. పురుషుననుసరించి ప్రకృతి నేమి తిరుగుతున్నదనటం తాత్పర్యం.

**2:2:8**

సీ. ఈ జన్మకే కాక యేడేడు జన్మల
కేడుగ డయవాడె యెంచి చూడ
మనకెల్ల నాతడె మాధవ కృష్ణుండు
స్వామియై రక్షించు శార్ఙ్గ ధరుడు

క్షీర సాగర వాసి నారాణుండు తా
బ్రోచు చుండును భక్త పూజ్యుడతడు
కెంజాయ మంజుల కేల నా పదముల
చక్కగ చేర్చుచు సన్నికల్లు
ఆ.వె. మీద నునుప నేను మెల్లన పెట్టిన
భావ మొందు కలిగె భవ్య రీతి
పెండ్లి తంతు లెల్ల పేర్మిగ నడయాడ
కలను గంటి కలికి కమ్మ గానె 60

సప్త పదుల అనంతరం, వధువు పాదాలను పట్టి సన్నికల్లు రాయిపై పెట్టడం వివాహతంతులో నొకటి. ఏడడుగులు నడిపించటం మాత్రమే కాదు ఏడేడు జన్మల కధినాథుడా నారాయణుడే. ఎఱ్ఱని రంగు కలిగిన చేతులతో తన పాదాలను మృదువుగ చేర్చిపట్టి సన్నికల్లురాయిపై మోపిన అనుభూతి ఆమెకు కలిగినట్లు కలకన్నదట.

''ఇమ్మైమ్కుమ్ ఏళేళ్'' అని ప్రారంభం. వివాహ వ్యవస్థలోని సంప్రదాయాలన్నీ ఒక్కొక్కటిగ వర్ణింపబడింది.

జీవులకు మాత్రమే జనన మరణాదులతో నిండిన జన్మలు. వాటిని కలిగించే వాడా సర్వేశ్వరుడగు శ్రీమన్నారాయణుడే.

**2:2:9**

సీ. సౌందర్య భ్రూలత సౌభాగ్య రేఖల
సోదర బృందంబు సొంపు మీర
ననుపరి వేష్టించి నయముగ నిలుచుండి
యగ్నిని రగిలించు యత్నమందు
నెదురుగ నన్నును నింపుతో నిలబెట్టి
చెలిమితో నరహరి చేయి మీద
నాదుహస్తంబుల ననుపుగా చేర్చుచు
లాజహోమములిచ్చెలలితముగను

తే. గీ. ఒక్కొటొక్కటి వదలక యోర్పుతోడ
జరిగినటులగ చెలిమితో సఖుని చేరి
కలను కంటిని కలికిరో కమ్మ గాను
స్వప్న మది కాదు నమ్ముడు సత్యమమ్మ 61

హోమము వేలార్చిన యనంతరము వధువునకు తోబుట్టువులైన అన్నదమ్ములు, పెండ్లి కుమారుడు కుమార్తె చేత హోమాగ్నిని ప్రజ్వలింపచేసేరీతిగ వడ్ల బొరుగుల్ని అందులో వారివురి చేతులను చేర్చి పట్టుకొనే విధంగ వేలార్చుతారు. ఇది పెండ్లిలో జరిగే మరొక సంప్రదాయం. దీన్నే లాజహోమం అంటారు. ఆ విధంగ నొక్కదాన్ని కూడ వదిలిపెట్టకుండ వరుసక్రమంగ సన్నివేశాలనన్నింటిని స్వప్నలో చూచి అనుభవించింది ఆండాళ్.

''వరిసిలైవాళ్ముగత్తు'' అనేది ప్రారంభం. సాంఘిక సంప్రదాయాల భివర్ణితాలు. అగ్నిసాక్షిగ వివాహమహోత్సవం జరిగింది.

**2:2:10**

సీ. కుంకుమద్రవముల గోముగ కలుపుచు
చల్లని గంధంపు చలువ తోడ
మేనెల్ల నలదిరి మేలిమి జిగి వెలుగ
సౌభాగ్య శృంగార సరళి మాకు
పురవీధు లెల్లను పుణ్య రీతినమరె
సకల ప్రదక్షణ శాంతి చేయ
భద్రగజ మారూఢ భవ్యగుణాచ్యుతు
సహితయై నేనును సాగివచ్చి
తే. గీ. పసుపు నీటను జలకంబు పరగుననుచు
విభుని లీలల మేనును విస్మరించు
నటుల వాసంత కేళుల నాడి యాడి
యలసి నట్లుగా స్వప్నంబులమరె నమ్మ 62

వధూవరులను చక్కగ నలంకరించి కుంకుమ చందనాది ద్రవ్యాలతో శరీరాలను రంగరించి భద్ర గజంపై ఊరేగింపును కావించారు. పురవీధులెల్ల వీరి ఊరేగింపుకై అలంకరింప బడ్డాయి. ప్రదక్షిణ పూర్వకంగ సర్వశాంతులు చేసిన అనంతరం, పెండ్లియింటిలో పసుపు నీటిని సిద్ధం చేయగ విరువురు వసం తాలాటలో తన్మయత్వాన్ని చెందినుట్లగ గోదమ్మ కల కన్నది.

''కుంకుమమ్ అప్పికుళిర్ చాందమ్'' అని ప్రారంభం. అగ్నిస్సాక్షిగ వివాహం జరిగిన అనంతరం అప్పును నాశ్రయించారు తమ సమైక్యత కొఱకు. సాంఘిక సంప్రదాయానికి చక్కని వివరణ మున్నది.

**2:2:11**

సీ. వైష్ణవ భక్తుల వాసికెక్కిన సీమ
 శ్రీ విల్లిపుత్తూరు సిరుల నెలవు
విష్ణుచిత్తుండను విఖ్యాత పురుషుని
 గోదమ్మ వెలసెను కూతుగాగ
యాదవ దేవుని నర్ధాంగి నయ్యెనా
 ననుభూతి పొందిన యర్ధ విధుల
స్వప్నంపు వృత్తంబు సద్విమల కథలు
 పాశురమ్ముతమిళ భాషయందు

తే. గీ. పదియు రచియించె గోదమ్మ భక్తి మీర
నెవరు పాడిన వారికి నింపుతోడ
భాగ్య సంపద సంతాన భవ్య మొసగు
సకల మహిమల సుగుణముల్ సతత మమరు 63

స్వప్న వృతాంత పాశురాలాకు ఫలశ్రుతి యిది. శ్రీ విల్లిపుత్తూరు వైష్ణవులకు నివాసయోగ్యమైనది. అందు విష్ణుచిత్తుడనే పరమపురుషునకు గోదా దేవి కూతురైనది. ఆమె శ్రీ కృష్ణుని తాను వివాహం చేసుకున్నట్లుగ కలకన్నది, ఆ స్వప్న వృత్తాంత కథనమే ఈ పది పాశురాలు. దీనిని భక్తి శ్రద్ధలతో పాడిన వారికి సద్గుణాలతో పాటు సంతాన భాగ్యం కలుగుతాయట.

''ఆయణుక్కాకత్తాన్'' అని ప్రారంభం. వివాహానికి పరిణామం సంతాన ప్రాప్తియే కదా! లౌకిక వృత్తిగ ఈ పాటలకు చివర మంగళ హారతిగ ఫలశ్రుతి పాడి ముత్తైదువులు వధూవరులను దీవిస్తారు.

స్వప్నంలో పొందే అనుభూతి జాగృత స్థితిలో మటుమాయ మౌతుంది. ఆ విధంగానే లౌకిక విషయ వాంఛలు, సంప్రదాయాను భూతులు, మమకార వాత్సల్యాలు, మొదలైన శారీరక జన్యాలైన సర్వస్వం స్వప్నమే. ప్రపంచం యావత్తు స్వప్న జగత్తే. కల నుండి మేలుకున్న తరువాతనే, అప్పటి వరకు మనం నిద్రపోతున్నామనే జ్ఞానం కలుగుతుంది. అందుకే ఆండాళ్ తన వివాహమహోత్సవాన్ని స్వప్నంగ వర్ణించింది.

ఈ పది పాటలలోను సాంఘికాచారాలే ప్రధానమై వున్నాయి. స్వప్న వృత్తాంతమనటం మాత్రమే తత్త్వార్థ స్ఫురణ కలిగింది.

## కర్పూర పరిమళము

**2:3:1**

సీ. కర్పూర రాశులా కమలంపు సుమములా
పరిమళం బెయ్యది వరుస లందు
శృంగార ధావళ్య శ్రీపాంచ జన్యమా
గమనింప రెంటిలో ఘనత కేది
కిరణాల శంఖమా కెమ్మోవి కెలకున
రెంటి మేళన మొందె జంటగాగ
పగడంపు నధరాల భాగ్య సన్నిధిలోనె
నెలకొన్న శంఖమా నీకె తెలుసు

తే. గీ. కువల యా పీడన మొనర్చె గోప బాలు
నధర సుధలును నాకును నందు నటుల
ననుభ వింపగ నాయందు నాశ కలిగె
పాంచ జన్యమా యుచితమౌ ఫలితమిమ్ము 64

శ్రీ విష్ణుమూర్తి చేతిలో ధరించిన పాంచజన్యమనే శంఖాన్ని పిలిచి గోదాదేవి తన ఆర్తితో కూడిన విలాపాలను అందిస్తున్నది. పాంచజన్య

శంఖము శ్రీ కృష్ణుని విశ్వరూపంలో, సంధి సమరాలలో అధరాల నాశ్రయించి వుంటుంది. శంఖాన్ని పూరించి కార్యోన్ముఖుడౌతుంటాడు. అ అధరాలనది ఆశ్రయించి వుండటం చేత దానిని సంబోధిస్తు గోదాదేవి ఈ విధంగ పలుకుతున్నది. ''ఓ పాంచజన్యమా! నీవు శ్రీ కృష్ణుని అధరాల నాశ్రయించి వున్నావు. ఆ అధరాలు కర్పూర పరిమళాన్ని కలిగినవా, లేదా కమల పుష్పాలవలె సువాసన భరితాలా? లేదా ఈ రెంటి కలియకతో కమ్మని వాసనలను వెదజల్లుతున్నాయా? నాకును ఆ అధర సుధలననుభవించాలని కోరికగ నున్నది. అట్టి భాగ్యాన్ని నాకు ప్రసాదించు'' అని అడుగుతున్నది ఆండాళ్.

''కర్పూరం నాఱుమో, కమలప్పునాఱుమో'' అని ప్రారంభించే పాశురం. చాల ప్రసిద్ధికెక్కినది. వీటిని వరాళిరాగంలో రూపక తాళంతో పాడుతుంటారట.

శరణాగతిని పొందిన భక్తుడు, సాలోక్య స్థితిని పొంది, సామీప్యాన్ని పొంది పిదప సారూప్య దశ కొఱకు పరితపిస్తాడు. శ్రీ విష్ణుమూర్తిలో నున్న సాధన సామగ్రులను తిలకించి, వాటికున్న సౌఖ్య స్థితి తమకు లేదని వాపోవుతుంటారు. అట్టి స్థితిని భక్తురాలు అందుకోటానికిది ప్రథమ సోపానం. శంఖం వాయు పీడనం చేత ప్రకృతిలో నున్న శబ్దతరంగాలను నా విష్కృత చేసే సాధన.

**2:3:2**

సీ. సద్గుణ రూపమౌ శంఖమా యలనాడు
జనన మందితివిగా సంద్రమందు
పాంచజనుడనెడి పగతుని రూపులో
దాగియుంటివి కాదె దైత్యుగాగ
దుష్టుల దరిదాపు దూరంబు కావించు
పరమాత్మ హస్తంపు ప్రాపు కలిగె
నసురగణములెల్ల నారాట మొందగ
గంభీర నివదంబు కలుగ చేసి

తే. గీ. దుష్ట సంహార మూర్తికి తోడ నిలిచి
శిష్ట రక్షణ పాలుని చేతి యందు
సతత శుభముల కలిగించి జనుల బ్రోచు
పాంచ జన్యమా నీకును భద్ర మగును 65

గోదా దేవి పాంచజన్య శంఖాన్ని స్తుతిస్తున్నది. ఆ శంఖం సముద్రంలో పుట్టి పంచజనుడనే రాక్షసుని శరీరంలో దూరి, దుష్ట సంహారం చేసే విష్ణుమూర్తి చేతిని ఆశ్రయించింది. విష్ణుమూర్తికి తోడుగ అసురులను తన నినాదంతో భయపెట్టూ వారిని సంహరించటానికి సహాయపడుతున్నది. సజ్జనులను రక్షించే ఆ పరమాత్ముని చేతిలో నున్నది. అట్టి పాంచజన్యానికెల్ల వేళల శుభము కలుగు గాక అని ప్రార్థిస్తున్నది.

''కడలిల్ పిఱందు కరుదాదు'' అనేది ప్రారంభం. సజ్జన సాంగత్య ముంటే సారూప్య స్థితి సులభ ప్రాప్తమని వాటి స్నేహాన్ని ఆశ్రయిస్తున్నది ఆండాళ్. అర్చామూర్తిలో ప్రత్యేకించి ఆయుధాలకు పూజ చేయటం ఆగమ సంప్రదాయం.

**2:3:3**

సీ. సౌందర్య సాకార శంఖమా నీవును
శారద రాత్రుల శశియు వోలె
తోతెంచి పూర్ణేందు తోరంపు కిరణాల
నుద యాద్రి చేరెడి యొప్పు నాగ
మథురాధి నాథుని మన్మథజనకుని
వాసుదేవుని హరివరదుడతని
శ్రీకర శోభన శృంగార కరముల
పాంచజన్యమ నీకు ప్రాపు కలిగె

తే. గీ. నిత్య వాసము లభియించె నెనరుగాగ
ఫలము కాదొకొ పుణ్యంపు పరమపదము
స్థిర నివాసము నీకదె సిరుల నెలవు
కలిమి వసియించు భాగ్యమ్ము కలిగె నీకు 66

''శరత్కాలంలో నల్లని కొండలో నుదయించే పూర్ణ చంద్రుని వలె, శ్రీకృష్ణుని చేతిలో ఓ శంఖమా నీవు తోతెంచావు. నీది నిత్య శుభద నివాసమది. సకల సౌభాగ్య సంపద కలిగిన నెలవు నీకు లభించిది కదా''.

''తడవర్రైయిన్ మీదే శరత్కాల చందిరన్'' అని ప్రారంభం.

శరత్కాల చంద్రుడు సర్వుల కానంద ప్రదుడు. చంద్రుడు, శరత్కాలము, కాల ప్రకృతిక చెందినది. దీని నియామకుడు శ్రీమన్నారాయణు డనుట సూచితము.

**2:3:4**

సీ. వామరేకల తేరు పాంచజన్యమ! నీవు
శ్రీహరి కరమున చేరితి కదె!
పూర్ణచంద్రుని శోభ పూర్ణమై పరివేష
విచ్ఛేద రహితమౌ వెలుగు రీతి
నతిరహస్యముగాగ నచ్యుతు శ్రీకర్ణ
సామీప్య మున చేరి సాదరముగ
మంత్ర గూఢము లేవొ మహిమతో పలుకుచు
సల్లాపముల నెన్నొ సలిపినటుల
తే. గీ. మదిని మధురమౌభావంబు మసలు చుండ
సురవిభుడు కాడు తుల్యుండు శోభ నీకు
నీవు భాగ్యంపు సాటికి నీవె గాక
యమర చేయుము సౌభాగ్యమదియునాకు 67

శ్రీ విష్ణువు చేతిలో వెలుగుతున్న శంఖంతో సంభాషించుచున్నది గోదా దేవి ''వామ రేకలను కలిగిన ఓ శుభ ప్రదమగు శంఖమా! పూర్ణ చంద్రుని పరివేషం వలె నీవు విచ్ఛేదం కాని పరిపూర్ణమైన వెలుగు రేఖలతో ఆ పురుషోత్తముని హస్తాన్ని అలంకరించి వున్నావు. నీ భాగ్య సంపదను నేనేమని ప్రస్తుతించగలను? దేవేంద్రుడు కూడ నీకు సాటి కాలేదు. ఆ శుభప్రద మగు మహా విష్ణువు కర్ణాన్ని ఆశ్రయించి యేవో రహస్యాలు మాట్లాడుతున్నావు. నాకును నట్టి అదృష్టాన్ని కలిగించు''.

''చందిర మండలం పోల్'' అని ప్రారంభం. సారూప్య సిద్ధికై ఆయుధాలతో ప్రలాపిస్తున్నది. చిత్సరూపంలో కాలప్రకృతికి సంబంధించినది.

**2:3:5**

సీ. ఓ శంఖ రాజమా! యొక్కటై కడలిలో
జనన మొందెను జల చరము లెన్నొ
జీవించె ప్రాణులు చేతనా రూపమై
రూప రేఖలు వాని రూఢిగాగ
సారంపు గుణములు సహజ రీతులు నేవి
గుర్తింప జాలరు కూడి జనులు
వారెట్టి విఖ్యాతి వాసిగాంచగ లేదు
నీకు మాత్రమెకల్గె నిఖిల యశము
తే. గీ. సర్వ నాథుడు సర్వేశు శంఖ ధరుని
నధర సుధ గ్రోలు భాగ్యంబు నమరె నీకు
సతత వాసము నీదెగా సన్నిహితము
కలుగ చేయుము నాకట్టి కలిమి నెల్ల 68

పాంచజన్యానికున్న ప్రాశస్త్యాల్ని ప్రస్తుతిస్తున్నది గోదాదేవి. సముద్రంలో శంఖంతో పాటు ఏన్నో జల చరాలుద్భవించాయి. వాటి వాటి స్వభావగుణాలతోనని తిరుగాడుతున్నా ప్రజలెవ్వరు వాటిని గుర్తించటం లేదు. వాటికి కీర్తి లేదు. కాని పాంచజన్య శంఖానికి మాత్రమే భాగ్యం లభించింది. శ్రీ కృష్ణుడు, సర్వవ్యాపకుడు, సర్వమయుడు అయిన అ సర్వేశ్వరుని పెదవుల చెంత చేరి అధరామృతాన్ని గ్రోలుతున్నది. అట్టి భాగ్యాల్ని తనకు కలిగించవలసిందిగ విన్నవించుకుంటున్నది.

''ఉన్నోడుడనే యొరు కడలిల్'' అని ప్రారంభం. మధుర భక్తిలో చిత్తజనితాలైన స్వభావ గుణాలన్నింటిని భగవదర్పితం చేయటమనే భావమిందులోనున్నది.

**2:3:6**

సీ. అపసవ్యరేఖల నందమై చెలువొందు
ఓ శంఖ రాజమా! యొక్క నాడు
నారద శాపంబు నలకూబరమణిగ్రీ
వుల నాడొనెర్చెనచల పుద్రుమము
గాగ శ్రీ హరి పాద కమనీయ స్పర్శచే
శాపమో చనమయ్యె శాంతి చెంద
నా విష్ణు శ్రీహస్త మాశ్రయ మయ్యెగా
తీర్థముల్మ్రుంకగా తిరుగలేదు

తే. గీ. అధర సుధనభిషేకము లాచరించి
ధన్య మయ్యెనీ జననంబు ధర్మ రీతి
గాంగ జలముల మునుకల క్రమము లేదు
పూర్వ జన్మల పుణ్యము ల్పొందినావొ 69

''ఓ శంఖమా! నీవు చాల అదృష్టవంతుడివి. ఒకనాడు దేవర్షి నల కూబర మణిగ్రీవులనెడి గంధర్వులు నియమాన్ని తప్పి గంగానదిలో స్నానమాచరించారని ''మీరు మద్ది చెట్లుగ అగుదురుగాక!'' అని శాపమిచ్చాడు. శ్రీహరి పాదస్పర్శచే వారికి శాపవిమోచనమైనది. గంగానది కంటెను పావనమైన ఆహరి హస్తాన్ని నీవు ఆశ్రయించి వుండటమే కాదు, ఎల్ల వేళల అతని అధరాన్ని సమీపించి అమృతంలో స్నానమాచరిస్తున్నావు కదా! నీ జన్మ ధన్యమైంది'' అని వివరిస్తున్నది గోదా దేవి.

''పోయ్ తీర్థం ఆడాదే నిన్రు'' అని ప్రారంభం. శ్రీ శంఖాన్ని ప్రస్తుతిస్తు పాడిన పాట. ఆయుధ విశేషాలను వర్ణించటం కీర్తనలలో ఒక భాగం.

**2:3:7**

సీ. అలరుతేనియలరాయంచగ్రోలునటుల
కెందామరములపై కేళి సలిపి
కెంజాయ లీనెడి కేశవుని కనులు
మేన నల్లని కాంతి మెఱయుచుండ

సౌందర్య సాకార సన్నుత కృష్ణుని
కాంతులు చిమ్మెడి కరతలమున
సోలుచుంటివి కాదె సుఖసుషిప్తితనర
శంఖమా ధన్యంబు జన్మనీదు
తే. గీ. కలిగె సంపూర్ణ పుణ్యంబు కామితార్థ
ఫలము నెల్లను పొందితి భాగ్య విధుల
పూర్వ జన్మంపు ఫలముల పొందు లేమొ
నిన్ను నుతియింతు మనమార నెనరులెన్ని 70

'ఎఱ్ఱని తామరలపై చేరి పూదేనెలను గ్రోలుతు ఆడుకునే హంసవలె శ్రీకృష్ణుని కెందామర వంటి అరచేతిలో ఓ శంఖమా! నీవు హాయిగ నిద్రపోతు సుఖిస్తున్నావు. నీ జన్మ ధన్యమైంది. అట్టి భాగ్యాన్ని నాకును కలిగించు'' అని వేడు కుంటున్నది.

''చెంగమల నాణ్ మలర్ మేల్'' అని ప్రారంభం. హంస, తామర, శంఖం యివి మూడు తత్వార్థ బోధకాలు. సహస్రార పద్మంలో సుఖసుషుప్తిని పొందేది సః అహమ్ = సోఽహం, హంస అనేది యోగ వాచకము. ఉచ్ఛ్వాశ నిశ్వాశాలకు సంకేతం హం, స. దీనినే అజప మంత్రమని అంటారు. శంఖ నినాదం శ్రుతి లయలకు చిహ్నం.

**2:3:8**

సీ. పాంచజన్యమ! నిన్ను పరికింప చిత్ర మౌను
సతతంబు శ్రీకృష్ణు సంత నిలిచి
యమృతంబు చిందెడి యధరంబు దరిచేరి
గ్రోలెదవు సుధల కోర్కె తోడ
కడలి ఛాయల మేని కమలాయతాక్షుని
చక్కని యరచేయి శయనమయ్యె
నలుకతో గోపాల వనితలు కూడుచు
కయ్యమందగలరు కాచుకొనుము

తే. గీ. చెంత చేరగ నీయక చిరము నీవె
కొలువు దీరుట న్యాయంబె గుప్త పరచి
మాకు నట్టిదె భాగ్యంబు మసలు నటుల
కొంత తావును మాకిమ్ము గుర్తుగాగ 71

గోదా దేవి ఎల్ల వేళల కృష్ణుని అధరాల నాశ్రయించివున్న పాంచజన్య శంఖాన్ని చూచి ''ఓ శంఖమా, సముద్రం వలె నీల ఛాయకలిగిన వాడు, విశాల నేత్రుడు అయిన ఆ గోపాల దేవుని పెదవులదగ్గరే నీకు స్థిర నివాసమైనది కాబోలు. ఎల్లవేళల ఆ అధరామృతాన్ని గ్రోలుతు, అరచేతిలో శయనించి వుంటావు. ఇట్టి నీ స్థితి మా కందరికి చాలా చోద్యంగ నున్నది. గోపికలు తప్పక నీతో వాదాడుతారు. కొంత సేపటికైన నీకున్న ఆ భాగ్యాన్ని మాకు కలిగించరాదా'' అని విన్నవించుకుంటున్నది.

''ఉణ్ బదు సాల్లిల్ ఉలగళందాన్'' అని ప్రారంభం. శంఖానికిచ్చిన సందేశమిది.

**2:3:9**

సీ. భాగ్యంబు పెంపొందు పాంచజన్యమ! నీవు
పదహారు వేల గోపవనితలును
తమ వంతు కోసమై తారసిల్లుచు నుండి
యాసించు చుండుదు రధర సుధల
నెల్లరు సమముగ నింపుతో సరిచూచి
పంచుకొనగనున్న వారువరుస
సమయంబు చూచుచు సందున చొర బూని
మత్తుగ గ్రాగెడి మధుపమటుల
తే. గీ. శంఖ రాజమా! సరికాదు చలము మాని
భాగముల వారి వెల్లను పంచి యిమ్ము
లేక యున్నచో కయ్యంబురాక యున్నె
న్యాయమెఱిగి మసలుకొమ్ము నయముగాగ 72

శ్రీ కృష్ణుని అధరామృతాన్ని సేవించటానికి పదుహారువేల మంది గోపికలు కాచుకొని వుండి వారి వారి వరుసలో ఆనందామృతాన్ని అనుభవిస్తున్నారు. పాంచజన్య శంఖం సమయం దొరికిన వెంటనే లోన దూరి ఆ అమృత మయుని అధర సుధను వదలి పెట్టటం లేదు. కాబట్టి వేచివున్న ఆ వ్రేతల కందరికి దానిని సమంగ పంచి పెట్టి, ఆ చోటు నుండి కదలి పోవాలి. లేనిచో వాళ్లు తప్పక కయ్యానికి సిద్ధమౌతారు అని శంఖానికి హెచ్చరికల నిచ్చింది గోదా దేవి.

''పది నారామ్ ఆయిరవర్'' అని ప్రారంభం. ఏ అరమరికలు లేకుండ చిత్తవృత్తులనన్నింటిని నివేదించటం మధుర భక్తిలో ప్రధానమైన అంశం.

**2:3:10**

సీ. శ్రీ శంఖ రాజపు శ్రీహరి బంధము
లూహించి యల్లెగా నొప్పు మీర
కల్యాణ నగరంబు కమలాక్షు నిలయంబు
శ్రీ విల్లుపుత్తూరు సీమయందు
భాగవతోత్తము భక్తికలితుడగు
విష్ణుచిత్తుండను విప్రునకును
కొమరారు కూతుగ గోదమ్మ పాడిన
పాశురమ్ములివిగో పదియు నొప్పె
తే. గీ. తాళ రాగాల రచియించె తమిళ భాష
నెవ్వరునెనరు తోడను నెదను తలచి
భక్తి మీరగ పాడిన వారికెల్ల
పావనంబుగ లభియించు పరమ పదము 73

ఫలశ్రుతి పాశురం. పాంచజన్య శంఖానికి పరంధామునకున్న అనుబంధాన్ని గురించి శ్రీ విల్లుపుత్తూరులో భాగవతోత్తముడైన విష్ణుచిత్తుని కుమార్తె గోదా దేవి పది పాశురాల నల్లినది. తాళరాగ సహితంగ తమిళ భాషలో నున్నది. దీనిని భక్తిశ్రద్ధలతో పాడిన వారికి పరమపదము ప్రాప్తిస్తుందట.

''పాంచజన్నియత్తై పఱ్పనాబనోడు'' అని ప్రారంభం. ఫలశ్రుతి పాశురం.

## మేఘ సందేశము

**2:4:1**

సీ. నింగిలో విహరించు నీలమేఘము మీద
ముసరిన ఓ కారు మొయులు లార!
తేటగ ప్రవహించు తీర్థవార్థులు పెక్కు
తిరువేంకటగిరిలో తిరుమలేశు
నిరవులు మీరైన నెఱిగి యుందురు గాక
పఱతెంచెనా? నాదు ప్రాణవిభుడు
వినిపింపవేలకో వినువీధి జలదమా
కన్నీటి ధారల కార్చినాదు
తే.గీ. కుచపు కుంభము తడిసెను కొనలయందు
మగువ తనమున కలిగిన మార్పు వలన
మేఘ చయములారా! నాదు మేని బాధ
నాకు నై వాని పిలువుడు నయము తోడ 74

నల్లని మేఘాల చూచి గోదా దేవి సందేశాన్ని తన స్వామికి పంపిస్తున్నది. తిరువేంకటగిరిలో నెన్నో తీర్థాలు ప్రవహిస్తున్నది. అక్కడే తిరుమలేశుడు కొలువుదీరి యున్నాడు. ఆకాశంలో సంచరించే మేఘాలు ఆ తిరుమలేశుని దర్శిస్తూ సంచరిస్తున్నాయి. కాబట్టి వాటిని పిలుస్తూ ''కన్నీటి ధారల కార్చి కార్చి కుచములపై పడుతున్నది. మగువ తనము వలన నిట్టి మార్పులు సంభవించాయి. కాబట్టి మీరైనా నా స్వామిని పిలచి నా బాధలను వినిపించండి'' అని ప్రాధేయ పడుతున్నది.

''విణ్ణీల మేలాప్పు పిరిత్తాఱ్పోల్'' అని ప్రారంభం. తుసావంతి రాగంలో ఆది తాళంతో పాడుకోవచ్చు.

కావ్యాలలోను మేఘ సందేశాలున్నాయి. నాయికా నాయకుల మధ్యనున్న వియోగ బాధల్ని భరించేవి జలధరాలే.

మహాకవి కాళిదాసు దీనికని ఒక ప్రత్యేక కావ్యం మేఘ సందేశమును రచించాడు.

మేఘాలలో నత్యంత నిగూఢమైన ప్రకృతి సిద్ధాంతమున్నది. ఇది నేమివలె భ్రమణాల్ని కలిగి పరిణామ పూర్ణత్వంలో నున్నది. సూర్య కిరణాలు సముద్రం వంటి నీటి ఆకారలపై పడి వాటిని ఆవిరిగ గ్రహించి వాతావరణ కాలుష్యంలో కలిసి మేఘలుగ మారుతున్నాయి. మరల వాయు వేగం వలన నొక దానితో నొకటి ఢీకొని మళ్ళీ నీటి ధారలుగ మారి సముద్రంలో కలిసిపోతున్నది. మానవ జీవిత క్రమానికినిదిసంకేతమని తాత్త్వికులు ఉదాహరిస్తుంటారు.

**2:4:2**

సీ. మేఘ పుంజములార! మీరైన వెతలను
విని పింప లే రొకా విభుని చేరి
ముత్యాలు బంగారు మురిపంపు మణులను
ధారగ చల్లెడి దాతలార!
తిరువేంకటగిరిలో తీరుగ నుండెడి
నలుపు వస్తువుల లోనలుపు చేర్చి
రూపమౌనాస్వామి రూఢిగ తెలిపిన
సందేశమెయ్యది చక్కగాను
తే. గీ. చెవుల వినిపింప రండు నా చీకు తీర
మదన జ్వాలలు రగిలించు మదినిదూరి
మలయ పవనంబు రెట్టించు మధ్యనిశిలొ
బాధల సహియించి నేనేమి బ్రదుక గలను 75

ఆకాశంలో తిరుగాడే మేఘాలు ముత్యాలు బంగారు, మణులను వర్షించి ప్రజలకు మేలును కలిగిస్తున్నది. ఆ తిరువేంకటగిరిలో ప్రకృతిలో నున్న నల్లని వస్తువుల నన్నింటి నుండి నలుపును మాత్రమే గ్రహించి రూపంగ నిలుచుకొనివున్నాడట తన నాథుడు. కారుమొయులులనుండి నలుపును(గ్రహించి వుండవచ్చు. కాబట్టే ఆ నల్లనయ్యను సమీపించి తన విషయంగ తెలిపిన సందేశాలను తనకు వినిపించమని తహతహలాడుతున్నది గోదా దేవి. అంతేకాదు కామాగ్ని తనలో ప్రవేశించి రగులుతున్నది. ఇట్టి యెడ దానికి తోడు మందమారుతం వీచిందంటే తాను ఓర్చుకొని ప్రాణాలతో నుండ గలదా! అని తపిస్తున్నది.

''మా ముత్త నిది సొరియుమ్'' అని ప్రారంభం.

కావ్యాలలోని నాయిక విరహసందేశ మిందులో నున్నది. మేఘ సందేశానికున్న అంతరార్థం సర్వత్ర సమన్వయించుకోవాలి. అగ్ని వాయువు రెంటి ప్రస్తావన వున్నది.

**2:4:3**

సీ. దయతోడ వీక్షించు ధారాధరములార!
నామేని జిగి కాంతి నాటి నుండి
కంకణ వలయమే కాంత సిద్ధి తపము
సర్వంబు నశియించె శాంతి లేక
నిద్రయు దూరమై నెనరుగ మదియందు
ధ్యాన చిత్తము తప్పి దైన్య దశయు
ప్రాప్తించె నా స్వామి భాగ్యంపు గతి లేక
నన్నుపేక్షించెనన్యాయ వృత్తి

తే. గీ. అందచందపు దీప్తులు నన్ని మరగె
చలువ డెందపు కృష్ణుని జాడ లెఱిగి
తిరుమల నివాసు గీతంబు తెలిసి పాడి
నిత్య పదముల ప్రాణంబు నిలుపుకొందు 76

మేఘాలను పిలిచి గోదా దేవి అంటున్నది ''ఓ! జలధరము లారా! వినండి, ఏ నాటి నుండి ఆ కృష్ణుని ప్రణయానికి వశమై పోయానో, ఆ నాటి నుండి, నా శరీరంలో కాంతి తగ్గిపోసాగింది. కంకణాలు వదులై పోయాయి. నిద్ర లేదు. ఏకాంతంగ చేసే ధ్యానంలో చిత్తం నిలకడగ నుండటం లేదు. నన్నీ విధంగ నుపేక్ష చేసిన నాయకుని ప్రవర్తనలో న్యాయం లేదు. ఆ కృష్ణుని తలంచుకొని పాడుతున్న ఈ పాటలే నన్ను ప్రాణాలతో కాపాడుతున్నది. ఆ పాశురాలలో నాబ్రదుకును నిలుపుకొంటున్నాను''.

''ఒళి వణ్ణం వళై చిందై'' అని ప్రారంభం. ప్రణయంలోని విరహ గీతాలాపన మిది.

2:4:4

సీ. మెఱపు తీగల కాంతి మెట్లపై నెక్కుచు
ద్రోగుచుండెడి కారు మొయులు లార!
యౌవన దీప్తులు యావదంగమునందు
పూర్వాను భూతితో పొంగు వారె
వక్షోజ యుగళంబు వలపుతో నిండారి
కౌగిలి సుఖముకై కాంక్ష పడియె
నీల మేఘపువర్ణు నిత్య యౌవన దీప్తి
సౌందర్య మూర్తిలో సౌరు దేరె

తే. గీ. లక్ష్మి సిరులతో నురమున లాస్య లీల
పొదిగి నిలిచిన శ్రీవాసు పొందు కొఱకు
పడెడి పాటెల్ల మీరైన పంత చేరి
వీనుల వినపింపగ రాదొ వినుతి కెక్క 77

అంతర్యుక్తిగ భావం పొందుపరచబడిన పాశురమిది. మేఘాలను చూచి ఆవిరహిణి విలపిస్తున్నది. ''ఓ కారు మేఘము లారా! మీరు మెఱపు తీగలతోను, ఉరుములతో కూడి వున్నారు'' అని అంటున్నది. అంటే రెండు మేఘలు కలిసికొన్నప్పటి పరిణామ మిది. ''కాని నేను మాత్రం నా యౌవనోద్రేక దీప్తిని అణచుకుంటున్నాను, నా వక్షోజాలు కూడ లక్ష్మి నివాసమైన ఆ శ్రీనివాసుని వక్షాన్ని కౌగలించుకోవాలని కాంక్షతో నున్నది. ఆ ఆవేదనను మీరైన నాథునకు తెలియ చేయండి'' అని వివరిస్తున్నది.

''మిన్ ఆగత్తు ఎళుగిన్ట'' అని ప్రారంభం. విరహ గీతానికి ఒరవడిగనున్న కావ్యవస్తు విషయం తోడి పాశుర మిది.

2:4:5

సీ. తిరువేంకటగిరలో దీట్టైన వనములో
మధువుల చిలుకు సుమములనెల్ల
రాలునటులచేసి రాశుల పోయుచు
వానిపై నెక్కుచు వర్షధార

లకురియు గగనతలపు యో మొయిలులార!
యలహిరణ్యకశిపునణగ ద్రొక్కి
తీవ్ర నఖములచే తీటడంచిన హరి
నరహరి రూపుడై నాదుమొరలు
తే.గీ వినుచు నాకును తన చేతి వింత పనుల
వోలె కంకణంబు తొడుగ నోపు ననుచు
పలుక రార పయోధర పంక్తులార!
వేడు కొందును దూతలై వెడలి రండు. 78

సుదీర్ఘమైన భావాన్ని ఈ పాటలో గుప్తం చేసింది. తిరువేంకట గిరిపై ఎన్నో పువ్వుల వనాలున్నాయి. చల్లని వర్షపు గాలిని కలిగిస్తు ఆకాశంలో మేఘాలు కదులుతున్నాయి. ఆగాలి వలన మధువుల చిలికే పువ్వులు రాశులుగ చేరి పోయాయి. వాటిపై మేఘాలు ఎక్కి ఆకాశాన్ని అందుకున్నాయట. ఆ మహావిష్ణువలనాడు హిరణ్యకశిపుని వధించటానికి తన నఖాగ్రాలను ప్రయోగించి బీభత్సభయానక కార్యాలను చేశాడు. నేను తన పరిస్థితిని గుర్తించి తన పనికి సాక్షిగ ఒక కంకణాన్ని యిచ్చి పంపించవచ్చు కదా! నా విన్నపాలను విన్న పక్షంలో వలయాన్ని గ్రహించి రండి మేఘములారా!'' అని ప్రాధేయపడుతున్నది.

''వాన్కొండు కిళర్న్దెళున్ద'' అని ప్రారంభం. దౌత్యంచేసేటప్పుడు, సంకేతాలను నిచ్చిపుచ్చుకోవటమనే కావ్యగత సంప్రదాయమున్నది.

**2:4:6**

సీ. సంద్రంబులో చొచ్చి జలమును సరిత్రాగి
నిలువున పై కెక్కి నింగి చేరి
చల్లగ చరియించు జలధర బృందమా!
పాతాళ లోకంబు బలిని నదిమి
ధర్మ రక్షణ చేసి ధరణి బ్రోచినవాడు
కొండపై తిరుమలన్ కొలువు దీరె
చల్లగ మీరును సాగుచు తిరుమలన్
జలజల కురిసి నా జాలి కథను

తే. గీ. తెలిపి, క్రిములచే దొల్లిన వెలగ పండు
గాగ చిత్తంబు ప్రణయమై కలిసిపోయి
జీవ రహిత మయ్యెను నాదు జీవితమ్ము
రుజను పోకార్ప రమ్మన రోయి వేగ 79

ఆ మేఘాలు సముద్రంలోని చల్లని నీటిని త్రాగి, బలి చక్రవర్తిని పాతాళలోకానికదిమి మహా విష్ణువు తిరుమల కొండపై కొలువు తీరిన ఆ ప్రదేశంలో సంచరించి, జలజల కురిసి, తన సానుభూతి సంగతులను తెలియచేయాలట. వెలగ పండులో క్రిములు చేరి లోపలి పండును తిని వేసినట్లుగ తన మనస్సులో ప్రణయం నిండుకొని లోనిసత్తువు నంతను తీసివేసినదట. నేడు జీవ రహితంగ నున్నది గోదాదేవి. వెంటనే తిరుమలేశుని రమ్మని చెప్పి తన రోగాన్ని తీర్చమని చెప్పాలట. ఇది ఆమె విలాపం.

''జలంకొండు కిళర్న్దెళుంద'' అని ప్రారంభం. కరుణ రసభరితమైన సానుభూతితోడి విలాపమిది. మేఘ సందేశంలో మధ్య మణి సదృశంగనున్న పాశురమిది.

**2:4:7**

సీ. చల్లని జలధర చయములార! వినుడు
పదముల నిడువిన్నపంబుకొని
క్షీరాబ్ధిమధనుని కెంజాయనయనుని
ముగ్ధమోహన రూపు మురిపె మొప్పు
తిరుమలేశుడు వాని దైత్యారి గోపాలు
చెంగల్వ పదముల చెంత వ్రాలి
వేళల శుభదంపు వేడ్కతో నొకపరి
కుచకుంభములను కుంకుమలు చెదర
తే. గీ. కరము మీరగ నా స్వామి కౌగలింప
బ్రతుక గలకొన్ని దినముల బాధ మరచి
యనుచు తెల్పుడు నిలుచును యసువులపుడ
మరువక కదలి తెల్పుడు మబ్బులార! 80

''సముద్రంలో నీటిని గ్రోలి చల్లగ తిరుగాడుతున్న మేఘములారా! ఆ సముద్రాన్ని మధించిన వాడు, ఎఱ్ఱని కండ్లు కలిగిన వాడు, ముగ్ధమనోహర

రూపుడు, దైత్య సంహారకుడు తిరుమలేశుడు అతని చెంగల్వపాదాలచెంత వ్రాలి విలపిస్తున్నాను. ఒకే ఒక పరి నాకుచకుంభములపై అలదిన కంకుమలు చెదరిపోవునట్లుగ కౌగలిని కలిగిస్తే చాలు, నేను అ అనుభూతితో కొంత కాలం బ్రతుక గలను. ఈ విషయాన్ని మీరే వెళ్లి నివేదించండి''.

'సంగమా కడల్ కడందాన్' అని ప్రారంభం. మధుర భక్తిలోని పరాకాష్ఠ భావానికి చెందినది. కరుణ రస ప్రధానం.

**2:4:8**

సీ. తిరుమల శిఖరాన తిరుగు మొయిలు లార!
రణకేళి వేళ శ్రీ రామ మూర్తి
శ్రీ లంక నగరంబు చేరి యరులద్రుంచె
నామ మహిమచేత నరులు నాడు
ధన్యత కాంచుచు తరియించి నారునా
కనుదిన నామంబు మనన మయ్యె
నందమై మారేడు నలరారు నాకులు
సార విహీనమై సాగు వేళ

తే. గీ. చినుకు పడిన తరుణమందు చిగురు తొడగు
నటుల మనమున నా స్వామి యరుదు మాట
ఒక్కటైనను పలుకంగ నోపునటుల
పలుకు మాటల నీచేత పంప లేడా? 81

కరుణ రసార్ద్రమైన ప్రాధేయ వాక్యాల పాశురమిది. తిరుమల శిఖరంపై తిరుగుతున్న మేఘాలన్నింటిని గమనిస్తూనే వున్నది. మారేడు చెట్టు లోని ఆకులు సార విహీనంగ వున్న సమయంలో ఒక్క చినుకు పడితే చాలు అది మళ్లీ చిగురిస్తుంది. ఆ విధంగ జీవ రహితంగ నున్న గోదా దేవికి తన వల్ల భుడొక్క మాట చెప్పి పంపినట్లైతే చాలు మళ్లీ తనలో జీవమేర్పడుతుంది. శ్రీ రాముడు లంకలో శత్రువుల్ని రణ కేళి యందు వధించాడు. ఆ రామ నామ మహిమచే ప్రజలు ధన్యతను పొందారు. తాను కూడ ఈ నాడు రామ నామాన్ని మననం చేస్తున్నది. కాబట్టి ఆ మేఘాలీ విషయాన్ని గుర్తించి మహా విష్ణువు నుండి ఒక్క మాటైన సందేశంగ తీసికొనిరావాలని విన్న విస్తున్నది.

''కార్కాలత్తు ఎళుగిన్ట'' అని ప్రారంభం.

తమ దగ్గరనున్న నీటిని చల్లి ఎండిన ఆకులను మళ్లీ చిగురించే శక్తిని కలిగిస్తున్నది మేఘం. కాబట్టి తనలో కూడ నట్టి ప్రాణ శక్తిని కలిగించే మాటలను తీసికొని రావలసిన బాధ్యత మేఘాలకున్నాయట.

**2:4:9**

సీ. తిరుమల వసియించి తిరుగు మేఘములార!
మీరును నచ్చోట తరలి నడచు
మదపుటేన్గుల మాడ్కిమది యించియున్నారు
ఓమహా జలధర సముదయంబ!
శేషశాయిగకడు సేవల పొందుచు
నిందిరా విభుడునన్నింత చేసె
సర్వకాలములందు సాధుల బ్రోచెడి
రక్షకుండేల పరాకు చేసె

తే. గీ. లేత తీగమేను సొగసు లేమ నన్ను
క్రూర రీతిగ వధయింప తరలెననగ
నమ్మ నేరరు విభుని యన్యాయమనరె
భక్త వత్సలు డేలకో పంత మేసె. 82

''ఓ మేఘ పుంజములారా! మీరు తిరుమలపై తిరుగాడు మదపుటేనుగుల వలె నున్నారు. ఆ శేషునిపై శయనించువాడు, సర్వకాలాల యందు సాధువులను రక్షించువాడు, భక్తి వత్సలుడు అయిన లక్ష్మీధవుడునన్నిట్లు చేసి వేసాడు. నా శరీరం లేత తీగవంటిది. ఇక ఆలస్యం చేసినట్లైతే నన్ను వధించినట్లే అవుతుంది. సర్వ పాలకుడింతటి క్రూరానికి నొడిగట్టాడంటే ఎవ్వరు నమ్మరు కదా'' అని తన అసహాయ స్థితిని, అశక్తతను తెలుపుకుంటున్నది ఆమె.

''మదయానై పోలెళున్ద'' అని ఆరంభం. సాత్త్విక భావాలలో చరమా వస్థ ప్రాణపరిత్యాగమే. అట్టి దశనందుకున్న దా అబల.

**2:4:10**

సీ. ఆదిశేషుని పావనాంశంబు పాన్పుగ
శయనించి యలసిన స్వామి యందు
దివ్యాను భవముల తేలి చొక్కుచునుండి
కాంత రచించిన కవిత లివియె
భగవదనుభవము పరిపూర్ణ దశయందు
విష్ణు చిత్తుని కూతు విశదపరచె
మేఘసందేశమై మెలత పాడెను నాడు
గోవిందు నుతులుగా గుప్త పరచి

తే. గీ. తమిళ పాశురమ్ములివిగో తరచి పాడు
జనుల కేవేళ శుభములు సంత రించు
విష్ణు దాసులనెడి కీర్తి వినుతి కెక్కి
పుణ్య మార్జించి సుఖముల పొంద గలరు. 83

మేఘ సందేశంగ ఆది శేషుని పాన్పుగ పవళించిన వాని గురించి ఆ దివ్యానుభవంలో పరవశించి విష్ణు చిత్తుని కుమార్తె గోదా దేవి అల్లిన కవితలివి. వీటిని పాడిన వారు విష్ణుదాసులు కాగలరు. కీర్తిని పుణ్యాన్ని పొందగలరు. అని ఫల శ్రుతి పాశురమిది.

'నాగత్తిన్ అణై యానై' అని తమిళంలో ఫలశ్రుతి పాశుర ప్రారంభం. ఒక్కొక్క విభాగంలోని ఫలశ్రుతి విశేషాలు గమనార్హాలు.

సిందూర వర్ణచూర్ణము

**2:5:1**

సీ. మాధవు మధువన మధ్యసీమల యందు
నింద్ర గోపప్రువ్వు లిటునటులుగ
కొండపై నెగయుచు గుంపుగ ముసురుచు
చరియవీధులలోన సంచరింప
సిందూర చూర్ణంబు చెదరినట్లైవడి
యన్నిట కెంజాయలలముకొనియె

కటకటా యలనాడు కలశాబ్ధి మధ్యలో
మందరంబును నిల్పిమధన మోర్చి
తే.గీ. చిక్కని యమృతంపు రసము చిలికి సురల
పంచి పెట్టిన సుందర బాహుడతని
బంధితులమైతి మేమును పాశ మందు
మోక్ష ప్రాప్తిని కోరెడి దీక్ష మాది 84.

మాధవుడు విహరించు ఉద్యానవనంలో ఎఱ్ఱని ఇంద్ర గోప పురుగులు, కొండ మీదను, చరియల యందును తరుగాడుచున్నాయి. సింధూర చూర్ణం అన్ని దిశల వ్యాపించినట్లు, కెంజాయలలము కున్నాయి. ఆ నాడు ఎంతో శ్రమ కోర్చి విష్ణుమూర్తి పాల సముద్రంలో మందర పర్వతాన్ని వేసి చిలికి, వచ్చిన అమృతాన్ని దేవతలకు పంచి పెట్టాడు. ఆ సుందరాంగుని, ఆ బాహువుల యందు మేమూ చిక్కుకున్నాము. ఆనందాన్ని అనుభవించటమే మా ధ్యేయం.

''సిందూర చెంపొడి పోల్'' అని ప్రారంభం. కళ్యాణి రాగం. రూపక తాళంలో పాడు కోవచ్చు. సౌందర్య ప్రకృత వర్ణన మిది. సిందూర చూర్ణాన్ని తిలకంగ ధరించటం కృష్ణభక్త సంప్రదాయంలో నున్నది.

**2:5:2**

సీ. యుద్ధ కేళులయందు నుత్సాహమున్న్జా పు
గజము లుండు భువినాగణన కెక్కు
దివ్య వాటిక వీధి తెల్లని మల్లికా
సుమములు చిరునవ్వు శోభ లీన
ద్రుమరాజము లేవొ తోరంపు నగవునా
పరిహాస మొనరించు భాతి నిలిచి
చెలియరో నేనెట్లు జీవింప నోపుదు
సౌందర్య సమ్మూర్తి జాడ లేమొ
తే.గీ. ఉరమున నడయాడు సుమము లొప్పు గాగ
చేయు సైగలు నన్నింత చేసె నకట

కరుణ నెవరికి వినిపింప గలను నేను
చెలియ! మొరలను చెలికాని చేర్పవమ్మ. 85

''తిరుమలలోని యటవీ ప్రదేశాల మధ్య యుద్ధ కేళిని జరుపగలిగిన మదపుటేనుగు లున్నాయి. తెల్లని మల్లికలు చక్కగ పుష్పించి వున్నాయి, ఇంకా నేవేవో అటవి మల్లెలు తెల్లగ వికసించి వున్నాయి. వాటిని చూస్తున్నప్పుడు నా చెలికాడేవో సైగలు చేసి పరిహాసంగ నవ్వుతున్నట్లున్నది. వనమాలి వక్షంలో నలంకరించిన పువ్వుల పరిహాసోక్తులే కావచ్చు నా దైన్య దశనెవరితో వినిపింపగలను ఓ సఖీ! నీవే వెంటనే చెలికానికి విషయాల నందివ్వాలి సుమా!'' అని విలపించింది.

''పోర్కళిఱు పొరుమ్మా'' అని ఆరంభం. ప్రకృతి సౌందర్యమంతా భగవద్స్వరూపంగాను వాటి లాస్యాలు, భగవద్విలాసం గాను గోచరించే స్థాయిని అందుకున్నది ఆండాళ్.

**2:5:3**

సీ. కాయక తీగలు కాకాని పువ్వులు
తామస కాంతిని తమకు తాము
శ్రీపతి తనుకాంతి సిరుల ప్రదర్శించు
కుసుమచయము లార! కోర్కె వినుడు
జీవింప నాకొక జీవితాశను మీరు
తెలుపగలరెనాకు తేట పరచి
ఆజాను బాహుడు నాది లక్ష్మి విభుడు
మధువని విహరించు మాధవుండు
తే. గీ. తనకు తానైని వాసంబు తరలి వచ్చి
గాజులవిడిపించుక పోయె కల్లకాదు
నేడు రాకున్న నిదియేటి నీతి యగును
సుమములార! తెలుపుడు నా శోక మెఱిగి. 86

అడవిలో నల్లని కాంతి కలిగిన కాయక తీగలు, కాకాని పుష్పాలున్నాయట. వాటి నలుపు దనాన్ని చూస్తునప్పుడా నల్లని వాని మేని

ఛాయలు గుర్తుకు వస్తున్నాయి. కాబట్టి ఆండాళ్ వాటిని సంబోధిస్తు ''పువ్వుల్లారా? తీగల్లారా! వినండి. మీ రంగు కలిగిన నా స్వామి, ఆజాను బాహుడు, ఆది లక్ష్మి కధిపుడు. ఎప్పుడు మధువనిలో విహరిస్తున్నవాడు. ఒక నాడు నేనున్న నివాసానికి వచ్చి, ముచ్చటైన నా గాజును నా చేతుల నుండి తీసికొని వెళ్లాడు. ఇందలి న్యాయాన్ని మీరే అడిగి నాకు తెలియ చేయండి'' అని తన మీద తన విభునకున్న శృంగార భావాన్ని వ్యక్తం చేసింది.

''కరువిళై ఒణ్ మలర్గాళ్'' అని ప్రారంభం. ప్రకృతిలో సౌందర్యేతర వస్తువుల యందును పరమాత్మ తత్త్వాన్ని దర్శింప గలుగుతున్నది.

**2:5:4**

సీ. విస్తార మధువని వీధి సుఖించెడి
కోకిలమ్మ! మయూర కోటు లార!
యందంపు కాకాని యలరు లార! విరిసి
పండిన కాయంపు ఫలములార!
నేరేటి ఫలములా నీలంపు రంగులో
నైదు రీతుల మీలో నఘముకలిసె
వనములో విహరించు వనమాలి ఛాయలు
గూఢమై మీకెట్లు కుదురు కొనియె

తే. గీ. నీల ఛాయలు చూడగ నెమ్మదికిని
శోక భావము తోడ నసూయకలిగె
మిమ్ము దర్శింప నాస్వామి మేలమే మొ
కనుల విందైన కలిగెను కమ్మగానె. 87

ఆ వనంలోనున్న కోయిలలు, నెమళ్లు, బాగా పండిన కాయ ఫలాలు, విరిసిన కాకాని పువ్వులు, నేరేటి పండ్లు వీటిని చూచి, వాటిలో నున్న నీలపు రంగును చూచి చూచి శోకాకులంగ ఈర్ష్యతో నిట్టూరుస్తు అడుగుతున్నది ఆమె. ''మీరైదుగురు నాస్వామిలో నున్న నీలపు రంగు నే విధంగ తీసికున్నారు. మహా పాపాలు చేసిన వారు మీరు. లేదా నాస్వామి మిమ్మందరినీ

విధంగ దర్శింప చేసి నాతో మేలమాడుతున్నాడు కాబోలు. కాని మిమ్ము చూచే భాగ్యమైన నాకు కలిగింది కదా'' అవి వ్యాకుల పాటును పొందుతున్నది.

'పైమ్ పొళిల్ వాళ్‌కుయిల్ కాళ్' అని తమిళం. ప్రకృతిలో కలిసిన పరమేశ్వరుని లీలా వినోదాలను తిలకిస్తున్నది.

**2:5:5**

సీ. వరగుణ శోభిత తరులచే నలరారు
కుసుమ వాటిక మధ్య కొలువు దీరి
వనముతిరుమలగ వాసి కెక్కిన భూమి
స్వామి నివాసంపు శైల మదియె
నిత్య కళ్యాణుండు నిలిచిన స్థితి యందు
కెంజాయ కన్నుల కెంపులలరు
నీల మేఘపు మేని నీలి రంగు నెనయు
తుమ్మెద లలరుల తూగు చుండ
తే. గీ. తుమ్మె దనివహ మాకూప తోయ మందు
విచ్చు తమ్మిపూ తతులార వివిధ వస్తు
దర్శన వశమున మనము తత్తళించె
నొక్క మార్గము చూపించు దిక్కు మీరె. 88

చక్కగ విరిసిన పువ్వులతో కూడిన ఆ వన ప్రదేశంలో నిత్య కళ్యాణుడుగ కెంజాయ కన్నులతో నీలవర్ణుడు నిలిచిన భంగి కొలువు దీరివున్నాడు. ఆ పువ్వులలో మధువును గ్రోలుతు తుమ్మెదలు తిరుగాడుతున్నాయి. కోనేటిలో తామరలు వికసించి వున్నాయి. ఈ ప్రకృతి శోభను చూచినప్పుడు గోదా దేవికి నల్లని తుమ్మెదలలో శ్రీ కృష్ణుని మేని ఛాయ, తామర పువ్వులలో కృష్ణుని ఎఱ్ఱని నయనాలు కనిపిస్తున్నాయి. అందుకే వాటిని సంబోధిస్తు ''ప్రకృతిలోనే వస్తువును చూచినా నా మనస్సు చెదరి తత్తళిస్తున్నది. కాబట్టి తుమ్మెదలారా, తామరపువ్వు లారా! మీరే నాకొక దారిని చూపించాలి'' అని కోరుతున్నది.

''తుంగ మలర్ పొళిల్ సూళ్'' అని ప్రారంభం. తుమ్మెదలు, తామరలు పరమార్థ వస్తు సంకేతాలు.

**2:5:6**

సీ. పరిమళ సహిత భూభాగమదియెకా సు
వాసన లీచెడి వనములున్న
సుక్షేత్ర సీమగా సొంపుల తిరుమలన్
వాసంబు చేసెడి వాసు దేవు
కళ్యాణ గుణునకు కలశంబు నూటిలో
వెన్నె నింపుచు నేను వేడుకొంటి
గుడముతో నన్నంబు గోముగ కలుపుచు
కుండలు నూటిలో గుప్త పరచి

తే. గీ. యర్పణములుగా వింతు నా యచ్యుతునకు
ప్రతిని బూనితి నానాడె భక్తి మీద
నంచెలంచెలు పెరిగెడి హరియు వచ్చి
యేల నన్నేలు కొనుట లోమేల మాడు. 89

''పువ్వులతోను పండ్లతోను నిండిన ఆ వనవాటికలో శ్రీమన్నారాయణుడు కొలువు దీరి యున్నాడు. నూఱుకుండలలో వెన్నను నూఱు కుండలలో బెల్లంతో చేసిన అన్నం నైవేద్యంగ మనసార సమర్పించాను. నన్ను కరుణతో చూచి ఏలుకోనటానికెందుకో అలస్యం చేస్తున్నాడు'' అని దుఃఖిస్తున్నది అండాళ్.

''నాఱు నఱుమ్ పొళిల్ మాలిరుంసోలై'' అని తమిళంలో ప్రారంభం. శ్రీ కృష్ణావతారంలో వెన్నను దొంగలించట మనేది సుదీర్ఘ కథనంగ భాగవతంలో నున్నది. చిక్కగ పాలును కాచి, దానిలో కొంత పెరుగును చేర్చి అది పెరుగైన తరువాత బాగా చిలికిన కాని వెన్న దొరకదు. ఆ విధంగానే జీవితంలో నాత్మ పరిపక్వత యేర్పడటానికెన్నో అవాంతర దశలను దాటవలసి వుంటుదని, శ్రీ కృష్ణునకు వెన్నకున్న అంతరార్థాన్ని వివరించారు ఆర్యులు. ఆ విధంగానే గుడాన్న మనేది స్వాదుతరమైనది. దీనిని నైవేద్యంగ సమర్పించటంలో కూడ విశేషార్థమున్నదని ఆర్యోక్తి.

నూటికి లెక్కలో వెన్నను, మరి నూఱు కుండలలో గుడాన్నాన్ని నింపి నైవేద్య మిచ్చినది. కాని ఇది ఆమె స్వయంగ నైవేద్యమివ్వట మనేది కాదు. ఆమె భక్తి, శృంగార రసపూరితమైన పాశురములనే నైవేద్యాలను సమర్పించినదనే భావం, తమిళ వ్యాఖ్యానాలులో నున్నది. తమిళ వైష్ణవ సంప్రదాయంలో బెల్లంతో చేసిన అన్నాన్ని ''అక్కార అడిసల్'' అని అంటారు. పాశురంలోను నీ పదం వాడబడింది. నేటికి వైష్ణ వాలయాలలో నీ పేరు ప్రసిద్ధిలో నున్నది.

**2:5:7**

సీ. చల్లని తెమ్మెర ల్చక్కని వాసన
ల్వీచెడి మధువని వీధియందు
నుపసేవ్య దశలోన నుపకరించు బుధుల
నేడు నాయెదుటను నిలువ డేల
దాస్యంబు కలిగించి తానుగ నిలిచిన
నెదయందు తుష్టుడై యించె నేని
యొక వంతునకు సరియొక వేయి వంతుల
నర్పింతు నైవేద్య మచ్యుతునకు
తే. గీ. చాల దనియన్న బోకడు సాహసించి
యింక నర్పింతు సర్వంబు నెల్ల యెడల
సేవ కైంకర్య విధులన్ని చేసి చేసి
పరమ పురుషుని నాస్వామి పడయగలను 90

''చక్కని ఆవన సీమలో విహరిస్తు నాస్వామి అందరి చేత సేవింపబడుతు, సాధువుల కందరి కుపకరిస్తున్నాడు. కాని నాకు మాత్ర మట్టి దర్శన భాగ్యాన్ని కలిగించటం లేదు. నాకు కూడ అతనిని సేవించే అదృష్టాన్ని కలిగిస్తే నేను ప్రస్తుతము సమర్పించిన నూటి లెక్కల నైవేద్యాన్ని వేయివంతులుగ అర్పించుకుంటాను. అవి కూడ తనకు చాల దన్నచో నా దగ్గరున్న సరస్వాన్ని అర్పించి కైంకర్య సేవలు చేసి ఆ పరమాత్మని నేను పొందగలను'' అని ఆ దేవ దేవుడే తన సర్వస్వమని భాషిస్తున్నది గోదా దేవి.

''ఇన్ను వందు ఇత్తనైయుమ్'' అని మొదలయ్యే పాశురమది. మధుర భక్తి భావాలతో కూడినదీ పాట. సర్వస్వాన్ని సమర్పించే స్థితి నందుకున్నది ఆండాళ్.

**2:5:8**

సీ. ఉదయ కాలమునందు నుత్సాహ మొలకింప
నల్లని గువ్వలు నాదు చెవిని
ముగ్ధమోహన మూర్తి మురిపంపు మెలకువన్
భవ్య స్వరములోన పాడుచుండఁ
బరవశమ్మున మేన భావరసము పొంగ
తథ్యమిదియ కాదె తరచి చూడ
తిరుమలేశుడు భక్త వరదుడై కాపాడు
మథురాధి పతి హరి మాధవుండు

తే. గీ. సంద్ర పునడిమి వట పత్ర శాయి యగుచు
నోల లాడుచు నిదురించు నుదధి శయను
కూర్చి పాడెడి గీతంబు కూర్మికలుగ
చెవుల విందుగ వినిపించె సేద దీర. 91

''మధు వనంలో ప్రాత ర్వేళ నల్లని గువ్వలు కమ్మని స్వరంతో ఆ జగదేక మూర్తికి సుప్రభాత గీతాలు వినిపిస్తున్నాయి. ఆ భావ రసంలో నేను పరవశించాను. ఇది నిజమే కదా! ఆ తిరుమలేశుడు, భక్తివత్సలుడు. మథురాధిపతి, మాధవుడు. పాల కడలిపై వటపత్ర శాయిగ పవళించి ఓల లాడుతున్న ఆ చిన్నారి కృష్ణునికే కదా ఈ మేలు కొలుపు పాటలు. నా చెవుల విందుగ వినిపిస్తున్నది.''

''కాలై ఎళుందిరుందు కరియ కురివి'' అని తమిళం. చూచిన ప్రకృతి శోభలన్నింటిలోను పరమాత్మని తిలకించటమే కాదు, ఏ గూటిలో నుండి ఏ గువ్వలు పలికినా, ఆ స్వరాలన్నీ తన కృష్ణుని గురించేయని పొంగి పోతున్నది.

2:5:9

సీ. క్రొంగు ద్రుమానుల తీరు గుంపుగా వెల్వసిన
తోట లుండెడి మంచి తోపు లెన్నొ
తిరుమల వనవీధి దీటుగ వరుసలో
గుత్తుగా పుష్పించు క్రొంగు విరులు
పసిడి వన్నెల పూల బారులెల్లను నాకు
తోబుట్టువులు నాగ తోచి నిలిచె
నర్థరహితమైతి నలరుల మాడ్కియా
వనమాలి చేరక వ్యర్థ మగున?

తే. గీ. పాంచ జన్య రావము వినిపించు నెపుడు
శార్ఙ్గ చాపజ్యా కమనీయ శబ్ద తతులు
నాదు చెవి సోకు కాలంబు నాకు గలదె
యెపుడు కరుణించి దయతోడ నేలు కొనునొ. 92

''తిరుమలేశుడున్న వనంలో నెన్నో చెట్లు పుష్పించి వరుసలు తీరి వున్నాయి. క్రొంగు చెట్లలోని పసుపు పువ్వులు గుత్తులు గుత్తులుగ వ్రేలాడుతున్నాయి. వీటిని చూస్తున్నప్పుడవి యేవి ఆ విష్ణుమూర్తి అలంకారాలకుపయోగపడకుండ వున్నాయి. కాబట్టి అవి నావలె నుండటం చేత నాకు తోబుట్టువులే. ఇక ఆ దివ్యరూపాన్నే ఆశ్రయించివున్న శంఖంలో నుండి నాదం వినిపించటం లేదు. శార్ఙ్గచాపాన్ని ప్రయోగించినట్లుగానే లేదు. వీటి నినాదం నేనెప్పుడు వినగలనో కదా!'' అని ప్రకృతి నిశ్చల భావాన్ని చూచి సేద తీర్చుకుంటున్నది.

''కోంగలరుమ్ పాళిల్ మాల్ అనేది తమిళ పాశురం.''

2:5:10

సీ. గంధపు వృక్షములో కారైన యగరుల
నూపుర గంగనా నాపధార
తిరుమల క్షేత్రంపు తిరువీధి ప్రవహించు
సౌందర్య మూర్తిగ శౌరి వెలుగు

సౌందర్య వేణితో చక్కని గోదమ్మ
కురులపై తుమ్మెదల్ గుంపు చేర
గోదమ్మ పలికిన గోవిందు నుతు లెల్ల
పాశురమ్ములు గాగ వాసికెక్క
తే. గీ. పదియు తమిళ పాశురముల భక్తి తోడ
నెవరు పాడిన వారికి నెల్లవేళ
ముక్తి మార్గము చూపుచు మోక్షమిచ్చు
శ్రీహరి పద పంకజముల చేరగలరు. 93

మథుర ప్రాంతంలో అళగర్ కోవెలగ ప్రశస్తి చెందిన అర్చామూర్తికి సంబంధించిన పాశురాలివి. పర్వత ప్రదేశాలలో చల్లని జల ప్రవాహాల మధ్య నెలకొన్న గోవిందుడు సౌందర్యమూర్తి. పది పాశురాలీ ప్రకృతి శోభకు చెందినవే. అక్కడ ప్రవహించే జలపాతానికి నూపురు గంగ అని పేరు. దాని ప్రస్తావన యిక్కడ చేయబడింది. ఆ క్షేత్రానికి, దేవతామూర్తికి, తీర్థ రాజానికి సంబంధించినట్లుగ గోదా దేవి పాడిన ఈ పదిపాటలెవరు పాడితే వారికా విష్ణు పాదాశ్రయం తప్పక లభిస్తుందని ఫలశ్రుతి.

''చందొడు కారగిలుమ్'' అని ప్రారంభం. ఈ ఫలశ్రుతిలో మాత్రమే గోదా దేవి తన పేరును మాత్రమే చెప్పుకున్నది. ఊరు, తండ్రి పేరు ఇందు లేదు.

## కార్కోట పువ్వులు

**2:6:1**

సీ. నలుపైన కార్కోట నీలపుష్పములార!
కదనకేళికి మిమ్ము కదియ చేసె
నాపైన యుద్ధంబు నయమున చేయగ
బంటు సేనల సిద్ధ పరచె నేమొ
నీల సంద్రపు మేని నీలి ఛాయల స్వామి
ఎందు దాగెనొకాని యెఱుగలేను
అలసెను సర్వంబు హరిజాడ తెలికయ
మొరల నెవ్వరితోడ వరలు కొందు

తే.గీ. తులసి దామము వలనను నాదు మనము కడు
శీఘ్ర గమనమునతరలు శ్రీనివాసు
డెంతబలవంతుడౌర! నాకెటుక పడదొ
కటకటానికెన్నాళ్లుగా కాసి పెట్టు. 94

''నల్లని ఛాయ కలిగిన కార్కోట చెట్లలో నీలంగ పువ్వులు పూస్తున్నాయి. ఒక్కసారి విరజిమ్మి పూచిక ఆ జిల్లేడు పువ్వులను చూస్తుంటే ఆ నల్లని కృష్ణుడు తనపై యుద్ధ చేయటానికి తరిమిన సైన్య సమూహం వలెనున్నది. కాని ఆ హరి జాడలే మాత్రం కనిపించటం లేదు. హరిధరించిన తులసీ మాలలు నన్నెట్లా ఆకర్షిస్తున్నది. కృష్ణునకున్న బల మట్టిది. అతని దర్శన భాగ్యాన్ని కలిగించకుండ నన్నింకెన్నాళ్లు బాధ పెట్టాడో కదా!'' అని వ్యథ చెందుతున్నది.

''కార్కోట పూక్కాళ్'' అని ప్రారంభం. నీలపురంగు కలిగివుండటం చేత ఆపువ్వులను సంబోధిస్తున్నది. తనపై యుద్ధానికి తరిమినట్లుగ ఆ పువ్వులు తన్ను బాధిస్తున్నాయని భావం. కాంబోదిరాగం త్రిపుట తాళంలో పాడుకోవచ్చు.

**2:6:2**

సీ. పువ్వుల పైపైన పూచు సుమములార
సత్యలోకము మీద సతతమమరు
సముదయ లోకపు సారమై వెలిగెడి
పరమదీప్తినిల్చు పరమపురుషు
వేదసారమగునా విష్ణుమూర్తి యకాదె
దక్షిణాంగుళియందు తాండవింప
చేయు చక్రములోని చిక్కని జ్వాలలో
దహియింపనీయక దయతొనణగి

తే.గీ. శత్రు జనులుమేమనియెడి సంది యంబు
వలదు జ్యోతియై వెలిగెడి వాసు దేవు
పదము చేరగ తోడ్పడి బాధ తీర్ప
వేడు కొందువు నాపాలి వేల్పులార! 95

''కార్కోటక పువ్వుల కంటెను నింకను పైపైన ఆకాశాన్ని అంటినట్లుగ నున్న పువ్వులారా! ఆ గగన సీమను దాటి సత్యలోకంలో వేద సారుడైన విష్ణుమూర్తి తన కుడి చేతిలో చక్రాయుధాన్ని ధరించివున్నాడు. ఆ చక్రంలో నుండి వీస్తున్న జ్వాలలు నన్ను దహింపనీయకుండ చేసి, నన్ను ఆ పరంజ్యోతియైన పరాత్పరునిలో కలిసి వేయండి. నేను మీ శత్రువును కాను'' అని వివరించుకున్నది.

''మేల్ తోంౘ్రి పూక్కాళ్!' అని ప్రారంభం అడవిలో నున్న పువ్వులను గగనాన్ని ఆతరువాతనున్న పరాత్పరుని స్మరిస్తున్నది.

**2:6:3**

సీ. లతలారా! మీరు నావెతలను రెట్టించు
సవతుల వలె నాకు శాపమైరి
దొండపండుల కెంపు మెండుగ పూనెడు
నధరంపు కాంతులు హరికి నమరె
వలపున చొక్కితి పాపంపు చయమున
నే జన్మల ఫలిత మేమొ కాని
శేషుని నొడి యందు సేదదేరెడువాడు
నాది శేషుని భంగి యధిపునకును
తే. గీ. రెండు నాలుకలు కలిగె లెక్క పెట్ట
లేని చోనెటుల కలిగె లేమలందు
మీది మాటలు నొక్కటి మదిని వేరు
తలపు భేదమున నెడద తల్లడిల్లె. 96

అక్కడున్న తీగలను, దొండ పండ్లను చూస్తున్నప్పుడు, గోదా దేవికి తన స్వామి గుర్తుకువస్తున్నాడు. వాటిపై అసూయ పొందుతు, ఆ అధర కాంతి, ఆ పోయగాలు తనకు లభించక పోవటానికి తానే జన్మలో నెంత పాపాలను చేశానో కదా! అని విలపిస్తున్నది. ఆది శేషుని పై పవళించిన తన నాథునకు శేషుని వలె రెండు నాలుకలున్నాయి కాబోలు. పైపైకి మంచి మాటలు చెప్పటం లోలోన దానికి వ్యతిరేకంగ ప్రవర్తించటం. ఈ భేద భావాల వలన తన మనస్సు తల్లడిల్లుతున్నదని విచారిస్తున్నది ఆండాళ్.

''కోవై మణాట్టి! నీయున్'' అని ప్రారంభం. సర్వం ఆ సర్వేశ్వరుని మయంగ ఆమెకు కనిపిస్తున్నది. కాని లౌకిక భావావేశమామేలో సమీసిపోలేదు. భక్తి భావానికిది చక్కని పూర్వ వేదిక.

**2:6:4**

సీ. మల్లికా గుచ్ఛంపు తల్లులారా! మీదు
చిరునవ్వు మాలోన చింతరేపె
నవ్వుల వీడుచు నాకు రక్షణ లిండు
యసురుల కాపాడు నచ్యుతుండు
శూర్పణఖనునాడు శోకతప్తగ చేసి
ముక్కు చెవుల కోసి మూర్ఖ చేసె
సార్వభౌవం తనయు సన్నుత పథమెల్ల
నన్నుతంబులగు నొకొ యరసి చూడ

తే. గీ. అటుల కాలంబు కలసిన నన్ని వేళ
నాదు బ్రదుకును నటువలె న్యాయ రహిత
సత్య దూరము లగునుగా సంశయమ్ము
వలదు నిజముల నరయంగ వలయునమ్మ. 97

తెల్లగ పూచిన మల్లికలను చూస్తున్నప్పుడవి యానందగ నవ్వుతున్నట్లున్నది. ఆ నవ్వులు తనలో వలపు చింతలను కలిగిస్తున్నాయి. ఆ నాడు సార్వభౌముని కుమారుడుగ నవతరించి శూర్పణఖ ముక్కు చెవులను కోసి, ఆమె అహంకారాన్ని పోగొట్టిన సత్య వాక్పరిపాలకుడు సత్ప్రవర్తకుడు ఆ పురుషోత్తముడు. అతని జీవిత విధానం అసత్యమైతే, తన బ్రతుకు కూడ అనృతమైనదే. ఇందులో సందేహమే మాత్రం లేదు. కాబట్టి మాధవుడు యధార్థాన్ని గ్రహించాలి అని మల్లికలతో నివేదించుకుంటున్నది.

''ముల్లై పిరాట్టి! నీయున్'' అని ప్రారంభం. తనలోని ప్రణయ భావాలెంతటి సత్యమైనవో నిరూపించటానికా భగవల్లీలలు సమాంతర ప్రమాణాలని అంటున్నది.

**2:6:5**

సీ. కమ్మగ పాడు పికములారా! యొక సారి
అవ్యక్త రాగంబు లాపరమ్మ
తిరుమల వాసుని తియ్యని యనుభూతి
కలిగనేని విభుని కరుణ చేత
వేడుకోలువలన వేల్పులై మీరెల్ల
మధుర గేయములను మరల పాడ
వలయుగా శ్రుతి తాళ వర రాగలయలతో
గరుడుని గమనంపు గతులు కుదుర

తే. గీ. గరుడుని నధివసించెడి కైటభారి
కరుణతో నన్నేలు కొనగ కనుల నిలువ
ముదముగ ననుచేరు తరుణము లకు మీరు
పాడుదురు గాక మనములు పరవశింప. 98

విరహంలో తపిస్తున్న ఆ తరుణికి కోకిళ్ల కూజితాలు కర్ణ శూలాలుగ నున్నాయి. అందుకే వాటిని పిలిచి ''పికములారా! మీరొకింత పాడటం ఆపండి. ఆ తిరుమలేశునికరుణ వలన నన్ను తడు కూడే సమయమాసన్నమైనప్పుడు మీరు మీ మధుర గేయాలను వినిపించండి. నన్నేలు కోవటానికి పరుగు పరుగున గరుడారూఢుడై నా స్వామి యే తేంచేటప్పుడు, మీ పాటకు గతిలయలను కలిగిస్తు గమన వేగాన్ని కలిగించు కుంటాడా గరుత్మంతుడు. అప్పుడు మీ పాటలను వినిపింపవచ్చు.

''పాడుమ్ కుయిల్ కాళ్!'' అని ప్రారంభం. ప్రకృతిలో అంతర్నిహితంగనున్న శ్రుతిలయ తాళాలను ప్రకృతిలోనే ఆవిష్కరించే పాశురమిది. విరహోత్కంఠితగ గోదా దేవి తపించుతున్నది.

**2:6:6**

సీ. గుంపుగా నొక చోట కూడునెమలులారా!
గోపాలు ఛాయలగై కొనిరి కాదె
అందాల నాట్యంపు నడుగుల నేర్చుమీ
యడుగుల ప్రణమిల్లి వేడుకొందు

పడగల విప్పుచు పరవశంబున చొక్కు
పాముపై పాన్పునా పవ్వళించు
నాయకుడే వేళ నయముగ కొలువుండి
వశపరచుకొనియె వలపు తోడ
తే. గీ. నిపుడు బేలగ నొనరించి యింత చేసె
గాదె దుస్థిత గుర్తించి కరుణ కలుగ
కేకి బృందములార! మీ కేశవునకు
చెలితోడ మీరైనను చెప్పలేర 99

ఆ వనంలో గుంపులు చేరి నెమళ్లు నాట్యం చేస్తున్నాయి. ఆ గోపాలుని నుండే ఆ రంగులను అవి తీసికున్నాయి కాబోలు. చక్కని తాళలయలతో నాట్యం చేస్తున్నాయి. అందుకే ఆండాళ్ వాటి గొప్ప తన్నాన్ని గుర్తించి. ''నెమలులారా! మీ అడుగులపై పడి వేడుకుంటున్నాను. శేష శాయిగ కొలువు తీరిన నా స్వామి తన శృంగార మాధుర్యంతో నన్ను వశపరచుకొన్నాడు. నే నిప్పుడు బలహీనురాలనైతిని. మీ పాదాల వ్రాలేటట్లుగ నా స్థితిని మార్చి వేశాడు. మీరైనా సఖ్యతతో నా సఖునకువిన్నవించండి'' అని తన పరిస్థితిని స్పష్టపరచింది.

''కణమామయిల్ కాళ్!'' అని ప్రారంభం. నెమళ్లకు పాముకు మధ్యనున్న వైరుధ్యం వలన కూడ కావచ్చు, శేషుని పై నున్న తిరుమలేశుని చెంతకు నెమళ్లను పంపుతున్నది. ఇందులో కూడ శ్రుతి లయల విన్యాసం, ప్రకృతిలో నున్న రహస్యంగ ఆరోపింపబడింది.

**2:6:7**

సీ. పురివిప్పియాడుచు పొంగు నెమలులార!
పాపాత్మురాలనై పరితపింతు
నాట్యకేళులమీవి నయమొప్పగతులను
దర్శించు భాగ్యంపు దారి లేదు
ప్రేంకణ భాండాది పెక్కునాట్యములందు
నారితేరిన వాడు నాత్మ విభుడు

దర్శించు వేళలో ధనమెల్ల కోల్పోయి
వస్త్రంపు చయములు పాడియెల్ల

తే. గీ. సకల సంపద వశమయ్యె సర్వ విభుని
కనుచు మీరైన నొకమాట నడుగ లెర
మీకు నీయగ నేమియు మిగుల లేదె
యసువు మాత్రమె యున్నది యరసి చూడ. 100

నెమలి తన అందాన్ని కనపరచే విధంగ రంగుల రంగుల పురిని విప్పి నాట్య చేస్తున్న ఆ సోయగాన్ని చూచే భాగ్యమామెకు లేకపోయింది. పెద్ద పెద్ద కుండలను తలపై పెట్టుకొని వర్తులంగ తిరుగుతు, తాళ బద్ధంగ అడుగులు వేస్తు చేసే ప్రేంకణ భాండాది నృత్త్యమున అరితేరిన వాడట ఆ గోపికాకృష్ణుడు. అతనిని దర్శించే వేళలో తన ధనం, వస్త్ర నిచయం పాడి సంపద అన్నింటిని సమర్పించిదట. ఇక ఆ నెమళ్ల కీయ దగినది తన చెంత యేమి మిగుల లేదు. ''మీరైన ఒకసారి నేను సమర్పించిన వస్తువుల గురించి అడుగుతారా?'' అని పాథేయపడుతున్నది.

''నడమాడి తోగై విరిక్కిన్ట'' అని ప్రారంభం. అన్ని విధాలైన నృత్య విన్యాసాలకునికి పట్టు ఆ సర్వమయుడు. ఆ అకరంలో నుండి జనించినవే యితర విలాసాలు అనుట అంతర్గతం.

**2:6:8**

సీ. వర్షమా! వర్షించి వరునిచేర్ప గరండి
మైనంపు బొమ్మపై మట్టి యలది
కాల్పగమైనంబు కరగి చివరిదశ
మిఱుమిట్ల లోబొమ్మ మిగులు పగిది
తిరువేంకటగిరిలో తిరముగ నిలుచుండి
కరగించి తోతెంచు కరుణ తోడ
నళగిరి వాసుడు నందగాడు విభుడు
హత్తుకొనుచు నాలో నైక్య మొంద

తే.గీ. చేయ వేవచ్చి వర్షించి చిత్త మందు
నొక్క రూపము చేయగ నొత్తి పట్టి
వర్షమా! మము కలుపు బలము తోడ
ముదము మీరగ మీరైన బ్రోవ రాదె. 101

వర్షాన్ని కలిగించే మేఘాలను సంబోధిస్తూ దాని పరిణామక్రమాన్ని తెలుపుతున్నది. ''వర్షమా! మీరు వేగంగ వచ్చి నాకు సహాయపడండి. మైనపు బొమ్మపైన మట్టినియలది దానిని కాల్చినపుడు, మైనం కరిగి మట్టి బొమ్మ చక్కని ఆకారంలో మిగులుతుంది. ఆ విధంగానే అళగిరిలో అందగాడు కొలువు దీరివున్నాడు. అతనితో నేను హత్తుకునేటట్లు చేయండి మీరు వర్షించారంటే నాలోనున్న ఆత్మ కరిగిపోయి. ఆ పరాత్పరుని రూపంలో నేను కలిసి ఐక్య సిద్ధిని పొందగలను. ఈ సహాయాన్ని నాకు చేసిపెట్టండి'' అని వేడుకుంటున్నది.

''మళయే మళయే మణ్ పురమ్'' అని ప్రారంభం. ఒక పాత్రను తయారు చేసేటప్పుడు మొదట ఆ ఆకారంలో మట్టి పాత్రను అచ్చుగ తయారు చేసికొని పిదప లోహాన్ని కరిగించి అచ్చులో పోసి ఎండిన తరువాత తీసివేస్తారట. అప్పుడు మనమనుకున్న ఆకారంలో పాత్ర తయారవుతుంది. దీన్నే పాశురంలో సూచించిందని వ్యాఖ్య.

భక్తి లాక్షాద్రవాన్ని కరిగించి హృదయంలో నింపితే యిష్టదైవమైన అర్చా మూర్తి స్వరూపం సుస్థిరంగ నెలకొంటుందని భక్తి సూత్రంలోనున్నది. ఇది సారూప్య స్థితిని పొందే విశిష్టాద్వైతంలోని తత్త్వార్థ బోధక పాశురం. ఐక్యసిద్ధికది మరొక స్థాయి.

**2:6:9**

సీ. సంద్రమా! యమృతంపు సారంబు గ్రహియింప
మంధర గిరితోడ మధన మోర్చి
త్రచ్చిరి నీవును తరుగని పూన్కితో
తిరిగిముంచుటకు యత్నించినావు

కూర్మ రూపముతోడ గూఢమై నాస్వామి
యచలంబు మునుగక యాపినాడు
సంద్రమా! నీవలె శౌరియు నామేను
నెడదల చిలికెను నింపునిండ
తే. గీ. సారహీనములయ్యెను సర్వ జీవ
జవము చెడెనని క్షీరాబ్ధి సర్పరాజు
తోడ పలికి విన్నపముల దురితదశల
నుండి యుద్ధరింప మనుచు నుడువరాదొ. 102

సముద్రాన్ని సంబోధిస్తు "ఒకనాడు నీలో నున్న అమృతాన్ని గ్రహించటానికి మంధర పర్వతాన్ని నీలో వేసి చిలికినప్పుడు నీవును మాటి మాటికి దానిని ముంచటానికి ప్రయత్నించావు. కాని నాస్వామి కూర్మ రూపంతో ఆ కొండను మునుగకుండ నాపివేశాడు. సముద్రమా! నీకువలె నా శరీరాన్ని, హృదయాన్ని శ్రీ మహా విష్ణువు తన ప్రణయ భావంతో చిలికి వేశాడు. నేడు నాలోని జవసత్వమంతా క్షీణించింది. నీపై ఆది శేషుని మీద పవళించినవాడే నాస్వామి. కావున ఆ ఆదిశేషునితో నన్నుద్ధరింపమని చెప్పరాదా!" అని సముద్రుని పిలిచి అనంతునితో సందేశము పంపమని మొరపెట్టుకుంటున్నది గోదాదేవి.

"కడలే! కడలే! ఉన్నై" అని ప్రారంభం. అనంతునితో సందేశం పంపటంలో ఆత్మ ప్రబోధ కథనమున్నది.

**2:6:10**

సీ. ఓ సఖీ వినవమ్మ యురగశయనుడమ్మ
పరమపురుషుడని పరగువాడు
మాస్వామి శ్రీకరు మహిమోన్నతుడువాడు
మర్త్యజనుమైన మనకు నతడు
దృశ్య మానుడగునె దీనులైన మనకు
శ్రీవిల్లి పుత్తూరు స్థిర నివాసు
విష్ణు చిత్తుడనుచు వినుతిచెందినవాడు
జనకుని కేకదా సాధ్యమగును

తే. గీ. తన్ను వదలక నిలచెడి తన విభుడని
పలుకు చుండెడి నా తండ్రి భాగ్య మమర
మమత లెఱిగి చూపగలడొ మార్గ మొండు
కాంచ గలను గోపాయిని కన్నులార. 103

సఖితో పలుకుతున్నది గోదా దేవి, ''శ్రీ విల్లిపుత్తూరులో నుండటం వలన లాభం లేదు చెలి! ఆ శేషశాయి, శ్రీ కరుడు, మహిమోన్నతుడునైన పరంధాముడు మన వంటి మానవులకు కనిపించుతాడా! కాని నా తండ్రి విష్ణుచిత్తునకు మాత్రమా దర్శన భాగ్యం లభించిందట. ఆ మార్గాలలో ఒక్క మార్గాన్ని మనకు చూపించినట్లైతే ఆ నాడే నా గోపాలుని కన్నులార చూడగలను.''

''నల్ల ఎన్ తోళీ! నాగణై'' అని ప్రారంభం. ఈ పాశురంలో ఫలశ్రుతి చెప్ప లేదు. తన ఊరు, తండ్రి పేరు ప్రస్తావింపబడింది. భగవద్దర్శనానికి గురూపదేశమవసరమని, ఈ పది పాశురాలు చదివిన వారికి గురు సాక్షాత్కారం జరుగుతుందనేది అన్యాపదేశంగ పలికిన ఫలశ్రుతి కావచ్చు.

## తల్లులతో నివేదించుట (తానుగ మురియుచు)

**2:7:1**

సీ. ఆభరణమ్ముల నందరు ధరియించి
యందమ్మై యలరారు యమ్మలార!
మీరును నేనును మురిసెడి కంకణ
సౌందర్యములు మనసార కలిగె
తానుగా మురియుచు ధరియించునెప్పుడు
పాంచజన్యసహిత భద్ర కరము
మును మన వలయము పోలునటులుగాగ
శంఖంపు సౌరుల సాక్షియయ్యె

తే. గీ. అగ్ని శిఖలవెలిగ్రక్కు నహుల పాన్పు
శయనుడైపవళించునా స్వామి యతడు

రంగ నాథుడు నన్నేల రమ్య రీతి
నొక్క మారైన చూడంగ నొల్ల దొక్కొ. 104

గోదా దేవి తన వంటి ముదితలు ముచ్చటగ ధరించే కంకణాలను, శ్రీపతి యెల్ల వేళల ధరించే తెల్లని శంఖంతో పోల్చి పలుకుతున్నది. ''ఓ అమ్మలారా! మనమెంతో మురిపెంతో ఈ గాజులను తొడుగుకుంటున్నాము. ఆ శ్రీహరి కూడ చేతిలో పాంచజన్యాన్ని ధరించి వున్నాడు. ఈ రెంటి కెంతో సాదృశ్యమున్నది. అగ్ని జ్వాలలను వెలిగ్రక్కు సర్పం మీద పవళించిన ఆ రంగనాథుడు నన్నేలుకోవటానికెందుకు జాగుచేస్తున్నాడు'' అని విలపిస్తున్నది.

''తాముగక్కుమ్ తమ్ కైయిల్'' అని ప్రారంభం. తన వంటి స్త్రీలే అయినా, అనుభవజ్ఞులైన వారిని అమ్మలారా! అని సంబోధించి తన బాధలను వ్యక్తం చేస్తున్నది. ప్రేమగ ధరించిన తన మురుగులు విరహంవలన వదులుగ వీడిపోతున్నాయనే శృంగారావస్థను తెలియచేసే పాశురం. సావేరీ రాగం త్రిపుట తాళంలో తమిళ పాశురం పాడుకోవచ్చు.

**2:7:2**

సీ. అందమై నిలిచిన యమ్మలారా! యల
శ్రీరంగ నాథుని చిన్నె వన్నె
లలవికాదు నుడువ నందాల సొగసులు
ప్రత్యంగ మాహ్లాద భరత మయ్యె
పగడంపు కెంపుల ప్రతివచ్చు నధరాలు
సౌందర్య మేపారు చక్షుయుగళి
పద్మనాభునిగాగ పవ్వళించిన సౌరు
లమృతపుంభావమై యలరు వాడు
తే. గీ. నాదు విభుడును తానుగ నాకు తొడుగు
వలయములు నేడు క్రొత్తగ వదులు గాగ
చేయ కారణుండయ్యెగా చెప్ప నేల
వలపు బాధల నుడువంగ వలను కాదు. 105

తన తోటి వారిని పిలుచుచు తన స్వామి రూప లావణ్య విలాస రేఖలను వివరించి తెలుపుతున్నది. ''అమ్మలార! వినండి. ఆ శ్రీ రంగనాథుని వన్నె చిన్నెలు చెప్పటానికే వీలు కాదు. ప్రత్యంగం కూడ అందాలను విరజిమ్ముతున్నది. పగడాల వలె నధరాలు, కాంతివంతములైన కన్నులు. పద్మనాభుడుగ పవళించిన ఒయ్యారం, అమృతమే రూపంగ కలిగిన నాస్వామి తానై వచ్చి నాచేతులకీ వలయాలను తొడిగాడు. కాని అవి నేడు విరహ తప్తగ చిక్కిపోతున్న నా చేతులకు వదులు కావటానికి తానే కారకుడయ్యాడు. అట్టి బాధలలో నేను తగులుకున్నాను'' అని అంటున్నది.

''ఎళిలుడైయ అమ్మనైయార్'' అని ప్రారంభం. శృంగారానికి సంకేతాలుగ పలు వస్తువులున్నప్పటి ప్రత్యేకించి కావ్యాలలో అంగుళీయకాన్ని గ్రహించటం పరిపాటి. తద్భిన్నంగ నిక్కడ కంకణం గ్రహింపబడింది. రెంటిలోను సంపూర్ణ వలయముండటం గమనింపదగింది. ఆద్యంతములు లేని దనేది ప్రగూఢార్థం.

**2:7:3**

సీ. పొంగుకడలి చేత పూర్ణ వేష్టితమైన
భూమండలంబును పూజ్యమైన
గగనంబును నడుప ఘడియయైన స్వామి
యలుపు సొలుపు లేక యాజ్ఞ చేయు
నవతార దశలలో నాజ్ఞదండము పూని
నియమించు సామర్థ్యనియతి తోడ
శ్రీరంగ పావన సీమలో కొలువుండు
రంగనాథుల డేల రహిని బ్రోవ

తే. గీ. కంకణంబుల నావెల్ల కరము ప్రీతి
తానుగైకొనె పాలింప తనదు చేత
ననుచు నెంచి యిది సరికాదనుచు తలచు
సరియగు వలయం చేలనో జారిపోయె. 106

సముద్రం చేత పరివేష్టితమైన భూభాగాన్ని పరమపదమైన గగన సీమను, ఆ శ్రీరంగ నాథుడు చేతిలో నాజ్ఞాదండాన్ని వహించి అలుపు సొలుపు లేక ఆజ్ఞాపిస్తున్నాడు. మరల ఏ కారణం చేతనో తన వలయాన్ని తీసికొని, దాని ద్వార భూమిని పాలింపదలచాడేమో! మరల యిది సరైన మార్గం కాదని తీసి వేశాడు కాబోలు. అందుకే తన కా కంకణం వదులై పోయి జారి పోతున్నది. అని భావించుకుంటున్నది గోదా దేవి.

''పొంగోదమ్ సూళ్ంద'' అని ప్రారంభం. తన ఆజ్ఞాదండంతోనే కాక, భక్తురాలి వలయాన్ని తీసికొని తన బాధలను పోకార్చుకోవచ్చునేమో అని గ్రహించి వుండవచ్చు అనేది సారాంశ భావంగ తమిళ వ్యాఖ్యానం చెప్పుతున్నది. శ్రీ రంగని అర్చామూర్తిలో ఆజ్ఞాదండంతో పాటు వలయం కూడ నుండవచ్చు కాబోలు. దానికీ భావమన్వర్థమౌతున్నది.

**2:7:4**

సీ. శ్యామల వర్ణుండు జగతి రక్షింపగ
వామన మూర్తిగ వసుధ నిలిచె
మేలిమి మిద్దెలు మేడలు రతనాల
కుడ్యాలు గూడులు కోవెలుండు
శ్రీరంగ పురమది సిరులుండు నెలవులో
నవతార మూర్తిగ నవని నిలిచి
వామన రూపంబు వహియించె నలనాడు
భిక్షాటనంబున ప్రీతి లేక
తే. గీ. కొరత కలిగెను కాబోలు కొసరి నేడు
నడచె తిరువీధి వలయంబు నాదుకోరి
యట్టి యభిలాష యున్నచో నడుగు రాదా
సిగ్గు బిడియంబు లేలకో చెలియ చెంత. 107

''నీల వర్ణుడు, జగద్రక్షుకుడు, నేడు, చక్కని సంపదలతోను, ఐశ్వర్య విలాసాలతోను, కుడ్యాలు, గోపురాలు, మేడలు కలిగిన శ్రీ రంగంలో నవతరించియున్నాడు. వామానావతారంలో భిక్షాటనకు బయలు

దేరినప్పుడు, బలిచక్రవర్తి యిచ్చిన భిక్ష చాలదని మరల తిరువీధిలో నడయాడుతు, నా వలయాని కోసం వేచి వున్నాడు. నా చెంతకు వచ్చి సిగ్గు బిడియము లేక నన్నునడుగవచ్చును కదా''.

''మచ్చణి మాడమ్ మదిన్'' అని ప్రారంభం. వలయాని కోసం కోరుతున్నాడని ఒక భావం.

**2:7:5**

సీ. అత్యరూపాహ్లాద మాయవతారంబు
వామన మూర్తిగ వసుధ నిలిచి
దాన జలంబును ధారగ గ్రహియించి
భూనభముల రెండు పదము కొలిచి
జగన్నాథుడుగాగ జగతి ప్రోచిన వాడు
పుణ్యులుండెడి రంగ పురమునందు
చల్లని పాముపై శయనించి లేని వా
రలపిరులను కోర నేల చెపుమ
తే. గీ. అట్టి వానికి తోడుగ నడుగు లిడుచు
సాధ్య మగు నేమొ జీవింపజగతియందు
మాయ లెఱిగిన కృష్ణుండు మాధవుండు
చిలిపి చేష్టలు చిన్నెలు చెప్పనేల. 108

''పొట్టిగ వామన రూపాన్ని ధరించి, ధారగ దాన జలాన్ని గ్రహించి రెండడుగులతో నింగినేలను కొలిచిన జగన్నాథుడు, నేడు శ్రీరంగంలో చల్లని పాముపై శయనించివున్నాడు. అట్టి జగన్నాయకుడు నేడు సంపదలే మాత్రము లేని నావంటి వారి నుండి చేతి సంపదను కోరవచ్చునా? ఆ మాయదారి కృష్ణునితో జీవింప సాధ్యమగునా?'' అని తనలో తాను తలచుకుంటు సఖులతో మాట్లాడుతున్నది.

''పొల్లాకుఱళ్ ఉరువాయ్'' అని ప్రారంభం. నింగినేలను నాక్రమించిన విశ్వాకారుడు శేషశాయిగ శయనించి భక్తుల నుండి యేదో కోరుతున్నాడట.

వర్తులాకారంగనున్న వలయానికున్న విశేషార్థం మరల చెప్పబడింది.

**2:7:6**

సీ. అన్ని ద్రవ్యమునావియపహరించి తనకు
స్వంతమ్మై కొనియెను సకల వస్తు
చయముల నెల్లను సంశయములు లేక
వ్యాపించి నిలిచెను వాసు దేవు
బ్రహ్మరుద్రాది యపరదేవతలు కూడ
పొంద గారానట్టి పొలుపు నమరి
వేదాల సారమ్మై విజ్ఞాన మూర్తిగ
కావేరి నదిలోన కదలి నిలుచు

తే. గీ. సస్య వృద్ధిగ వెలిసెడి సార భూమి
రంగనాథుడై పవళించు రమ్యమూర్తి
నేడు నామేను గ్రహియించి నిలుచినాడు
కడకు మిగిలన దేమియు కలదు కృష్ణ. 109

తనకున్న ద్రవ్యములనన్నింటిని నపహరించి తననిగ చేసుకొన్నాడా విష్ణుమూర్తి. సకల చరాచర ప్రకృతిలో వ్యాపించి నిలిచాడు. బ్రహ్మ రుద్రాది దేవతలకు కూడ లభ్యంకానివాడు. వేదాలసారంగ విజ్ఞాన మూర్తిగ శ్రీరంగ నాథుడు సస్య వృద్ధితో సారభూమిగ నున్న శ్రీరంగంలో నెలకొనివున్నాడు. ''చివరికి నా శరీరాన్ని కూడ లొంగదీసుకున్నాడు. కదా'' అని వాపోవుతున్నది.

'కై పొరుళ్‌గళ్ మున్నమే'' అని ప్రారంభం. భక్తి మార్గంలో నాత్మని వేదన మను మార్గమిందు సూచితము. ఆత్మార్పణ భావమిందు ప్రధానము.

**2:7:7**

సీ. దృఢమైన కుడ్యాల దీపించుకోటలో
శ్రీరంగ పురమున సేదదీరి
హాయిగ శయనించు నారంగనాథుడు
మహిమలానాటివి మరువ గలమె?
రామావతారము రమ కొఱకు నలసి
ఆకలి నిదురల నన్ని మరచి

శిలలచే వారిధి సిద్ధంబుగావించి
కడలిని దాటియాగట్టు చేరి
తే.గీ. చెరను బంధించి నట్టి యా సీత చేరి
అలుపు లేకనే యసురుని నసువు త్రెంచి
ప్రాణసఖినికాపాడెను పరమ ప్రీతి
శోకము మరచి పొందెను సుఖమునెల్ల. 110

ఎత్తైన కోట గోడలతో విరాజిల్లుతున్న శ్రీరంగంలో రంగనాథుడు పవళించి సేద తీర్చుకుంటున్నాడు. రామవతారంలో సీత కొఱకు నిద్రాహారాలు మాని కపి వీరుల సహాయంతో సముద్రంలో వారిధి కట్టి సముద్రాన్ని దాటి, చెరలో నున్న సీతమ్మను విడిపించుకొని రావణాద్యసురులను వధించాడు. ఆనాటి పాట్లన్నింటిని మరచి నేడు సుఖంగ నున్నాడు'' అని గోదా దేవి దీర్ఘంగ నాలోచించి ఆ రమా దేవి కోసమింతటి ఇక్కట్లను నెదుర్కొన్నాడు కదా! ''సుదతి నాయెడను కరుణ చూపదేల'' అని పరోక్షంగ నడుగుతున్నది.

''ఉణ్ణాదు ఉరంగాదు ఒలి కడలై'' అని మూలంలో ప్రారంభం. అవతార విశేషాలు వర్ణితాలు.

**2:7:8**

సీ. అలనాడు భూదేవి యర్ణవమున చొచ్చి
మలినదేహముతోడ మాసిపోయె
సూకర రూపంబు సుకరంబుగ గ్రహించి
పదుగురు హసియించు పందిగాగ
నుద్ధరించె సతిని నుదధిలోనికి చొచ్చి
తనదు చెలిని బ్రోచె ధర్మ రీతి
దైవ శక్తిని చూపు తనువు వెలుగొందగా
శ్రీరంగ పురమున సేవలంది

తే. గీ. ప్రతిన పూనన తియ్యని పలుకు లెల్ల
వమ్ము చేయగ నోపునో వాదులేల?
ఆత్మ సఖి కొఱకు బురద నలదుకొనియె
తనదు చెలియ బ్రోవగనేల తామసించు 111

మహా విష్ణువు ఆనాడు సముద్రంలో మునిగిపోయిన తన భార్య భూదేవిని ఉద్ధరించటాని కొఱకు, పలువురు పరిహసించే పందిరూపాన్ని ధరించి శరీరమంతా బురదను అలదుకొని సముద్రంలో చొచ్చి, రక్షించాడుకదా! భార్య కొఱకిన్ని ఇక్కట్లు పొందినస్వామి ''తనదు చెలియ బ్రోవగ నేల తామసించు'' అని విలపిస్తున్నది అండాళ్.

''పాచితూర్తుక్కిడంద'' అని ప్రారంభం. ప్రకృతి శక్తి కొఱకు పురుషుడన్వేషించటమే చిదచిత్తుల నియామక శక్తిలోని రహస్యమని తెలుపుతున్న పాశురమది.

**2:7:9**

సీ. కల్యాణ మూర్తిగ కనిపించు రుక్మిణిన్
పెండ్లి యాడుటకును బిడియ పడక
శిశుపాలుడుకడు సంసిద్ధుడై వైవాహి
కోత్సవ కృత్యంబు లొనర చేసె
బలయుత పరులెల్ల పలువురు వీక్షింప
ప్రియురాలు రుక్మిణిన్ ప్రీతి తోడ
రథముపై నిడుకొని రసికుండు కృష్ణుండు
పరిణయం బాడెను భద్ర రీతి
తే. గీ. నట్టి వనితలు వలపుతో నలరుచుండు
పుణ్య వాసము శ్రీరంగ పురము కాదె
వేచి యున్నారు వేనకు వేలు గాగ
కోర్కె వారివి చెల్లించు గుణము లేదా. 112

రుక్మిణీ కళ్యాణ సన్నివేశం సంస్మరింపబడింది. పెండ్లికి సిద్ధపరచిన రుక్మిణిని వివాహం చేసుకోటానికి శిశుపాలుడు సిద్ధంగ నున్న సమయంలో,

శ్రీకృష్ణుడామెను పలువురు చూస్తుండగ రధంపై నుంచికొని వచ్చి వివాహం చేసుకున్నాడు. ''అటువంటి రుక్మిణీ దేవి వంటి వారే పలువురు నీయందే ప్రేమానురాగాల నుంచి, ఈ పురంలో వేచి వున్నారు. వారి కోర్కెలను చెల్లింపరాదా'' అని పరోక్షంగ తనలోనున్న కాంక్షను తెలియచేస్తున్నది.

''కణ్ణాలం కోడిత్తు కన్ని'' అని ప్రారంభం. రుక్మిణీ దేవిని తనవారి నుండి అపహరించుకొని వెళ్లిన రీతిగ లౌకిక విషయ వాంఛల నుండి జీవులను రక్షించాలనేది అంతర్గత భావం.

**2:7:10**

సీ. ఆర్జవ గుణముతో నానందమయుడుగ
  రంగనాథుడనుచు రహిని బ్రోచే
పన్నగశయనుండు పలికిన మాటలు
  సత్యంబుసాదర సారమనుచు
వినెనునా జనకుండు విష్ణుచిత్తుడరయ
  తన్నువలచువారు తగిన యంత
వలపుల తన నుండి పడయగలరనుచు
  కమ్మని వాక్కులు కల్లయగునె

తే. గీ. సత్యసూక్తిగ పలికిన శౌరి నేడు
మాట దాటుట న్యాయమా? మహిని చూడ
నియమమెవ్వారు నెనరుగ నేర్పగలరు?
భక్తు లవలపు మరచుట పాడి యగునె. 113

ఋతము, సత్యము, ఆనందం వీటి స్వరూపంగ శ్రీరంగ నాథుడు శేషుని పై పవళించి భూమిని కాపాడుతున్నాడు. తన్ను ప్రేమించిన వారిని తానుగ కూడ ప్రేమించి, వారి అభీష్టాలను నెరవేర్చుతుంటాడని, కాబట్టి అన్నింటిని పరిత్యజించి తనయందే ఏకాగ్ర చిత్తమున్న వారిని తానే వేళలయందును వదిలిపెట్టడని సత్యసూక్తిగ చెప్పిన సిద్ధాంతాన్ని తన తండ్రి విష్ణుచిత్తుడు స్వయంగ విన్నట్లు తెలుపుతున్నాడు. కాబట్టి శౌరి గోదా దేవియైన తన్ను తప్పక రక్షిస్తాడని ప్రమాణ పూర్వకంగ పలుకుతు భక్తుల వలపులను మరచిపోవుట న్యాయము కాదని తెలుపుతున్నది.

''సెమ్మైమ్మయుడైయ తిరువరంగర్'' అని ప్రారంభం. భక్తి ప్రపత్తి మార్గాలలో పరాకాష్ఠగ ననుసరించే సిద్ధాంతమిందు సూచింపబడింది. 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అనే భగవద్గీత శ్లోకానికిది వ్యాఖ్యానం వంటిదని పేర్కొన్నారు. కురుక్షేత్రంలో కేశవార్జునులధిరోహించిన రథమే విష్ణుచిత్తుడుగ నవతరించాడని, కాబట్టే, భగవద్గీత ఉపదేశ వాక్యాలను స్వయంగ విని, పెరియాళ్వరుగ నవతరంచినప్పుడా సిద్ధాంతాలను నమలు పరచాడని జనశ్రుతిలో కథనమున్నది. భగవద్గీతలో 'యో యో యాం యాం తనుం భక్తః' అనే శ్లోకానికి పాశురంలోని భావం సమగ్రంగ సమన్వయమౌతున్నది.

## III పరతత్త్వ సత్యము

### విలక్షణ భావాలు

**3:1:1**

సీ. నాస్వభావమునకు నయముగ వేరైన
భావాలు కలిగిన పడతులార!
సులభసాధ్యుడుకాని సుందరాంగుడు వాడు
జిష్ణుని మాయలు చెప్పతరమె?
అనుభవంబులు నావియానందమయ మది
పులకిత భావంబు బోధపడునె
మీ పలుకులునాకు మిథ్యగ నిలిచెగా
చెవిటికి మాటలన్ చెప్పు రీతి

తే. గీ. అనుభవములనా భావంబులరయ లేక
మూగదాని మాటగ మీకు ముగ్ధ మయ్యె
కన్న తల్లిని విడిచి యా కైట భారి
పెరిగెనుయశోద పెంపుడు బిడ్డ గాగ

తే. గీ. మల్ల యుద్ధము గావింప మడిసిరకట
ఘోర రక్కసుల తునిమి వీరుడయ్యె
మథుర నగరము నకు నేను మరలి వెడల
దయను నన్నునుపగ మీరుతరలి రండు. 114

ఇక ఒక్క క్షణమైనను తన నాథుని విడిచి పెట్టి వుండనొల్లనని, వెంటనే మథురా నగరానికి తన్ను పంపించివేయమని మొరపెట్టుకుంటున్నది ఆండాళ్. దానికి కారణాలను కూడ నుడువు తున్నది "ఓ చెలికత్తెలార! వినండి. నాకున్న భావాలు మీకున్న భావాల కంటే విలక్షణమైనవి. నా భావాల కంటే వేరైన భావాలు మీలో వున్నాయి, నా అనుభవాలన్నీ ఆనందమయమైనవి. ఆ పులకిత భావాలు మీకు బోధపడవు. మీరు పలికే మాటలన్నీ చెవిటి దానికి చెప్పే మాటలవలె వ్యర్థాలు. అలాగే నా పలుకులన్నీ కూడ మూగ దాని మాటలవలె మీకు అర్థరహితాలు. కాబట్టి మన సంభాషణలు మూగ వారు చెవిటివారు చేరి మాటలాడుకునే రీతిలోనే వున్నాయి.

ఆ కృష్ణుడు కన్న తల్లిని విడిచిపెట్టి యశోదకు పెంపుడు బిడ్డగ పెరిగి, చిన్న నాడే మల్లయుద్ధంలో రక్కసులను వధించి వీరుడయ్యాడు. ఆ మథురానగరానికి నన్ను పిలుచుకొని తరలండి.

ఆ సుందరాంగుడు సులభసాధ్యుడు కాడు. అతని మాయలను చెప్పతరంకాదు. అని శ్రీకృష్ణుడు జన్మస్థానాన్ని వీడినట్లుగ తాను కూడ తన శ్రీవిల్లి పుత్తూరును వదిలి పెట్టాలని, అప్పుడే శ్రీకృష్ణదర్శనం తనకు కలుగుతుందని పలుకుతున్నది.

"మట్టిరుందీర్కట్కు" అని ప్రారంభం. నాదనామ క్రియ రాగం. ఆది తాళం పాడు కోవచ్చు.

సామాన్యులకంటె విలక్షణ భావాలు భక్తునిలో గోచరించటమే పరతత్త్వ సత్య దర్శనానికి ప్రారంభం. శ్రీ కృష్ణునితో తాను కలిసిపోతున్న ఒక మధురానుభూతిని పొందుతున్నది గోద.

**3:1:2**

సీ. వటువువేషముపూని వామన మూర్తిగ
విశ్వంబు కొలిచిన వేదమయుని
తాపజ్వరముచేత తల్లడిల్లిన నన్ను
చుట్టుప్రక్కలవారు చూచి రమ్మ

సిగ్గు బిడియములు చెందవ్యర్థమగును
తామసింపక మీరు తరలి రండు
బ్రతికించు కొన నన్ను బ్రత్యాశ కలదేని
శీఘ్రమే గోపల్లె, జేర్పరమ్మ
తే. గీ. చిక్కి శల్యమైనది మేను చేవదక్కి
పూర్వ దశయందు నను మీరు పొంద గోరి
రేని వేగంబ నా మాట లిరవులరసి
ఇంపు పాటలు వినబ్రతికించుకొనుడు. 115

''వామనావతారంలో విశ్వాన్ని కొలిచిన వేదమయుని కారణంగ నాలో విరహతాప మతిశయించి నేను తల్లడిల్లుచున్నాను. చుట్టు ప్రక్కల వారికీ విషయం బాగ తెలిసిపోయింది. ఇక మీదట సిగ్గు బిడియం వీటి వలన లాభం లేదు. నన్ను మీరు బ్రతికించుకొనాలనే కోర్కె వున్నట్లైతే, శీఘ్రంగ ఆ గోపల్లెకు నన్ను తరలించుకొని వెళ్లండి. శరీరంలో బలం తగ్గిపోయింది. చిక్కి శల్యమై పోయాను. నా మాటలలోని విషయాన్ని గుర్తించి నన్ను బ్రతికించుకొనండి'' అని తనదైన్య దశను వివరించింది.

''నాణి యినియోర్ కరుమమిల్లై'' అని ప్రారంభం. తనలోనున్న భావా వేశాలన్ని అణగి పోయి, శరీరం తదమ గుణంగ మారిపోయినప్పుడే ఆత్మ నివేదన భక్తి యేర్పడుతుంది.

**3:1:3**

సీ. చిఱుత ప్రాయపునాదు చేష్టలన్నియు చూడ
జనకుడే యెఱుగును చక్కగాను
జనని యెఱుగు బంధు జను లెల్ల నెఱుగగా
మనుగడ గడిపిత మాన్య రీతి
అందరు నన్నెప్డు నాదరించునటులు
విభుని చేరెడి దారి వెడలనిండు
చెప్పిన మాటలు చెవిని పెట్టగ లేదు
బుద్ధి పుట్టినటుల పోయెనానెడి

తే. గీ. నింద కలిగెడి చెయ్దంబు నిలుపరాదు
మాయ లెఱిగిన గోపాల మాధవుండు
తనదు మేనిసో కినటుల తార సిల్ల
ననుభ వమ్ములు కలిగెను యరయగలరె? 116

ఒక్కొక్క అనుభూతిలోను తన్మయత్వాన్ని పొందిన అండాళ్‌పలుకు తున్నది. ''నా తల్లిదండ్రులు, బంధు జనులు అందరూ నా చిన్న నాటి విలక్షణ స్వభావాలను, చేష్టలను నెఱిగిన వారే. అప్పటి నుండి నన్నెంతగానో ఆదరించినవారే. కాబట్టి నాదారిలో నన్ను వెడల నియ్యండి. ఆ విధంగ చేయకపోతే, చెప్పిన మాటలను వినకుండ తన దారిని తాను వెళ్లింది కదా! అనే అపనింద నాకు కలుగుతుంది. ఆ నింద నుండి నన్ను దూరంచేసి, నాకు సహాయపడండి. శ్రీ కృష్ణుని మేను సోకినట్లుగ నాకు ఒక అవ్యక్త మధురాను భూతికలిగింది''.

''తందైయుమ్ తాయుమ్ ఉట్టారుమ్'' అని ప్రారంభం. యౌవన ప్రాయంలో నుండటం చేత తదనుగుణమైన అనుభూతి ఆమెలో కలుగు తున్నది.

**3:1:4**

సీ. సౌందర్య మేపార చక్కని కరమున
చక్రంబు ధరియించి సౌరులలరు
శౌరిమోమునె కాని సరియగు నితరుల
చూడజాలను నేను సూక్ష్మ దృష్టి
కంచుకంబునుగాగ ఘనముగ బూనితి
చిన్న వారల చూడ చిత్తమందు
నేలకో చిక్కిరి యిహమున వీరంచు
కానని రీతిగ కప్పుకొందు
తే. గీ. కుచములనిశంబు పొంగుచు గోప బాలు
చెంత చేరును ద్వారకా సీమయందు

నన్య భూమిని నిలువదోయతివలార!
అసువులున్నప్లై చేర్పుడు యమున దరిని. 117

తన తోటి చెలికత్తెలను చూచి పలుకుతున్నది గోదా దేవి ''అతినలార! వినండి. ఎల్లవేళల ప్రజ్వరిల్లే చక్రాయుధాన్ని చేతిలో ధరించిన ఆసౌందర్య మూర్తి మహా విష్ణువు మోమునే నేనింత వరకు చూచాను. దానికి సరియగు సౌందర్యం మరెక్కడ లేదు. మీ రందరు లౌకిక వాంఛలతో మునిగి పోయిన చిన్నవారు. ఇతరులను చూడలేని ముసుగునుధరించివున్నాను. నా యౌవనోద్రేకంచేత స్తనములు పొంగువారి ఆద్వారకా వాసుడగు గోపబాలుని చేర తపించుచున్నవి. అన్య ప్రదేశములను చేరజాలను కాబట్టి నా ప్రాణాలు నాలో నున్నప్పుడే నన్ను ఆ యమునా తీరానికి చేర్చండి'' అని మిక్కిలి వ్యాకులపాటుతో అర్ధిస్తున్నది.

''అంగ్గై తలత్తిడై ఆళికొండాళ్'' అని ప్రారంభం. శృంగార రసభావం మైపూతగనున్న గురూపదేశ సారమిది. పరమాత్మను తప్ప అన్య విషయము లందు మనస్సులగ్నంకానిస్థితిని ప్రతి జిజ్ఞాసువు పొందాలి. ఒకచో మనస్సు తక్కిన విషయాలపై కోరికను కలిగించే స్థితికి వచ్చినప్పుడు కూడ ప్రబోధకుడు వాటిని లక్ష్యపెట్టక కంచుకాన్ని ధరించిన రీతిగ తన కేంద్రీకృత లక్ష్యంలోనే వుండాలని తాత్పర్యం.

**3:1:5**

సీ. తాపరోగము చేత తల్లడిల్లెడి బాధ
తరచి చూడగలేరు తల్లులార!
ఎ వ్వారు నెఱుగంగ నేపాటి వారలు
మందుమాకులతోడ మాయ మౌనె?
నీల సంద్రపు మేని నిశ్చలాత్ముడతడు
స్పృశియింప నామేన చల్లగానె
తప్పక గుణమౌను తాపజ్వరము లెల్ల
సంశయములు లేవు చక్క వినుడు.
తే. గీ. యమున తీరము గావించెనని తలముగ
నయముగాళీయ ఫణి మీద నాట్యమాడి

కేళి సల్పిన గోపాల కృష్ణుడతని
చెంత వేగమె నన్నును చేర్పుడమ్మ. 118

శ్రీ కృష్ణుని కారణంగ తనలో విరహతాపం ప్రజ్వరిల్లుతున్నది. ఈ విషయాన్ని తన తల్లు లెవ్వరూ గమనించటం లేదు. ఆ నీల వర్ణుడొక్కసారి తన శరీరాన్ని స్పృశించాడంటే తనకున్న రోగం మటుమాయ మౌతుంది. ఆ నాడు యమునా నదీ తీరంలో నున్న చెట్టుపై నుండి కృష్ణుడు నదిలో దూకి కాళీయ ఫణిపై నర్తనం చేశాడు. ఆ యమునా నదీ తీరానికి తన్ను తీసుకొని వెళ్లమని ప్రాధేయ పడుతున్నది.

''అర్కుమ్ ఎన్ నోయిదు అరియలాగాదు'' అని ప్రారంభం.

కాళీయ సర్పం యొక్క దర్పాన్ని అణచిన వాడు శ్రీ కృష్ణుడు. సముద్రము, సర్పము రెండును ప్రాపంచిక విషయాలకు సంబంధించినవి.

**3:1:6**

సీ. కారు మేఘములు కాకాని కుసుమములు
కాయ పుష్పంబులు కమ్మగానే
తామర పువ్వులు తామెల్ల చేరుచు
నాథుని చేరవే నలిన నయన!
యనుచు హృషీ కేశు నండదండల చేర్ప
బాధించు చున్నవి వాసు దేవు
నా యాస మొందుచు నాకటన్ సొలయుచు
సర్వ భోజనముల సమయమనుచు

తే. గీ. దీర్ఘ కాలము గడువగ తేరి పారు
జగతి, భక్తవిలోచను స్థాన మందు
నన్ను చేర్పుడు వేగమే నాథు చెంత
మదన గురుడునా విభుడగు మాధవుండు 119

''నల్లని మేఘాలు, కాకాని కుసుమాలు, కాయ పుష్పాలు, నల్లని ఛాయలను ప్రసరించుతూ, తామర పువ్వులు మొత్తంగ చేరి కలకల లాడుతూ

''నీవు వెంటనే నీ నాథుని చేరిపోవే'' అని నన్ను బాధించుచున్నాయి. ఆ వాసు దేవుని కొఱకు నెంతో బాధపడుతు, వ్రతతపస్సులచే నాకలి వలన సోలిపోతు, సర్వభోజన సమయానికై జగతిలో దీర్ఘకాలంగ నిరీక్షిస్తున్నాను. ఆ భక్తవిలోచనుడుండు తావునకు నన్ను వేగమే చేర్చండి'' అని వివరిస్తున్నది ఆండాళ్.

''కార్తన్ ముగిలుమ్ కరువినైయుమ్'' అని ప్రారంభం. ప్రకృతి అంతా కూడ పరబ్రహ్మ లీలలో పరవశించి వున్నది. ప్రజలు తపోయోగాది వ్రతాలు చేసి ఆకలితో సోలిపోతు, తమ కేనాడు సర్వాన్ని అనుభవించే యోగం కలుగుతుందో అని వేచివున్నారు. అవి విశ్వైకమైన జీవతత్త్వాన్ని తెలియచేసే పాశుర మిది.

**3:1:7**

సీ. అలలతోనున్ననీలాబ్ధి ఛాయల మేని
వర్ణంబు కలిగిన వన్నెకాడు
చల్లగ నందమౌ చక్కని తనదైన
తులసి దామము నేను తొడిగి మరల
నర్పింప ముదముతో నచ్యుతుడుగైకొను
నానాటి మొదలుగ నందె సుఖము
వర్ణంబు మారెను వసివాడె తను వెల్ల
మనసెల్ల గ్లానితో మౌనమయ్యె.

తే. గీ. మాన మున్వీడ పలుకుట మాన్యమగునె
పాలిపోయెను నధరంబు బదులు వినక
రక్కసు ప్రలంబు వధ బలరాము డోర్చె
అట్టి పాండీర వడమున కనుపుడమ్మ. 120

''కడలి తరంగాలవలె నీలపు ఛాయ కలిగిన శ్రీకృష్ణుడు తాను ధరించిన తులసిదామమును నాకీయగ, నేను దానిని వేసికొని మరల నతనికి సమర్పించాను. ఆ దేవ దేవుడెంతో ప్రీతితో దానిని మరల గ్రహించాడు. ఆ నాటి మొదలు నాదేహము వివర్ణమైనది, శరీరం వాడిపోయినది. మనస్సు

శృంగార భావంతో నలసిపోయి మౌనంగ నుండి పోయినది. నేడు మానాన్ని వదిలి పెట్టి నేను పలుకుతున్నాను. అధరాలు పోలిపోయాయి. అలనాడు పాండీర వడమనే ప్రదేశంలో ప్రలంబాసురుని బలరాముడు వధించాడు. ఆ ప్రదేశానికి నన్ను కొనిపొండు'' అని విలపిస్తున్నది.

''వణ్ణం తిరివుమ్ మనం కుళైవుమ్'' అని ప్రారంభం. బలరాముడు అవతార పురుషుడు కాబట్టి అభేదంతో చెప్పి వుండవచ్చు. లేద రామకృష్ణులు సోదరులు కాబట్టి ఆ చోటికైనను తన్ను తరలించమని ప్రాధేయపడింది. కాబోలు. ఈ పాశురం 120వ పాశురం మధ్య మణి సదృశంగ నున్న ప్రధాన పాశురమిది. శ్రీ కృష్ణుడు తనదైన తులసిదామాన్ని ఆమె కివ్వగ, ఆమె దానిని ధరించి మరల శ్రీ కృష్ణుని మెడలో వేసినదట. పరిణయోత్సవంలోని ప్రధానాంశం. ఆండాళ్ చరిత్రలో నతిప్రధానమైనది. 'చూడి కాడుత్త నాచ్చియార్'గ ప్రశస్తిని పొందినది'' తుళా ఎమ్మమ్ మాలై కొండు చూట్ట'' అనేది పాశురంలోని పాదం. ఆముక్తమాల్యదగ నున్న గోదా దేవి వృత్తమిది.

**3:1:8**

సీ. పాపాత్ములైతిరే పరిహసింతురె మీరు
 యాదవ కులజుడై యటవి యందు
సర్వజీవులకును సంరక్షకుండయ్యె
 నలనాడు రోకట నసుర తునుమ
నడుమున త్రాటితో నలుగుచు నోర్పు మై
 బాధల సైచిన పాపడగుచు
ఓరోరి జనులార! యోర్చెను నెవరి కై
 తెలిసికొనగలేరొ తేట పరచి

తే. గీ. ఆల మందకు గోపాల బాలురకును
కేల గొడుగుగోవర్ధన గిరిని దాల్చె
గేలి యయ్యెనే మాధవు లీల మిమ్ము
తూల నాడు దశకునన్ను త్రోయవలదు. 121

గోదాదేవి తన తోటివారల చూచి అడుగుతున్నది. ''ఆ గోపాలుడు యాదవకులంలో పుట్టాడని, చిన్నప్పుడు తల్లిదండింపగ రోకటిని

నడుమునకు కట్టుకుని మద్దిచెట్లుగనున్న రాక్షసులను చంపి విముక్తిని కలిగించాడని, ఆల మందను గోపకులను కాపాడటానికి గోవర్ధన గిరిని పైకెత్తాడని మీకందరికి తెలుసు. వీటిని విని, చూచి మీరు శ్రీ కృష్ణుని చేష్టలను పరిహాసిస్తున్నారు. పాపాత్ములయ్యారు. మాధవుని లీలలన్నీ మీకు గేలితో కూడిన ఆటలయ్యాయి కాబోలు! ఈ విధంగ మిమ్ము నిందించే దశకు నన్ను దిగజార్చకండి'' అని మాధవుని మాయలన్నీ అర్థసహితాలని తెలుపుతున్నది.

''కట్టినమ్ మేయ్క్కిలుమ్'' అని ప్రారంభం. శ్రీ కృష్ణుని లీలలను మననం చేసుకున్నప్పుడవి అన్నీ కూడ నామెకాశ్చర్యజనకాలు, ఆనంద దాయకాలు.

**3:1:9**

సీ. గూటిలో చిలకమ్మ గోవింద! గోవింద!
యనునీదు నామంబు ననుకరింప
వేళకు పండ్లను వేగమే నీయక
యాలసించితినేని యలుక తోడ
లోకాల కొలిచిన లోకైక నాథుడా!
యని పిల్చు రావంబునన్ని దిశల
మారు మ్రోగునుయందామడదూర తీరాల
నిష్ఫల వృత్తితో నింద పొంది
తే. గీ. ఎందుజోక్యములను కూడ నేర్పరచక
శిఖిర భూముల మేడల సీమలందు
ద్వార కాష్ఠల మదికాదె ధన్య వీటి
నన్ను చేర్పుడు మరియొక నెనరు లేక. 122

గోదాదేవి ఎంతో ఆప్యాయంతో చిలుకను పెంచుకున్నది. అది కూడ ఎల్ల వేళల గోవింద నామ స్మరణ చేస్తున్నదట. ఆలస్యంగ దానికి పండ్లు పెట్టినట్లైతే అది వెంటనే లోకాలను కొలిచిన లోక రక్షకుని బిగ్గరగ పిలుస్తున్నది. ఆరావం నాల్గు దిశలు మారు మ్రోగుతున్నది. ఎందులోను జోక్యం కలిగించుకోకుండ అన్ని నిష్ఫలమై పోయే రీతిగ శిఖరాలు మేడలు కలిగిన ద్వారక వెలుగొందితున్నది. 'ఆ సీమకు నన్ను తరలించండి'' అని అంటున్నది.

'కూట్టిల్ ఇరుందు కిలి ఎప్పోదుమ్' అని ప్రారంభం. 'శివుని ఆజ్ఞ లేనిదే చీమైన చిటుక్కుమనదు. అని చెప్పే లోకసూక్తిని జ్ఞాపకం చేస్తున్న పాశుర మిది. చిలుక కూడ తనకు సమయానికి నాహారం దొరకక పోతే లోక రక్షకుని పిలుస్తున్నదట.

**3:1:10**

సీ. అలివేణి యాండాళు యధిపునికామించి
కాంక్షలు మనమున కలిగి యుండి
మథురవీడు మొదలు మంగళ ద్వారకన్
చేర్పింప పెద్దల చేరి కొలిచె
మనసులో భావంబు మర్మంబు లేకయే
సూటిగ పలికెను సూక్ష్మ వృత్తి
మేలిమి బంగారు మేడలుప్పరిగలు
కాంతుల విరజిమ్ము కాలమెల్ల
తే. గీ. విల్లు పుత్తూరు పురముగ వినుతికెక్క
విష్ణుచిత్తుడ నెడి పేర విప్రవరుని
కూతు రచియించె గోదమ్మ క్రొత్త పదము
పాడు వారలకు కలుగు పరమ పదము. 123

ఫలశ్రుతి పాశురమిది. చక్కని కురులు కలిగిన గోదా దేవి మనసులో శ్రీ కృష్ణుని కామించి మధురానగరం మొదలు ద్వారక వరకు, శ్రీ కృష్ణుని దర్శించటానికి తన్ను పిలుచుకొని వెళ్లమని పెద్దలనందరిని ప్రార్థించి పాడిన పాశురాలివి. మనసులో నెట్టి మాయమర్మాలు లేదు. మేలిమి బంగారు మేడలు కలిగిన శ్రీ విలుపుత్తూరులో విష్ణు చిత్తుడనే విప్రుని కుమార్తె గోదా దేవి పాడిన పాశురాలివి. పాడిన వారికి పరమ పదము లభించటమే ఫలితం.

'మన్ను మధురై తొడక్కమాగ' అని ప్రారంభం. ప్రతి ఫలశ్రుతిలోను ఊరు తండ్రి పేరు స్మరించటం కనిపిస్తున్నది.

కృష్ణుడనే

**3:2:1**

సీ. నల్లని కృష్ణుడు నానాథు తలపుల
చింతల పడియుండు చిత్తమెపుడు
నోరగ నిలుచుండి యొక్కింత దయ లేక
మీరెల్ల నాస్థితిన్ మేల మాడి
బాధల వ్రణమున పాదరసము వంటి
పుల్లని రసమును పోయు చుంద్రు
లేమల కష్టాలు లెక్కలోనివి కావు
గోవిందు డెప్పుడు గోప ప్రియుడు

తే. గీ. వక్ష మందు పీతాంబర వస్త్రమది గొ
వేగ వనమాలి దరినుండి విధిగ తెచ్చి
విసరి నాతాపముల తీర్ప వేగరండు
అలసి సొలసిన నా మేను యలుపుతీరు. 124

చెలులందరు దూరంగ నిలబడి గోదా దేవి బాధలను, అవస్థలను చూచి ఏవో మాటలాడుకుంటున్నారు. వాటిని విని ఆ యువతి బాధపడుతు ''చెలులార! నా చిత్తమెప్పుడో నా చెలికాడు శ్రీ కృష్ణునకు వశమై పోయినది. మీరందరు నా స్థితిని చూచి వ్రణంలో పుల్లని రసాన్ని పోసినట్లుగ మాటలాడుతున్నారు. నా బాదల నెరిగిన వాడు గోవిందుడు. కాబట్టి మీరు పరుగున వెళ్లి అతని రొమ్ము మీద వ్రేలాడుతున్న పీతాంబరాన్ని తీసికొని వచ్చి నా తాపం తీరేటట్లుగ నాకు విసరండి'' అని దోహద క్రియకు మార్గాన్ని చూపిస్తున్నది.

''కణ్ణన్ ఎన్నుమ్ కరుందెయ్వమ్'' అని ప్రారంభం. సారూప్య స్థితిని పొందటానికి పరమాత్మలోనున్న సాధనాల నపేక్షిస్తున్నది. వనమాలి నుండి చల్లని పీతాంబరాన్ని అర్థిస్తున్నది ఆ ప్రణయని. భైరవి రాగం - ఆది తాళంలో పాడుకోవచ్చు.

3:2:2

సీ. వట పత్రశాయిగ వన్నె చిన్నెల తోడి
పాలు గారెడి చిన్ని పాపడతని
మాయపాశమునకు మరలెను చిత్తంబు
శూలంపు మాటల సూటి పోట్ల
నుపయోగమును లేదు యువిద లారా! మీరు
జరుప నున్న విధమున్ జరిపి వేగ
శీఘ్రంబ తరలుడు శ్రీ కుదైం దైయూరు
సేవ్యుడై యున్నాడు శేషశాయి

తే. గీ. చేతకోలతో పశువుల చెంత నిలిచె
పాల కుండతో నాట్యాల భంగిమముల
చల్లని తులసీ దామము చక్క చుట్టి
తులసి యిచ్చిన నా బాధ తొలగుకాదె. 125

ఆండాళ్ తన కండ్ల ముందర కనుపించే కృష్ణుని వర్ణించి చెలులతో చెప్పుతున్నది. వట పత్రశాయిగ పాలు గారె పసి బాలుడుగ నున్నాడట. శ్రీ కుడైందై యూరులో శేషశాయిగ కొలువు తీరివున్నాడు. చేతిల కోలను పూనిన పశువుల కాపరి అతడు. పాలకుండను నెత్తిన పెట్టుకొని వివిధ నాట్య భంగిమలను చేస్తున్నాడట. అట్టి మాయగాని పాశంలో తన మనస్సు చిక్కుకున్నది. చల్లని తులసీ దామాన్ని చుట్టు కొని వున్నాడు. ఆ తులసిని ఒక్కసారి తన కిచ్చినట్లైతే తన బాధలు తొలగి పోతాయని అర్థించింది.

''పాల్ ఆలిలైయిల్ తుయిల్ కొండ'' అని ప్రారంభం. పీతాంబరాన్ని అడిగింది చల్లని తులసీ దామాన్ని అడుగుతున్నది. సాధన సామగ్రుల వేడుకొనుతున్నది.

3:2:3

సీ. కంసుని వధియించె కమనీయ చాపంబు
బోలు చక్కని కను బొమల వాడు

చూపుల బాణంబు చోద్యమై నను జేర
నిరువైపు రెక్కల నిరవులమర
సూటిగ మనసులో చొచ్చిన వేళయే
కాంత మా నా మేను కమరి పోయె
భయము లేదికనీ కభయంబు నిచ్చితి
ననెడి పలుకుచాలు నాశ్రితులకు

తే. గీ. వక్షమందూగు వనమాల వాసమీయ
నాకు దయయుంచి కలుగంగ న్యాయమదియె
మీరు కొనివచ్చి వక్షము మీద నాదు
యిటు నటు త్రిప్పుడు తపన మింకునటుల. 126

శ్రీ కృష్ణుని సామాగ్రుల నొక్కక్కటిని తనకు సమర్పించినట్లైతే, తన తాపజ్వరం తగ్గిపోతుందని ఆండాళ్ నమ్మకం. అలనాడు కంసుని వధించిన ఆ కృష్ణుడు తన కమనీయ చాపము వంటి కను బొమలలో సూటిగ తన చూపులనే బాణాలను తన మీదికి అనుసంధించాడు. ఆ బాణాలకిరువైపుల రెక్కలున్నాయి. ఆ బాణాలు తన హృదయంలో చొచ్చినది మొదలు అందమైన తన శరీరం కమరిపోయింది. ఒక్కసారైన తన స్థితిని గుర్తించి ''నేను తప్పక అనుగ్రహిస్తాను. భయపడవద్దు'' అని ఆశ్రయించిన తనవంటి వారి కభయ ప్రదానం చేసినట్లైతే, అదే చాలు. అతని ఉరస్సున వ్రేలాడుతున్న వన మాలను తెచ్చి తన వక్షస్థలంపై అటునిటుగ త్రిప్పితే తన బాధలు తొలగిపోతాయని వివరిస్తున్నది.

'కంజై కాయ్ంద కరువిల్లి' అనేది ప్రారంభం. సాధన సామగ్రుల ప్రాప్తి సారూప్య దశకు మూలం.

**3:2:4**

సీ. గొల్లవారలనెల్ల కొల్లగొట్టుస్వామి
యాదవ మహిషమై యువని మీద
పడవేసి త్రొక్కుచు పలురీతి బాధల
నన్ను పెట్టుచునుండు నలుగునటుల

సడలెను దేహంపు జవ మెల్ల నిశ్చల
స్థితిలోనన్నియు చేరిపోయె
నన్ను రక్షింపగ న్యాయమై యెవ్వరు
కలవారనెడిచింతకానవచ్చె
తే. గీ. అమృతమును చిందుపగడంపుట ధరమందు
తనివి చెందని సుధలను తత్క్షణంబె
తెచ్చి నాపై చిలకరించి తేర్పు డమ్మ
తాప మింకను నేనిక తాళలేను. 127

గొల్లవారందరికి కులదైవమైన ఆ గోపాలుడు యాదవకులంలో గొప్ప మహిషంగ నవతరించి తన ఆటల చేతను, చేష్టలతోను గోదా దేవిని పడ ద్రోసి, త్రొక్కుచు నలిగిపోయేటట్లు బాధించటం వలన నామెదేహంలో బలం లేక నిశ్చల స్థితిని పొందినదట. ఆమె నా స్థితి నుండి రక్షించటానికెవ్వరు సాహసించటం లేదు. అతని పగడంపుటధరాలలో తనివి చెందని అమృతం జాలువారుతున్నది. దానినెవ్వరైన పుణ్యాత్ములు తెచ్చి తన మీద చిలుకరించినట్లైతే తన బాధలు తొలుగుతాయట.

''ఆరే ఉలగత్తు ఆఱ్రువార్? ఆయర్ పాడి'' శృంగార చేష్టలలో నిశ్చల సమాధి స్థితి చివరిది. దానినే ఆ నాయిక అనుభవిస్తున్నది. నాయకుని మహిషంతో నారోపించటం కూడ కావ్య లక్షణమే. మహిషం పెట్టె బాధలన్నీ కూడ ప్రాపంచింకంగ జీవుడనుభవించే ఆవేదనలు.

**3:2:5**

సీ. విలపించినను నెట్టి విన్న పాల్సేసినన్
కనరాడుప్రియుడు నా కనుల ముందు
పీడుము భయమును విస్రంభ వాక్యంబు
వినిపింప డేలకో వింత గాను
శీఘ్రంబ యిట వచ్చి శృంగార లీలల
మురిపించి ముద్దులన్ ముంప డేల
కటకటా! పశుల కాపరి యుటజము
నందుండి వెలివచ్చి యందమైన

తే. గీ. గ్రోవి యూదెడి వేళలో గ్రోవి రంధ్ర
మందు చిందెడి నమృతంపుటధరసుధల
తెచ్చి నామోము తడిచేసి తీర్పుడమ్మ
గోప బాలుని యనుభూతి కలుగ నిండు. 128

ఎంతగా విలపించినా, విన్నపాలు పలికినా తన స్వామి తనకు కనిపించలేదు. ''నీకెట్టి భయం లేదు, నేను నిన్ను ఆదరిస్తాను'' అనే ఒక్క నమ్మకంతోడి మాటలను కూడ వినిపించటం లేదు. శృంగార లీలలతో తన్ను వేగంగ వచ్చి కౌవలించుకొని ముద్దుల వర్షాన్ని కురిపించటం లేదు. పశుల కాపరిగ, పొదరిండ్లలో దూరి పిల్లన గ్రోవి వూదుతుంటాడు. అతని అధరంలో నుండి పిల్లన గ్రోవి రంధ్రంలో దూరిన ఆ సుధను తెచ్చి తన మోముపై చిలుకరించినప్పుడు తనకా శృంగారా నందానుభూతి కలుగుతుందట.

''అళిలుమ్ తొళిలుమ్ ఉరుక్కా-ట్టాన్'' అని ప్రారంభం. ఊహించిన ఆనందానుభూతిని యధార్థంగ పొందాలనే ఆకాంక్ష యిందులో వివరింపబడింది. మధుర భక్తిలోని అంతరార్థానికికూడ నిది అన్వయ మౌతున్నది.

**3:2:6**

సీ. లౌకిక బంధాలు లవమైన నెఱుగని
కర్కశ కఠినుడు కరుణ లేని
నంద నందనుడమ్మ నారాయణుండు నా
నాథుడై పడవేసి నలిపి త్రొక్క
ఒక వైపు నొదుగుట కోర్పు లేని స్థితి
నున్నదానను కదా! యువిద లార!
కృష్ణుండు నడయాడు కెంజాయ పాదాలు
సోకిన భూమిలో చూర్ణమైన
తే. గీ. ధూళి కొనివచ్చి మేనెల్ల తుడువుడమ్మ
నిండు నసువుల నైనను నిలుపు కొందు
శైత్య సేవలు చేయుడు చల్ల గానె
ప్రాణపథముల నాదుకా పాడురమ్మ. 129

తన యందే మాత్రం దయ లేక ప్రవర్తిస్తున్నాడు తన వల్లభుడు. తన ప్రేమ బంధంలో తనను నలిపి, అలిసిపోయేటట్లు చేసి, నిర్వీర్యమైన దశకు త్రోసి వేశాడు. అతనికి లౌకిక బంధాలు లేవు. కాబట్టి అందలి బాధల నతడెఱుగడు. కృష్ణుడు నడయాడిన అతని కెంజాయ పాదాలు సోకిన నేలలోనున్న దుమ్మును తీసికొని వచ్చి తన శరీరంపై అలిది శైత్యోపచారాలు చేసిన కాని తన ప్రాణం నిలువదట అని తన మనోగత భావాలను స్పష్టం చేస్తున్నది గోదా దేవి.

''తడై యొన్రు ఇల్లా ఉలగత్తు నంద గోపన్'' అని ఆరంభించే ఈ పాశురంలో దాస భక్తి అభివర్ణింపబడినది. పాద రేణువును అలదు కోవాలని భక్తుల తపన. సారూప్య సంసిద్ధికివి అన్నీ సోపానాల వంటివి.

**3:2:7**

సీ. విజయంబు లిచ్చెడి వినతాసుతధ్వజ
మారోహణ మొనర్చునచ్యుతుండు
వైకుంఠ లోకంపువరుసల నెక్కక
భువివాని కొడుకుగా పొందె నొకతె
బోధల నిసుమంత బుద్ధిని చేర్పక
వేపగింజగ వాని పెంచె కాదె
పుట్టిన దాదిగ భువిని దోషము లేక
కుచములు నావెల్ల కోర్కెపొంగె

తే. గీ. నిత్య యౌవన సౌందర్య నిలయుడతని
కొమ్మ లను బోలె భుజముల కొప్పులందు
దోష ముల్తీర కుచముల దోయి నదుమ
పిలువ నంపుడు వేగమే ప్రీతి కలుగ. 130

''విష్ణుమూర్తి గరుడధ్వజుడుగ వాసిగాంచినవాడు. వైకుంఠాది పద ప్రాప్తి లేకనే ఒకర్తె అతనిని కొడుకుగ పొంది, ఏ మాత్రము బుద్ధి నేర్పించక, వేపగింజవలె పెంచింది. నేను నా యౌవ నారంభంలో నుండి అతనినే వలచివున్నాను. కాబట్టి నాకు తెలియకనే నా కుచ ద్వయములు, అతనిని

కాంక్షించి ఉప్పొంగసాగాయి. నిత్య యౌవనంలో వెలుగొందు, ఆ సౌందర్య మూర్తి కొమ్మల వంటి భుజముల కొప్పులతో, నా వక్షోజాలను నదిమి, నా బాధలను తీర్ప మని చెప్పి, వేగంగ నీ చోటికి పిలుచుకొని రండి'' అని సఖులతో నివేదించింది గోదా దేవి.

''వెట్టి కరుళ క్కొడియాన్'' అని ప్రారంభంలో నున్న పాశురం. శృంగారరస నిష్ఠమైనదిగ నున్నది.

**3:2:8**

సీ. మనసులో మరుగుచు మ్లానమై పోయితి
బ్రతికియున్నద? మరిబ్రతుక లేద?
యనెడి చింతలు లేశమైనను లేద కొ
కొల్లగొంటివి నన్ను గోప విభుడ!
చిలిపి చేతలవాని చిన్నెలెన్నిన వాని
పశువుల పాలించు బాలుడతని
కనులార యాకృష్ణు కాంచగ లేనిచో
తత్క్షణంబుగ నేను తరలి వెడలి

తే. గీ. తాప పీడిత కుచముల తత్క్షణంబె
రూపు మాపివాటికి గల రొదల తీర్చి
పెకలి పారవై తును కృష్ణు పేరురమున
దుఃఖ మెల్లను నికనైన దూర మగునా. 131

ఎల్లవేళల యందు శ్రీకృష్ణుని ధ్యానిస్తున్నదన్న విషయం గోపాలునకు కూడ తెలుసు. ఆమె తన వలపులో చిక్కుకొని బ్రతికినదా లేదా అనేచింత కూడ లేకుండ తన చిలిపిచేష్టలతోను, పశుల కాపరిగ తిరుగుతున్నాడు. అతనిని కన్నులార చూడలేని పరిస్థితులో తానే వెడలి, అతని ఆలింగన సౌఖ్యం కోసం పరితపిస్తున్న స్తనద్వయాన్ని పెకలించి, అతని ఉరస్సు మీద పారవేసినప్పుడే తనలోని దుఃఖం అణగి పోతుందని కలవరపాటును చెందుతున్నది.

''ఉళ్లే ఉరుగినైవేనై ఉళ్లో'' అని ప్రారంభం. లౌకిక విషయ వాంఛలనన్నింటిని పెకలించి ఆసర్వేశ్వరుని మ్రోల పార వేసిన గాని మనశ్శాంతి లభించదనుట అంతరార్ధం. గోదా దేవిని ఆమె తల్లులందరూ అను నయస్తూ, శరీరభోగాలతో కృష్ణుని సంధించటం దుర్లభం. దానికతీతమైనదే ఆత్మజ్ఞానమని ప్రబోధించగ నామె దానిని కాదనే యిట్టి మాటలపలికినట్లు వ్యాఖ్య.

**3:2:9**

సీ. గుబ్బల చనుదోయి గూఢంపు బాధల
పోకార్చు కొనుటకై పుణ్య విధుల
కమల నాభునకును కైంకర్య మేదేని
యీ జన్మ మందేని యీయ వలయు
వదలి వేసిన చోట వరలంగ వేరొండు
కలదుకలదనుట కల్లకాదె
భువన మోహనుడైన పుండరీ కాక్షుని
వక్షమందును నాదు వలపు చనుల

తే. గీ. నొత్తు కొందుగా శ్రీహరి యుల్ల మందు
నన్ను నామోము నొకపరి నయముగాగ
చూచి నను చేతవలదను సూక్తి యొకటి
చెప్పి నను చాలు దరినినే చేరరాను. 132

''యౌవ నోద్రేకం వలన నా వక్షోజాలు బాధనను భవిస్తున్నాయి. ఆ విష్ణుమూర్తి కీ జన్మ మందే ఏదో ఒక కైంకర్యాన్ని చేసి పుణ్యాన్ని సంపాదించాలి. దీనిని వదిలిపెట్టినట్లైతే వేరొక చోట ఈ భాగ్యాన్ని పొందవచ్చు అనుకోవటం కేవలం భ్రమ మాత్రమే. ఆ సుందరాంగుడగు శ్రీకృష్ణుని నాస్తనములతో వక్షమును నొత్తుకొందును గాక! అట్టి వేళ ఆ కృష్ణుడు నా మోమును తిలకించి, ''ఇక నీవు నాకు వలదు'' అని ఒక్క మాట చెప్పినట్లైతే చాలు, ఇక అతని చెంతకు నేను వెళ్లను'' అని తన మనస్సులో తోచిన భావాలనన్నింటిని తెలియచేస్తున్నది.

''కొమ్మై ముల్లైగళ్ ఇడర్తీర'' అని ప్రారంభం. శృంగార రసాత్మక పాశురమిది. ప్రణయ భావంలో గోదా కృష్ణుల రూప చిత్రణ చేయబడింది.

**3:2:10**

సీ. చాపంబు బోలెడి చారు భ్రుకుటిగల
శ్రీవిల్లి పుత్తూరు సీమయందు
విష్ణుచిత్తుడనెడి విప్రవరుని కూతు
గాగ వెలసినట్టి ఘనత వలన
నాండాళు జన్మించె నామెకార్తికలిగె
పరమపురుషుడు గోపాలు వలన
మంగళ జ్యోతియై మహిని బ్రోచిన నాథు
పదముల పాడెనీ పాశురముల

తే.గీ. పాడి పరవశించిన వారు పరమ సుఖము
పొంది జగతి ఖేదము నుండి పూర్ణముక్తి
కలిగి జగదీశు పదముల కలిసి నిలుతు
రనెడి వాక్యంబు సత్యంబు లరసి చూడ. 133

ఫలశ్రుతి పాశురమిది. చాపంవలె చక్కగ తీర్చిదిద్దిన కనుబొమలు గల ఆండాళ్, శ్రీ విల్లిపుత్తూరులో విష్ణు చిత్తునకు కుమార్తెగ జన్మించి, మంగళ జ్యోతి స్వరూపుడగు ఆ సర్వేశ్వరుని గురించి పాడిన పాశురములివి. ఈ పాశురాలను పాడిన వారు లౌకిక బాధల నుండి ముక్తిని పొందగలరు. జగదీశుని పదములను చేరుకొనగలరు. ఇది సత్య వాక్కు.

''అల్లల్ విళైత్త పెరుమానై'' అని ప్రారంభం. ఫలశ్రుతిలో ఊరు, తండ్రి, తన పేరు వీటి గురించిన ప్రస్తావన వున్నది.

## కృష్ణదర్శనం

**3:3:1**

సీ. నల్లని వృషభము నడయాడి బలరాము
వెనువెంట తిరుగాడు వీధి వీధి

నాకులలములను హాయిగ మేయుచు
నావు దూడగ కడు నాడు కొనెడి
శ్రీ కృష్ణకంటి రే చెంగల్వ నేత్రుని
నల్లని కృష్ణుడు నాదు విభుడు
కోర్కెతో పశువుల గోముగ నిమురుచు
నదుపులో వానిని నడ్డగించి

తే. గీ. నీరు త్రాగించి కసువుల నెమర వేసి
యలసి పోవక వానితో నాడు కొనెడి
కేశవునికి బృందావన కేళులివియె
యనుచు విందును చూడంగ నాశ కలిగె. 134

''బృందావన వీధులలో హాయిగ బలరాముని వెనుక వృషభం వలె నడయాడుతున్నాడు నల్లని బాల గోపాలుడు. వారిరువురు నొకరి వెనుకనొకరు ఆవు దూడలవలె నడచివస్తున్నారు. పశువులను గోముగని మురుతు, నీరు త్రాగిస్తు, కసువులను తినిపిస్తు ఆడుకుంటున్నాడు కృష్ణుడు. అతని లీలలే అవి. ఆ ముగ్ధమనోహర రూపాన్ని చూడాలనే ఆకాంక్ష నా మనసులో మెదలుతున్నది'' అని మనో నేత్రాలతో శ్రీ కృష్ణుని దర్శనాన్ని పొంది అనందానుభూతితో పలుకుతున్నది గోదా దేవి.

''పట్టిమే య్న్దోర్ కారేఱు'' అని ప్రారంభం. కృష్ణ సాక్షాత్కారంతో పరవశిస్తున్నది ఆండాళ్.

**3:3:2**

సీ. విలపింపఁజేయుచు వీడిపోయెను నన్ను
గొల్లవారలతోడ కూడుకొనియె
పాలువెన్నలకడుపారమెక్కుచుమేన
వాసనల్ వీచెడి వన్నె కాడు
చిన్ని వృషభమను చిన్నారి కృష్ణుని
గోవర్ధనధరుని గోప విభుని

కన్నులారంగ మీరు కనుగొంటి రోయమ్మ
మెఱపు తీగ లెపుడు మేఘములను
తే. గీ. వీడి పోవని చందంబు విశ్వమూర్తి
కాంతు లీనెడు వనమాల కలిసిపోవ
వేయి బాలురు తనతోడ వెలయునటుల
చేరి బృందావనమున చూచితిమికాదె. 135

ఆండాళ్ ఆత్మలో దర్శించిన శ్రీ కృష్ణుని గురించి వర్ణిస్తున్నది. ''సుదతులార! నన్ను ఏడిపించి, నన్ను వీడిపోయాడు నానాథుడు. యాదవకులంలో గోపాలురతో చేరిపోయి, పాలు వెన్నలను కడుపార తింటు, ఆ వెన్న వాసన తన శరీరంలో వీస్తుండగ, చిన్ని ఎద్దువలె నా గోపాలుడు తిరుగాడుచున్నాడు. మీరతనిని చూచారా? బృందావనంలో తన ఈడులో నున్న గోపాలురతో చేరి ఆడుకుంటున్నాడు. నల్లని మేఘంలో బంగారు ఛాయల మెఱపుతీగదోబూచులాడుతున్నట్లు, ఆ నల్లని స్వామి మెడలో వనమాల అటు యిటుగ ఊగిసలాడుతున్నది. ఈ దృశ్యాన్ని నేను చూచాను కదా!''

''అనుంగ ఎన్నై పిరివు సెయ్దు'' అని ప్రారంభం. కన్నులకు కట్టినట్లున్న ఈ వర్ణనలో ఆండాళ్ పొందిన సాక్షాత్కార సంఘటన కనిపిస్తున్నది.

**3:3:3**

సీ. యాదవ కులమున నాశల నింపిన
వ్యామోహ రూపుడై వరలు వాడు
గుణపూర్ణుడితరుల కోర్కెల కలిగించి
వలపుల పొంగించు వన్నెకాడు
నమ్మశక్యము కాని నైపుణ్య రీతియ
సత్యము లెన్నియో శంక లేక
యల్లుచిలిపి వాని యట నిటకంటిరే
సూర్యకిరణముపై సోకనటుల

తే.గీ. వైన లేయుడు తనదైన పక్షములను
విష్ణు మూర్తికి నీడల విస్తరించె
పక్ష ములక్రింద పయనించు పరమమూర్తి
చెలగు బృందావనమున చూచితిమి కాదె. 136

''యాదవ కులంలోనే అందరికి మురిపాల బాలుడతడు. గుణ పూర్ణుడు. సకల జనుల యందు ప్రణయభావాన్ని నింపెడి సౌందర్యమూర్తి. నమ్మటానికి వీలులేనట్లుగ ఎన్నో అసత్యాలను పలికి చిలిపితనంగ ప్రవర్తించే ఆ చిన్ని గోపాలుని చూచారా? అతనిపై సూర్య తాపం సోక కూడదని గరుత్మంతుడు తన రెక్కలను విస్తరించగ, ఆ నీడలో విష్ణుమూర్తి ప్రయాణం చేస్తున్న దృశ్యాన్ని బృందావనంలో చూచాను'' అంటున్నది ఆండాళ్.

''మాలాయ్ పిఱంద నంబియై మాలే'' అని ప్రారంభం. గరుత్మంతుని నధిరోహించినట్లుగా కాక విష్ణుమూర్తికి గొడుగుగ తన పక్షాలను విస్తరించగ ఆ నీడలో ప్రయాణం చేస్తున్న పరమపురుషుని బృందావనంలో చూచిందట. ప్రశ్నోత్తరాల మాలికగ మలచిన పాశురాలివి.

**3:3:4**

సీ. చల్లని యందమౌచక్షువులవి కెంపు
తామర చూపుల త్రాళ్ల చేత
బంధించి నన్నెంతో బలమున లాగుచు
కుదిటిలోభావాల కొల్లగొనియె
నల్లరి శ్రీకృష్ణుడగుపించి నాడొకా
కనుపించెనె కనుల కరువు దీర
చెమట బిందువులెల్ల చెన్నుగా తన మేన
ముత్యాల సొబగున మురిసి నిలువ

తే.గీ. పైన ముత్తెపు వరుస యంబరముతోడి
పిన్న యేనుగు నడయాడు ప్రీతి వోలె
చెలగె నటులబృందావన సీమలందు
కనుల కాంచితి కమ్మగ కరువు దీర. 137

''చల్లని తామర పూవుల వంటి చూపులు కలిగిన గోపాలుడు తన చూపులనెడి త్రాళ్లతో నన్ను బంధించి వేసి, నా వలపునంతటిని తనవైపు లాగుకొన్నాడు. ఆ అల్లరి కృష్ణుడు కనిపించినాడా? చెమట బిందువులతో నందగించిన కృష్ణుడు ముత్యాల అంబరాన్ని ధరించిన గున్న యేనుగువలె నడయాడుతు బృందావన సీమలో విహరించటాన్ని కనుల కరువు తీరునట్లుగా నేను చూచాను'' అని తాను దర్శించిన మూర్తి విశేషాన్ని వివరిస్తున్నది ఆ భక్తురాలు.

''కార్తణ్ కమల కణ్ణెణుమ్'' అని ప్రారంభం. ప్రశ్నోత్తరీయ పాశురాల పరంపర అది. తామున్న శ్రీవిల్లుపుత్తూరు సీమల యందు శ్రీ కృష్ణుని అన్వేషించటం ఒకవైపు సౌందర్య శోభతో దర్శన ప్రాప్తి కలగటం మరోవైపు. ముత్యాల అంబరాన్ని ధరించిన ఏనుగవలె నడచి వస్తున్నాడట మురారి.

**3:3:5**

సీ. మాధవుడలనాటి మణివోలె పిడికిట
భద్రమై నా చేత పట్టుబడియె
వలయందు చిక్కని వారాహమును పోలె
నంగము లేవియు నందకుండ
స్వాతంత్ర్యమూర్తి యా సర్వేశ్వరుని మీరు
కాంచినారెందైన కనుల యెదుట
కనకాంబరముపైన కాంతమై ధరియింప
నడుగుదో యినది జీ రాడుచుండ

తే. గీ. కారు మొయిలు వోలెనడచి కమ్మగాను
వీధి నడయాడు వింతగ వీచికలను
కలదు కనుగొంటి మమ్మరో కమల ముందు
చెలగె నటుల బృందావన సీమలందు. 138

తన వాసస్థానంలోనున్నప్పుడు శ్రీ కృష్ణుడు తన చేతి పిడికిట మణివలె పట్టుబడి పోయాడు. కాని అతని అంగము లేవి కూడ తనకు వశం కాలేదు. వలలో చిక్కని వరాహం కదా! ఆ విష్ణుమూర్తి. ''అతని స్ఫుర

ద్రూపాన్ని మీరెందైన చూచారా? నేడు బృందావనంలో నల్లని మేఘంవలె పీతాంబరం పాదాల వరకు జీరాడు తుండగ నడయాడు తున్నాడు. ఆ కృష్ణుని నేను చూచాను'' అని స్మరించుకుంటున్నది గోదాదేవి.

''మాదవన్ ఎన్ మణియినై'' అని ప్రారంభం. స్వయం ప్రకాశమైన లసన్మణి ఆ సర్వేశ్వరుడు స్వాంతంత్ర్యమూర్తి. సారూప్య దశను నందుకోవ టానికతని అంగము లేవి కూడ తనకు వశం కాలేదనే తపన యిందులో కనిపిస్తున్నది.

**3:3:6**

సీ. ధర్మ న్యాయములను తరచిచూడని వాడు
దుండగముల చేయు దుష్టుడతడు
తనదుచేత ధరించు ధనువు శార్ఙ్గమటుల
వంగిన కన్బొమల్వన్నెకాడు
సౌందర్య మూర్తిగ చాపల్యస్థితి వాని
కంటిరే యెందైన కనుల ముందు
నల్లని మేనితో నయమొప్పు కెంజాయ
నెమ్మోము కలవాడు నీల వర్ణు

తే. గీ. తూర్పు కొండపై నడయాడి తొంగి చూచు
బాల భానుని తేజమై పరగువాని
సూర్య బింబము తానయై చోద్య మంది
చెలగె నటగబృందావన సీమలందు. 139

ధర్మ న్యాయాల కధపతియైన ఆజగదీశ్వరుడు నేడు వాటిని విస్మరించి దుండగపు పనులలో నిమగ్నుడయ్యాడు. తన చేతిలో ధరించిన విల్లువలె అందమైన కనుబొమలు కలిగిన సౌందర్యమూర్తిని ఎవరైనను చూచారా? అని పలుకుతు, నల్లని శరీరం కలిగిన ఆ కృష్ణుని ముఖము అందంగ నెఱ్ఱగ నుంటుందని. నల్లని తూర్పు కొండలో ఉదయించే బాలభానుని వలె నుంటాడని ఉపమానంతో వర్ణించింది, ఆ సూర్య బింబమే తానై వెలుగొంది బృందావన సీమలో ప్రకాశిస్తున్నట్లు అందరు చెప్పగ విన్నదట గోదాదేవి.

''తరుమమ్ అఱియా కుఱుంబన్లై'' అని ప్రారంభం. సూర్య నారాయణుని ప్రస్తుతి వున్నది.

**3:3:7**

సీ. పరిపూర్ణ గుణుడుగా భవ్యమై వెలిగెడు
నల్లని తనువుతో నల్లనయ్య
లోని ఛాయలును వెలుపలనొక్క విధమై
మనసుతప్పినిలిచె మాధవుండు
నల్లని మేఘమై నడయాడు ఘనముగా
కాంచినా రొకొమీరు కనుల ముందు
ననురాగ రసములో నంబర వీధిని
తారకా నివహంబు తార సిల్లు
తే.గీ. భంగి మండలాకారుడై భద్రమూర్తి
రాగ దీప్తిగ మోహన రాస కేళి
వన మదియెగ బృందావన వాటియందు
కలడు నాస్వామి కృష్ణుండు కాంత ప్రియుడు. 140

పరిపూర్ణ శోభాయమానమగు గుణముతో వెలిగెడి ఆనల్లనయ్య తన శరీర చ్ఛాయవలె మనసునందును ఆ నలుపు దనంతోనే కూడి మనసు విడిచి ప్రవర్తిస్తున్నాడు. ''నల్లని మేఘంవలె నడయాడుతున్న నా కృష్ణుని మీరెవరైన చూచారా?'' అని అడుగుతున్నది ''బృందావనంలో మోహన రాసకేళిలో తారకలు చేరిన గగనంవలె నాకు కనిపించినాడా గోపికా లోలుడు'' అని తనకు లభించిన సాక్షాత్కార సౌభాగ్యాన్ని వివరిస్తున్నది.

''పొరుత్తముట్రై య నంబియ్లై'' అని ప్రారంభం చక్కని ఊహాజనిత భావ చిత్రం వర్ణింపబడింది. ఆకాశానికి, తారకా నివహానికున్న సంబంధమే పరమాత్మ జీవాత్మలకున్న సాన్నిధ్యమనుట సూచింపబడింది.

**3:3:8**

సీ. ధావళ్యమేపార ధరియించె శంఖంబు
పాంచజన్యమనెడి భద్ర దీప్తి
పీతాంబరముకట్టె పేశల వస్త్రమున్
చక్రంబు చేబూనె సమర కేళి
కారుణ్య మూర్తి యా కమలాయతాక్షుండు
కనిపించి నాడొకొ కాంతలార!
మధుపంబు పూదేనె మత్తుగ గ్రోలు పూ
గుత్తుల తురుము ముంగురుల వాడు.

తే. గీ. అందములు చిందనటునిటు నాటలాడు
ముంగురుల శోభ కదలాడ మురియు వాడు
కనుల ముందట నిలిచెనొ కరువు దీర
వనము నదియు బృందావన వాటి యందు. 141

శంఖ చక్ర గదాధారియై పీతాంబరాన్ని ధరించిన శ్రీ మహా విష్ణువు రూపాన్ని ఊహించు కాని, ''అట్టి కారుణ్య మూర్తి మీకు కనిపించి నాడా?'' అని అడుగుతున్నది. కాని తానొక సౌందర్య శ్రీ కృష్ణ స్వరూపాన్ని బృందావనంలో చూచినదట. అందమైన ముంగురులలో పూగుత్తులు ధరించిన వాడును, ఆ ముంగురులు అతని అందమైన భుజాలపై కదలాడుతుండగ, అందలంకరించిన పూవులందలి తేనెకై మధుపాలు ముసురుతుండగ, ఆ కృష్ణుడు తన కనుల ఎదుట కనిపించినాడట.

''వెళియ సంగొన్దు ఉడైయానై'' అని ప్రారంభం. చక్కని భావరూప చిత్రాన్ని వర్ణించిన కావ్య దృష్టి యిందు కనిపిస్తున్నది. వైష్ణవ సిద్ధాంత ప్రకారంగ మహా విష్ణువు సంపూర్ణ స్వరూప వర్ణనమిందు గోచరిస్తున్నది.

**3:3:9**

సీ. సకలజీవుల సృష్టి సక్రమ రీతిగ
చేయంగ పరమేష్ఠి చెలగునటుల
బ్రహ్మను సృజియించె పరమాత్మ నాభిలో
చల్లతామరను వాసంబు చేసి

లీలలు పెక్కులు లెక్కింప శక్యమే
కనిపించి నాడ మీ కనుల ముందు
నటవిని పయనించి యటనట తిరుగాడు
నసురుల తునుమాడె నచ్యు తుండు
తే. గీ. గజము, ధేనువు, బకుడన గణన కెక్కు
రక్కసులవధియించెగా రహిని నాడు
జయము సాధించి మరలిన చక్రధారి
కనుల నిలిచెబృందావన వనుల యందు. 142

''జీవ సృష్టి చేసే నిమిత్తంగ ఆ పద్మనాభుడు, తన నాభిలో తామరను నివాసస్థానంగ నేర్పరచి పరమేష్టిని సృష్టించాడు. అతని లీలలు అసంఖ్యాకములు. అలనాడు అడవిలో తిరుగాడుతు గజాసురుని, ధేనుకాసురుని, బకాసురుని అని ఎందరో అసురులను వధించి జయాన్నిపొంది ఏ తెంచుతున్న చక్రధార శ్రీ కృష్ణుని బృందావనంలో చూచాను నేను'' అంటున్నది ఆండాళ్.

''నాట్టైప్పడై యొన్టు అయున్ ముదలా'' అని ప్రారంభం. సృష్టికర్తయైన బ్రహ్మకే సృష్టి కర్త ఆ సర్వేశ్వరుడే అనుట తాత్పర్యం. అసురుల అసుర ప్రవృత్తి నిరూపు మాపటమే జగన్నాథుని కర్తవ్యమనుట సూచితము.

**3:3:10**

సీ. మకరికి చిక్కిన మదపుటేనుగ బ్రోచి
భక్తవత్సలుడయ్యె పరమ మూర్తి
భువి వెలసెనునేడు పుణ్యబృందావన
వాటిక యందని పాడె గోద
తన వారు తానును తరియించి రనుచును
పాడిన గోదమ్మ పాటలివియె
విష్ణుచిత్తుమమత విరివిగా పొందుచు
పాడిన నెవ్వరీ పాశురములు
తే. గీ. ఆధి వ్యాధుల హరియించు నౌషధంబు
లగును పరమపదము పొందనరయగలరు

సన్నిధిని నుందు రెప్పుడు సంశయంబు
వలదు సత్యమే శ్రీ సూక్తి ఫలములి వియె. 143

ఫలశ్రుతిగ చెప్పిన పాశురమిది. ఈ పది పాశురాలలోను శ్రీ కృష్ణుని రూపలావణ్య స్వరూపసాక్షాత్కార వర్ణనలుండటం చేత ఈ పాటలను పాడినవారు ఆగజేంద్రుని కాపాడిన శ్రీ మహా విష్ణువు అనుగ్రహాన్ని గోదాదేవి తండ్రి విష్ణుచిత్తుని కృపను పొంది, లౌకిక వ్యాధులనుండి, మానసిక బాధల నుండి ముక్తిని పొంది సదాసాన్నిధ్య సుఖాన్ని పొందగలరనుటలో సంశయము లేని శ్రీ సూక్తి యిది అనుట భావము.

''పరుందాట్ కళిట్టుక్కు'' అని ప్రారంభం. భక్తులను కాపాడిన కథానికలెన్ని వున్నప్పటికి గజేంద్రమోక్ష సంఘటన ప్రస్తావింప బడుటకు కారణము, మకరమనే లౌకిక వాసనలలో చిక్కుకున్న గజము వంటి జీవునకు శ్రీ మన్నారాయణుని అనుగ్రహం లభించనిదే మార్గాంతరం లేదనుట సారంశం.

## உலகத் தமிழாராய்ச்சி நிறுவனம் சென்னை - 600 113.

## அண்மை வெளியீடுகள்

| | |
|---|---|
| AN INTRODUCTION TO RELIGION AND PHILOSOPHY | |
| T.EVARAM AND TIVVIYAPPRAPANTAM | 200.00 |
| ஐங்குறுநூறு மூலமும் உரையும் | 85.00 |
| தனிநாயகம் அடிகளாரின் சொற்பொழிவுகள் | 40.00 |
| நானும் என் எழுத்தும் | 50.00 |
| தமிழர் கட்டிடக்கலை | 30.00 |
| THE NARRINAI FOUR HUNDRERD | 175.00 |
| சர்வக்ஞர் உரைப்பா | 40.00 |
| தமிழில் ஆவணங்கள் | 75.00 |
| தமிழ் மேடை நாடக வரலாறு | 55.00 |
| பரதநாட்டிய சாஸ்திரம் | 150.00 |
| இந்திய விடுதலைக்குப் பின் தமிழிலக்கியச் செல்நெறிகள் | 55.00 |
| மேலை நோக்கில் தமிழகக்கவிதை | 100.00 |
| SOUND CORRESPONDENCES BETWEEN TAMIL & JAPANESE | 35.00 |
| அயலகத் தமிழ்க்கலை, இலக்கியம், சமகாலச் செல்நெறிகள் | 125.00 |
| TAMIL LITERARURE AND INDIAN PHILOSOPHY | 200.00 |
| சதகத்திரட்டு தொகுதி -1 | 80.00 |
| தொல்காப்பிய இலக்கண மொழியியில் கோட்பாடுகள் | 70.00 |
| எழுத்திலக்கணக் கோட்பாடு | 70.00 |
| சதகத்திரட்டு தொகுதி -2 | 55.00 |
| தமிழ்ப் பண்பாடு | 25.00 |
| உலகத் தமிழாராய்ச்சி நிறுவனர் சுவடி விளக்க அட்டவணை -4 | 70.00 |
| சுவடிச்சுடர் | 120.00 |
| தமிழிலக்கியத்தில் ஊனமுற்றோர் | 45.00 |
| தமிழக மகளிரியல் | 80.00 |
| தமிழ்மொழி - இன - இலக்கிய மேம்பாடு | |
| மறைமலையடிகளாரின் பங்களிப்பு | 20.00 |
| அறிவியல் தொழில் நுட்பக் கல்வி இன்றைய சந்தைச் சவால்கள் | 25.00 |
| WORK BOOK SPOKEN TAMIL | 50.00 |
| தமிழ் அன்னை | 40.00 |
| பெரியாரின் பண்பாட்டுப் புரட்சி | 25.00 |
| வ.உ.சி. வளர்த்த தமிழ் | 20.00 |
| மிருச்சகடிகம் | 50.00 |
| தமிழக வரலாறு மக்களும் பண்பாடும் | 125.00 |
| தமிழில் விடுதலை இலக்கியம் | 20.00 |
| உலக அரங்கில் தமிழ் | 30.00 |
| பாரதி இந்தியா | 40.00 |
| தெசிணியின் தமிழாக்கப்பாடல் திரட்டு | 50.00 |
| உவேசா பதிப்புப்பணியும் பன்முகமாட்சியும் | 35.00 |
| தமிழ்மொழியின் வரலாறு | 30.00 |
| கோவலன் கதை | 50.00 |
| தமிழ் அச்சுத்தந்தை அண்ட்ரிக் அடிகளார் | 30.00 |

Pub. No.456 நாச்சியார் திருமொழி (தெலுங்கு) 40.00